అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 9-2-2018 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 42 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

గ్రూప్-1లో

గందరగోళం!

అనుమానాలు వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

తెలంగాణలో గ్రూప్-1 నియామకాల ప్రక్రియపై మళ్లీ అనుమానాలు మొదలయ్యాయి. గ్రూప్-1 నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయని పలువురు అభ్యర్థులు వాపోతున్నారు. గ్రూప్-1 రాష్ట్రస్థాయి పోస్టులకు సంబంధించింది. ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ పద్ధతుల ద్వారా ఎంపిక ప్రక్రియ ఉంటుంది. మెయిన్స్, ఇంటర్వ్యూలో వచ్చిన మార్కుల ఆధారంగానే మెరిట్ అభ్యర్థులకు ఉద్యోగాలొస్తాయని 2011 గ్రూప్-1 నోటిఫికేషన్‌లో నిబంధనలున్నాయి. ఆ నిబంధనలకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) తిలోదకాలు ఇచ్చిందని పలువురు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.



- తక్కువ మార్కులొచ్చినా ఇంటర్వ్యూకు ఎంపిక
- ఆర్టీఐ ద్వారా వివరాలు సేకరించి టీఎస్‌పీఎస్సీకి ఫిర్యాదు
- అర్హత ఉన్నోళ్లను ఎంపిక చేయలేదు
- నిబంధనల ప్రకారమే నియామకాలు : ఘంటా చక్రపాణి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులను విస్మరించి తక్కువ మార్కుల వచ్చిన వారిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారన్న అనుమానాలు అభ్యర్థుల్లో వ్యక్తమవుతున్నాయి. గ్రూప్-1 మెయిన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నాగిరెడ్డికి 399.32 మార్కులొచ్చాయి. అదే వరంగల్ జిల్లాకు చెందిన సిహెచ్ అనిల్‌కుమార్ 406.93 మార్కులు సాధించారు. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా సేకరించడంతో నిజాలు వెల్లడయ్యాయి. మెరిట్‌ను బట్టి చూస్తే నాగిరెడ్డి కంటే అనిల్‌కుమార్ 7.61 మార్కులు అధికంగా ఉన్నారు. మార్కులను బట్టి చూస్తే అనిల్‌కుమార్ గ్రూప్-1 ఇంటర్వ్యూకు ఎంపిక కావాలి. కానీ 7.61 తక్కువ మార్కులొచ్చిన నాగిరెడ్డిని ఇంటర్వ్యూకు ఎంపిక చేయడం పలు అనుమానాలకు తావిస్తున్నది. వాటి ఆధారంగా తనకు జరిగిన అన్యాయంపై టీఎస్‌పీఎస్సీలో ఓ అభ్యర్థి ఫిర్యాదు చేశారు. అర్హత ఉన్న వారిని ఎంపిక చేయలేదని, తక్కువ మార్కులొచ్చిన వారిని ఇంటర్వ్యూకు ఎంపిక చేశారని అభ్యర్థి వాపోయారు. ఈ అంశంపై కోర్టుకైనా వెళ్తానని అన్నారు. దీని ఆధారంగా గ్రూప్-1 నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని పలువురు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారమే గ్రూప్-1 నియామకాల ప్రక్రియ చేపట్టామని టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి నవతెలంగాణతో చెప్పారు.

మార్కులివ్వకపోవడమే పారదర్శకతా?

ఉమ్మడి రాష్ట్రంలో 2011 గ్రూప్-1 ప్రిలిమినరీ 9లో

పద్దు భలే..ఖర్చే డల్!

ప్రణాళికా వ్యయం తీరిది

- నాలుగేండ్లలో కేటాయింపులు రూ.లక్షా 99 వేల కోట్లు
- వ్యయం కాకుండా మిగిలింది రూ.61 వేల కోట్లు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గతంలో ప్రణాళికా వ్యయం.. ఇప్పుడు ప్రగతి పద్దు.. పేరేదైనాగానీ బడ్జెట్లలో ఈ పద్దుకు ఉండే ప్రాధాన్యతే వేరు. దీర్ఘకాలంలో రాష్ట్ర అభివృద్ధికోసం వినియోగించే నిధులను ప్రణాళికా వ్యయంలో పొందుపరుస్తారు. మౌలిక వసతుల కల్పన, వ్యవసాయం, సాగు, తాగునీరు తదితర సౌకర్యాల కల్పన కోసం ఈ నిధులను వెచ్చిస్తారు. ఇంతటి ప్రాముఖ్యమున్న ప్రగతి పద్దుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకూ ప్రవేశపెట్టిన నాలుగు బడ్జెట్లలో కలిపి మొత్తం రూ.లక్షా 99 వేల కోట్లను ఈ పద్దు కింద కేటాయించారు. ఇందులో రూ.1,37,621 కోట్లను ఖర్చు చేసినట్టు చూపించారు. మిగతా రూ.61,493 కోట్లను ఖర్చు చేయకుండా వదిలేశారు. టీఆర్ఎస్ సర్కారు ఈ విధంగా బడ్జెట్లలో ప్రగతి పద్దుకు ఎక్కువ నిధుల్ని ప్రతిపాదించటం ద్వారా ఏడాదికేడాది బడ్జెట్లను భారీ స్థాయిలో పెంచి చూపిస్తున్నది. కానీ అదే స్థాయిలో ఖర్చు చేయకపోవటంపై ఇప్పుడు ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్ 9లో



ఇంటికి దారేదీ..



'మా ఊరు చుట్టూ నీరు. వర్షాకాలమే కాదు వేసవిలోనూ రాకపోకలుండవ్. ఏదైనా అవసరం పడితే పుట్టీల మీద పోవాల్సిందే. మిషన్ భగీరథ పథకం మా ఊరికి లేదంట. కంపెనీలు విడుదల చేసే కాలుష్యపు నీళ్లు తాగుతుంటే చర్మ, కిడ్నీ వ్యాధులు వస్తున్నయ్. కాన్పులైనా... గుండెపోటొచ్చినా ఇక అంతే. నీళ్లు, రోడ్డు సౌకర్యం లేని మా ఊరి యువతకు పెండ్లిళ్లు అయితలెవ్'. ఇదీ జోగులాంబ గద్వాల జిల్లా గుర్రంగడ్డ గ్రామస్తుల ఆవేదన.

చుట్టూ నీరు..మధ్యలో ఊరు

- రోడ్డు లేదు...పుట్టి ఉంటేనే బయటికి
- పెండ్లిళ్లు కాక బ్రహ్మచారులుగా యువత
- ఇదీ జోగులాంబ గద్వాల జిల్లా గుర్రంగడ్డ గ్రామ దుస్థితి..

నవతెలంగాణ-మహబూబ్‌నగర్‌ప్రతినిధి

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రానికి 16 కిలోమీటర్ల దూరంలో ఉంది గుర్రంగడ్డ. గ్రామంలో 150 కుటుంబాలు, 600 మంది ఓటర్లు, 1500 మంది జనాభా ఉంది. వెయ్యి ఎకరాల సాగు భూమి ఉంది. వరి, చెరుకు పంటలు అధికంగా సాగు చేస్తారు. ఇక్కడ రెడ్డి, తెనుగు, ఎస్సీలు మాత్రమే ఉన్నారు. ఉపాధి వనరులు పుష్కలంగా ఉన్నా.. విద్యా, వైద్యం, వివాహం, తాగునీటితో పాటు సంక్షేమ పథకాలకు ఈ గ్రామ దూరంగా ఉంది. గ్రామానికి పెబ్బేరు నుంచి వెళ్లాలంటే రాంపూర్‌మీదగా కృష్ణా నదిని దాటి వెళ్లాల్సి ఉంటుంది. నది ఉధృతి తక్కువగా ఉంటే.. 9లో

దళితుని భూమి

కేంద్రమంత్రి కబ్జా

- మోడీక్యాబినెట్ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో సహా 32 మందిపై కేసు
- బీహార్..పాట్నాలోని దనాపూర్‌లో దౌర్జన్యం



పాట్నా : కేంద్ర మంత్రి, బీహార్‌లోని నవాడా లోక్‌సభ బీజేపీ ఎంపీ గిరిరాజ్ సింగ్‌పై భూ కబ్జా కేసు నమోదు అయ్యింది. గిరిరాజ్ సింగ్‌తోపాటు, మరో 32 మందిపై పాట్నా జిల్లా దనాపూర్ పోలీసు స్టేషన్‌లో ఈ కేసును నమోదు చేశారు. దళితునికి చెందిన రెండు ఎకరాల స్థలాన్ని అక్రమంగా 9లో

పథకాల తీరేం బాగలేదు

- మోడీ సర్కారుకు బీజేపీ ఎంపీ ఝలక్ 2లో

పాలకుల పాపం ..

పిల్లలకు శాపం

- ఉపాధి లేక.. మతిస్థిమితం కోల్పోయి..
- చిన్నారులకు విషమివ్వబోయిన ఎస్పీఎం కార్మికుడు
- మిల్లు మూతపడటంతో ఆర్థికంగా చితికిన కుటుంబం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పిల్లల భవిష్యత్‌పై ఎన్నో కలలుగన్నాడు. ఉన్నతంగా చదివించి వారి జీవితానికి బంగారు బాటలు వేద్దామనుకున్నాడు. కానీ పాలకులు చేసిన పాపం వారి ఆర్థిక స్థితిని దెబ్బతీసింది. ఎస్పీఎం మిల్లు మూతపడటంతో ఉపాధి కోల్పోయి.. కుటుంబాన్ని పోషించు కోలేని నిస్సహాయస్థితిలో మతిస్థిమితం కోల్పోయాడు. తానేమి చేస్తున్నాడో తెలియని స్థితిలో కన్నబిడ్డలకే బలవంతంగా విషం కలిపిన ఆహారం తినిపించబోయాడు. తల్లి సకాలంలో గమనించడంతో చిన్నారులు

ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. సిర్పూర్ పేపర్ మిల్లులో పనిచేసి రోడ్డునపడిన ఓ కార్మికుడి ఉదంతమిది. ఈ ఘటన ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం తెల్లవారు జామున కలకలం రేపింది. ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన 9లో



సరోగసీతో పిల్లల్ని కంటే

ప్రసూతి సెలవులు

- కేంద్ర ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు

న్యూఢిల్లీ: సరోగసీ (ఆశ్రిత గర్భం) ద్వారా పిల్లల్ని కనే మహిళా ఉద్యోగులకు కూడా ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల ఉద్యోగుల శిక్షణ విభాగం (డీవోపీటీ)నకు ఆదేశాలు జారీ చేసింది. 2015లో ఢిల్లీ 9లో

నల్లగొండ జిల్లాలో రోడ్డు ప్రమాదం



- కల్వర్టును ఢీకొట్టిన డీసీఎం
- ముగ్గురు దుర్మరణం
- 56 గొర్రెలు మృత్యువాత
- రంగారెడ్డిలో నిప్పంటుకొని 80 మేకలు మృతి

వివరాలు 3లో



విభజనపై కట్టుబడి ఉండాలి

- కాళేశ్వరానికి ఆర్థిక సాయం చేయండి
- రైతుల ఆదాయం రెండింతలకు నిర్దిష్ట చర్యలు శూన్యం: వార్షిక బడ్జెట్‌పై చర్చలో ఎంపీ కవిత

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిన హామీలపై కేంద్రం కట్టుబడి ఉండాలని టీఆర్ఎస్ ఎంపీ కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతాయని కానీ పాలన మారదని గుర్తు చేశారు. ఇక తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు ఆర్థిక సాయం చేయాలని కోరారు. నాలుగేండ్లుగా రైతుల ఆదాయం రెండింతలు చేస్తామని కేంద్ర సర్కారు ప్రకటిస్తోందని, కానీ అందుకు అవసరమైన నిర్దిష్టచర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. గురువారం లోక్‌సభలో 9లో

కాక్కొరోకో..



సార్..వీటిని తడి చెత్తలో వేయాలా...? పొడి చెత్తలో వేయాలా..?.. !!

స్తంభించిన ఏపీ



విజయవాడలో..

రోడ్డెక్కని బస్సులు.. విద్యా సంస్థలు బంద్

- కలిసొచ్చిన అన్ని పక్షాలు..టీడీపీ నిరాహారదీక్ష
- కుండ, మట్టితో వినూత్న నిరసన
- మోడీ సర్కారుపై జనాగ్రహం..పలుచోట్ల అరెస్టులు

అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ గురువారం ఆ రాష్ట్రంలో వామపక్షాలు నిర్వహించిన బంద్ విజయవంతమైంది. వైసీపీ, జనసేన, కాంగ్రెస్, ఇతర ప్రజా సంఘాలన్నీ బంద్‌లో పాల్గొన్నాయి. బస్సులు రోడ్డెక్కలేదు. విద్యా సంస్థలు పరీక్షలను వాయిదా వేశాయి. పలుచోట్ల వామపక్ష నాయకులు, జర్నలిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. తెలుగుదేశం నాయకులూ నిరాహార దీక్షలు చేపట్టారు. పలు చోట్ల బంద్‌లోనూ పాల్గొన్నారు. పోలీసులూ బంద్‌కు సహకరించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ బంద్ సంపూర్ణంగా విజయవంతమైంది. బంద్‌లో భాగంగా విజయవాడలో ఉదయం నాలుగున్నర 9లో

విజయవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో..



Dwaraka

ప్రధాని ప్రసంగం డ్రామాను తలపించింది

- సీపీఐ(ఎం) ఎంపీ సలీమ్

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో ప్రధాని మోడీ ప్రసంగం డ్రామాను తలపించిందని సీపీఐ(ఎం) ఎంపీ మహ్మద్ సలీమ్ అన్నారు. ప్రధాని తన ప్రసంగంలో చరిత్ర చెప్పారు తప్ప ప్రజల సమస్యల గురించి మాట్లాడలేదని సలీమ్ విమర్శించారు. ఇతరులను నిందించడానికే ప్రధాని ఆసక్తి చూపారని సలీమ్ అన్నారు. బడ్జెట్ సమావేశాల మొదటి అర్ధభాగం జరిగిన తీరు పట్ల సలీమ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు తమ గొంతు వినిపించేందుకు ఈ సమావేశాల్లో అవకాశం లభించలేదని ఆయన అన్నారు. ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలకు కూడా మాట్లాడేందుకు అవకాశమివ్వకపోవడాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సమావేశాల్లో ప్రతిపక్షాల పాత్రను కూడా బీజేపీ మిత్ర పక్షాలే పోషించాయని ఆయన అన్నారు.

డార్విన్ సిద్ధాంతం తొలగించట్లేదు

- వెనక్కితగ్గిన కేంద్రం

న్యూఢిల్లీ : శాస్త్రీయంగా నిరూపితంకాని డార్విన్ సిద్ధాంతాన్ని పాఠ్యపుస్తకాల నుంచి తీసేస్తే బాగుంటుందన్న కేంద్రమంత్రి సత్యపాల్‌సింగ్ వెనక్కుతగ్గారు. పాఠ్యాంశాల నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించే ఆలోచనే లేదని ఆయన గురువారం పార్లమెంటులో రాతపూర్వకంగా అడిగిన ప్రశ్నకు బదులిస్తూ చెప్పారు. సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం జీవశాస్త్రంలో డార్విన్ సిద్ధాంతం ఓ పాఠ్యాంశంగా బోధిస్తున్నారు. అందువల్ల ఆ పాఠం పుస్తకాల్లో అలాగే కొనసాగుతుందని మంత్రి బదులిచ్చారు. కాగా కేంద్ర నిర్ణయంపై 9మంది బీజేపీ ఎంపీలు మోడీకి లేఖ రాశారు. రాంచీలో ఉన్న భారత్ హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తున్నారు.

'మధ్యాహ్న భోజన' మేనేజర్ ఆత్మహత్య

- దళితుడి పేరుతో టీచర్లు వేధించారంటూ...

అహ్మదాబాద్ : స్కూల్ టీచర్ల వేధింపులు తాళలేక మధ్యాహ్న భోజన పథకం మేనేజర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గుజరాత్‌లోని మెహసానా జిల్లాలో చోటు చేసుకున్నది. దళితుడు అయినందునే స్కూల్ సిబ్బంది వేధింపులకు గురి చేశారని మృతుడి భార్య.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. జిల్లాలోని వాద్నాగర్ సమీపంలోని షేక్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో మహేశ్ చౌహాన్ అనే దళితుడు మధ్యాహ్న భోజన పథకం మేనేజర్‌గా పని చేస్తున్నాడు. కాగా.. దళిత వ్యక్తి మధ్యాహ్న భోజన విధులు నిర్వర్తించడం స్కూల్‌లోని ముగ్గురు టీచర్లకు రుచించలేదు. ఈ క్రమంలోనే ఏడాదికాలంగా మహేశ్‌ను వేధిస్తూనే ఉన్నారు. అంతేకాక, సొంత డబ్బులతో తమకు స్నాక్స్ తెచ్చి ఇవ్వాలని ఆయనను బెదిరించేవారు. ఈ వేధింపులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్తాపం చెందిన మహేశ్.. గురువారం ఉదయం ఓ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద లభించిన సూసైడ్‌నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టీచర్ల వేధింపులు రోజురోజుకూ ఎక్కువౌతున్నాయని మహేశ్ తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. మృతుడి భార్య ఇలాబెన్ ఫిర్యాదు మేరకు టీచర్లు వినోద్ ప్రజాపతి, అమాజీ ఠాకూర్, అబ్బాస్‌భాయ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు పోలీసు అధికారి ఆర్ఎల్ ఖరాడీ వెల్లడించారు. ఘటనపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తున్నారని, నివేదిక వచ్చిన తర్వాత నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని గుజరాత్ సామాజిక న్యాయ శాఖ మంత్రి ఈశ్వర్ పర్మార్ తెలిపారు.

'తాజ్' పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేంటి..?

- యూపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: చారిత్రక పర్యాటక ప్రదేశం తాజ్‌మహల్ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై నాలుగు వారాల్లో సమగ్ర వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆగ్రా నగరంలోని తాజ్ ట్రపేజియమ్ జోన్ (టీటీజెడ్) చుట్టూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతున్న నేపథ్యంలో.. ఎందుకింత తొందరగా కార్యక్రమాలను చేపడుతున్నారో వివరణ ఇవ్వాలని న్యాయమూర్తి యం.బి.లోకుర్, దీపక్ గుప్తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అలాగే టీటీజెడ్ పరిసర ప్రాంతాల్లోకి తోలు పరిశ్రమలు, హోటళ్లు ఎందుకొచ్చాయో సమాధానమివ్వాలని ఆదేశించింది. టీటీజెడ్ చుట్టూ ఉన్న 234 చెట్లను నరికివేయడానికి అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు వారాల క్రితం సుప్రీంకోర్టులో స్పెషల్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై అత్యున్నత న్యాయస్థానం స్పందిస్తూ... అవి తొలగించడానికి ముందు ఇప్పటివరకు ఎన్ని మొక్కలు నాటారని ప్రశ్నించింది. తాజ్ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సరిపోవని, చారిత్రక కట్టడాన్ని భవిష్యత్ తరాలకు అందించడం కోసం దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాలని సూచించింది.

రెండో రోజుకు చేరిన ఆశా వర్కర్ల ఆందోళన

- కర్నాటకలో ఉధృతంగా నిరసనలు

బెంగళూరు : నెలవారీ స్థిర గౌరవ వేతనం చెల్లించాలనీ, ఆన్‌లైన్ పేమెంట్ వ్యవస్థ ఆషా సాఫ్ట్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు బెంగుళూరులో చేపట్టిన నిరవధిక నిరసన గురువారం రెండో రోజుకు చేరుకుంది. నగరంలోని ఫ్రీడం పార్కులో వేలాది మంది కమ్యూనిటీ ఆరోగ్య కార్యకర్తలు బుధవారం నుంచి నిరవధిక ఆందోళన ప్రారంభించారు. బెంగళూరు సిటీ రైల్వే స్టేషన్ నుంచి ఫ్రీడం పార్కు వరకూ బుధవారం ఉదయం ర్యాలీగా వచ్చిన ఆశా వర్కర్లు అక్కడే బైఠాయించారు. తమ డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకూ ఆందోళన విరమించేది లేదని తెలిపారు.

బీజేపీని ఓడించేందుకు భావసారూప్య పార్టీలతో కూటమి : సోనియాగాంధీ

న్యూఢిల్లీ: ఏడాది తర్వాత జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించడం కోసం భావసారూప్య పార్టీలతో కలిసి పని చేయడానికి సిద్ధమని కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం మైనారిటీలు, దళితులపై హింసను ప్రోత్సహిస్తున్నదని సోనియాగాంధీ అన్నారు. మరికొన్ని నెలల్లో ఎన్నికలు జరగనున్న కర్నాటకలోనూ బీజేపీ అవే ఎత్తుగడలను అనుసరించనున్నట్టు సోనియా అనుమానం వ్యక్తం చేశారు. గురువారం కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ సోనియాగాం ధీ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్‌గా సోనియాగాంధీ కొనసాగుతున్నారు. కాంగ్రెస్‌కు నూతన అధ్యక్షుడిని మనం ఎన్నుకున్నాం. మీ తరపున నా కుమారుడిని ఎన్నుకున్నందుకు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నాను. ఇప్పుడు నాకు కూడా రాహుల్ గాంధీనే బాస్, ఇందులో ఎటువంటి అనుమా నమూ లేదు. నాతో కలిసి పని చేసినట్టే ఆయనతోనూ అంకితభావంతో, నమ్మకంతో, ఉత్సాహంగా పని చేస్తారన్న విశ్వాసం తనకున్నదని సోనియాగాంధీ అన్నారు.

ప్రధానికి సభా హక్కుల ఉల్లంఘన నోటీస్


న్యూఢిల్లీ : రాజ్యసభలో బుధవారం కాంగ్రెస్ సభ్యురాలు రేణుక చౌదరి పట్ల ప్రధాని నరేంద్రమోడీ చేసిన అవమానకరంగా వ్యవహరించడంపై కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మోడీకి సభా హక్కుల ఉల్లంఘన నోటీసు పంపనున్నట్టు రేణుకా చౌదరి చెప్పారు. మోడీ ప్రసంగిస్తున్న సమయంలో రేణుకా చౌదరి బిగ్గరగా నవ్వారు. నిశ్శబ్దంగా సభ చైర్మన్ వెంకయ్యానాయుడు ఆమెకు సూచించగా, 'ఆమె నవ్వును ఆపకండి, రామాయణం సీరియల్‌లో ఇటువంటి నవ్వును చూశానని, మళ్లీ మొదటిసారిగా అలాంటి నవ్వును చూసే అవకాశం కలిగిందని మోడీ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

మూడు రైళ్లలో సీసీటీవీ కెమెరాలు


న్యూఢిల్లీ : ప్రయాణికులు భద్రతను దృష్టిలో వుంచుకొని త్వరలో శతాబ్ది, రాజధాని, దురంతో రైళ్లల్లోని ప్రతి కోచ్‌కు నాలుగు సీసీటీవీల చొప్పున అన్ని కోచ్‌లలో ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. రైలు ప్రవేశ మార్గం వద్ద, కారిడార్‌లోనూ వీటిని అమర్చనున్నట్టు ఉత్తర రైల్వే జనరల్ మేనేజర్ పేర్కొన్నారు. సుమారు పదకొండు వేల రైళ్లలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు 2018-19 బడ్జెట్‌లో మూడు వేల కోట్ల కేటాయింపులు జరిగాయని పేర్కొన్నారు.

పథకాల తీరేం బాగలేదు..

కేంద్ర సర్కారుకు బీజేపీ ఎంపీ ఝలక్



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి మోడీ నేతృత్వంలో దేశంలో ప్రవేశపెట్టిన పథకాలు అమలు తీరు సరిగా లేదంటూ సాక్షాత్తూ బీజేపీ ఎంపీ అనూప్ మిశ్రా విమర్శించారంటే కేంద్రం పాలన ఏ విధంగా ఉన్నదో స్పష్టమవుతున్నది. పథకాల అమలు సక్రమంగా జరిగినప్పుడే సామాన్య ప్రజలు లబ్ది పొందుతారని ఆయన అన్నారు. గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం ఎన్నో మంచి పథకాలను తీసుకొస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. పథకాల అమలులో ఎనలేని నిర్లక్ష్యం జరుగుతున్నదని ఆరోపించారు. అంతేకాక, ప్రభుత్వం ఏ పథకాన్ని తీసుకొచ్చినా దానికి సంబంధించి ఓ మంత్రి బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. ఎంపీలాడ్స్(మెంబర్స్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీమ్) నిధులు మూడేండ్లుగా అందుబాటులో లేవని, దీనికి బాధ్యత వహించేదెవరో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. తన సొంత జిల్లా(మోరీనా)లో 703 గ్రామ పంచాయతీలు ఉండగా.. మరుగుదొడ్లు పూర్తిగా కలిగి ఉన్నవి 133 మాత్రమేనన్నారు. పథకాల అమలుపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అనూప్ తెలిపారు. అనూప్‌కుమార్ మధ్యప్రదేశ్‌లోని మోరీనా నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.



పెద్దలకు వరాలు.. పేదలకు భారాలు

జైట్లీ పద్దు.. కార్పొరేట్లకు వత్తాసు

- కేంద్ర బడ్జెట్ దిశ మారాలి
- ఉపాధి కల్పనపై తప్పుడు గణాంకాలు
- గ్రామీణ, వ్యవసాయంపై నిధుల కోత : రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ తపన్‌సేన్
- తెలుగు రాష్ట్రాల విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

2018-19 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్ దిశ మార్చాల్సిన అవసరముందని సీపీఐ(ఎం) ఎంపీ తపన్‌సేన్ అభిప్రాయపడ్డారు. బడ్జెట్‌లో దేశంలో ఒక్క శాతంగా ఉన్న కార్పొరేట్లకు, బడా పారిశ్రామికవేత్తలకు వరాలు కురిపించగా.. 99 శాతంగా ఉన్న ప్రజలపై భారాలు మోపారని అన్నారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం-అనుబంధ రంగం, విద్య, ఆరోగ్యం తదితర రంగాలకు నిధుల్లో కోత విధించారని చెప్పారు. ఇక రబీ సీజన్ పంటలకు 50 శాతం లాభంతో కనీస మద్దతు ధర ప్రకటించామని జైట్లీ పేర్కొనడం విస్మయాన్ని కలిగిచిందని అన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి లభిస్తున్న ఉపాధి హామీచట్ట పని దినాలు తగ్గించారని విమర్శించారు. కాగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వార్షిక బడ్జెట్‌పై గురువారం రాజ్యసభలో జరిగిన చర్చలో సీపీఐ(ఎం) ఎంపీ తపన్‌సేన్ మాట్లాడారు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన సమయంలో ఒక్క శాతం జనాభాగా ఉన్న కార్పొరేట్ల వద్ద 48 శాతం దేశ సంపద పోగుకాగా.. ఈ నాలుగేండ్ల కాలంలో అది 73 శాతానికి పెరిగిందని వివరించారు. మోడీ సర్కారు అవలంబిస్తున్న నయా సరళీకరణ ఆర్థిక విధానాలు, కార్పొరేటు అనుకూల విధానాల వల్ల దేశంలో అసమానతలు మరింత పెరిగాయని అన్నారు. ఈ విధంగా ఒక్క ఎన్డీయే హయాంలో జరగడం లేదని, గతంలో యూపీఏ సర్కారు సైతం ఈ విధంగానే బడ్జెట్ రూపొందించిందని విమర్శించారు. '2015-16 బడ్జెట్‌లో కార్పొరేట్ పన్ను రూ.8,325 కోట్లు మినహాయింపు కల్పించారు. అదే యేడాది పరోక్ష పన్నుల కింద అదనంగా ప్రజల నుంచి రూ. 23 వేల కోట్లు వసూలు చేశారు. 2016-17 బడ్జెట్‌లో రూ.1,060 కోట్ల పన్ను మినహాయింపు ఇవ్వగా.. ప్రజల నుంచి రూ. 22,670 కోట్లు అదనంగా ముక్కుపిండి వసూలు చేశారు. ప్రస్తుత బడ్జెట్‌లో కార్పొరేట్లకు రూ. ఏడు వేల కోట్లు మినహాయింపు కల్పించారు' అని విమర్శించారు. అయితే ఈ యేడాది పరోక్ష పన్నులను జీఎస్టీ రూపంలో అధికంగా వసూలు చేశారని అన్నారు. 'జీఎస్టీ ఆమోదం సమయంలో కేంద్ర, రాష్ట్ర పన్నులతో పోల్చితే పరోక్ష పన్నులు పెరగబోవని కేంద్రం చెప్పింది. కానీ ప్రస్తుతం జీఎస్టీకి ముందు ఉన్న పరోక్ష పన్నుల శాతంతో పోల్చితే ప్రస్తుతం వినియోగదారులు అధికంగా పన్ను చెల్లిస్తున్నారు' అని వివరించారు. జీఎస్టీ పన్నుల వసూలు తటస్థంగా ఉంటుందని అప్పట్లో కేంద్ర ఆర్థికమంత్రి జైట్లీ చెప్పారని, కానీ అందుకు విరుద్ధంగా ప్రస్తుతం ప్రత్యక్ష, పరోక్ష పన్నులు పెరిగాయని తెలిపారు. ఆరోగ్యరంగంపై మొత్తం జీడీపీతో పోల్చితే గత బడ్జెట్‌లో 13.2 శాతం నిధులు కేటాయించగా.. ఈ యేడాది 13 శాతానికి తగ్గించారని చెప్పారు. అలాగే వ్యవసాయం, అనుబంధ రంగాలపై రూ.9,793 కోట్లు ఎక్కువగా కేటాయించామని ఆర్థికమంత్రి ప్రకటించారని, కానీ మొత్తం జీడీపీ, బడ్జెట్‌తో పోల్చితే నిధులు తగ్గాయని వివరించారు. ఇదే విధంగా విద్యపై కేటాయింపులు 0.49 శాతం నుంచి 0.29 శాతానికి తగ్గాయన్నారు. కేంద్ర ఆర్థికమంత్రి కనీస మద్దతు ధరపై అబద్ధాలు చెప్పారని తపన్‌సేన్ విమర్శించారు. రబీకాలంలో పంటసాగుకు అయిన ఖర్చుపై 50 శాతం లాభంతో మద్దతు ధర ప్రకటించామని పేర్కొనడం పూర్తి అవాస్తవమని చెప్పారు. ఉపాధి పని దినాల్లో కోత విధించారని చెప్పారు. ఇక ఉపాధి కల్పనపై వివిధ మంత్రిత్వశాఖలు వేర్వేరు గణంకాలు ప్రకటిస్తున్నాయని, ఏ లెక్కలను విశ్వాసంలోకి తీసుకోవాలని ప్రశ్నించారు. పైగా ఈపీఎఫ్ఓ ఖాతాల సమాచారం ఆధారంగా ఉపాధి కల్పన పెరిగిందని పేర్కొనడం కుట్ర అని విమర్శించారు. ఉపాధి-నిరుద్యోగం సర్వే ప్రకారం కీలక రంగాల్లో ఉద్యోగాలు కోల్పోయారని వివరించారు. ఐటీల్లో 15 వేల మంది, టెలికా రంగంలో 40 వేల మంది, తయారీ రంగంలో 35 శాతం మంది ఉపాధి కోల్పోయారని చెప్పారు. ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించడకుండా.. వ్యాపారం సులభతరం పేరిట కార్మికుల చట్టాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. పైగా రాష్ట్రాలకు వివిధ పథకాల కింద ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకుండా ఆర్థికసంక్షోభంలోకి నెట్టుతున్నారని



ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం సులభతరం ర్యాంకింగ్‌లో మెరుగుపడుతున్నామని ఆనంద పడుతున్నారని, కానీ ప్రపంచ ఆకలి సూచీలో భారత ర్యాంకు దిగజారుతుందని, ఈ విషయాన్ని కేంద్ర పెద్దలు గ్రహించాలని చురకలంటించారు. పిల్లల్లో పోషకాహారలోపం, శిశుమరణాలు అన్నింట్లో చాలా దేశాల కంటే దిగువన ఉన్నామని అన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి

'ఆంధ్రప్రదేశ్ ఎంపీలు తమ న్యాయమైన డిమాండ్లపై రెండు, మూడు రోజులుగా సభలో పోరాటం చేస్తున్నారు. ఏపీ విభజన చట్టం ఆమోదించే సమయంలో ఇదే సభలో అప్పటి ప్రతిపక్ష(బీజేపీ), అధికార పక్షాలు పలు వాగ్ధానాలు చేశాయి. ఆ హామీలన్నీ అమలు చేయాలి' అని తపన్‌సేన్ డిమాండ్ చేశారు.

ఇది పూర్తిగా భూ వివాదం

- అయోధ్య కేసు విచారణ మార్చి 14కు వాయిదా

న్యూఢిల్లీ: అయోధ్యలోని బాబ్రీ మసీద్-రామ జన్మభూమి వివాదాస్పద స్థలంపై ఇతర పిటిషన్లు ఏవీ స్వీకరించబోమని ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం తేల్చి చెప్పింది. వివాద స్థలంలో ఆస్పత్రి నిర్మించాలంటూ సినీ నిర్మాత శ్యాంబెనగల్‌సహా 32మంది ప్రముఖులు వేసిన పిటిషన్‌ను ధర్మాసనం తిరస్కరించింది. ఇది పూర్తిగా భూ వివాదమని ఈ సందర్భంగా సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను మార్చి 14కు వాయిదా వేసింది. ఈలోగా తమ వాదనలను బలపరిచే కొన్ని పత్రాలను కోర్టుకు సమర్పించాలని ఈ కేసులోని వైరి పక్షాలను ధర్మాసనం ఆదేశించింది. దీనిపై విచారణ జరుపుతున్న ధర్మాసనంలో జస్టిస్ అశోక్‌భూషణ్, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ సభ్యులుగా ఉన్నారు. వైరి పక్షాలు తమ వాదనల సారాంశ పత్రాలను ఇచ్చిపుచ్చుకోవాలంటూ గురువారం విచారణ సందర్భంగా ఓ హిందూ సంస్థ తరపున వాదిస్తున్న సిఎస్ వైద్యనాథన్ చేసిన ప్రతిపాదనను ముస్లిం సంస్థ తరపు న్యాయవాది రాజీవ్‌ధావన్ తిరస్కరించారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్యా వాగ్వివాదం చోటు చేసుకున్నది.

అయోధ్యలోని స్థల వివాదంపై ఆరు దశాబ్దాలుగా కోర్టు కేసులు నడుస్తున్నాయి. 1992, డిసెంబర్ 6న ఆ స్థలంలోని బాబ్రీ మసీద్‌ను హిందూత్వవాదులు కూల్చి వేయడంతో వివాదం కొత్త మలుపు తిరిగింది. 2010లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టు 2-1 మెజార్టీతో ఈ కేసులో తీర్పు చెప్పింది. వివాద స్థలంగా భావిస్తున్న 2.7 ఎకరాలను సున్నీ వక్ఫ్ బోర్డు, నిర్మోహి అఖారా, రామ్‌లల్లాకు సమాన భాగాలుగా పంచాలని ఆ తీర్పులో పేర్కొన్నది. ఆ తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన 13 పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారిస్తోంది. దీనిపై వాదనలను 2019 సార్వత్రిక ఎన్నికల తర్వాత చేపట్టాలని గతేడాది డిసెంబర్‌లో విచారణ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్‌సిబల్ సుప్రీంకోర్టుకు సూచించగా తిరస్కరించింది. పలు ముస్లిం సంస్థల తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, దుష్యంత్ దవే, రాజీవ్ ధావన్ వాదిస్తున్నారు. మరోవైపు ఈ వివాదానికి పరిష్కారంగా అయోధ్యలో రామాలయాన్ని, లక్నోలో మసీద్‌ను నిర్మించాలంటూ షియా సెంట్రల్ వక్ఫ్ బోర్డు తన ప్రతిపాదనను సుప్రీంకోర్టుకు గతేడాది నవంబర్‌లో సమర్పించింది.

రాజస్థాన్ సర్కారుకు అసమ్మతి సెగ

- సీఎం పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి
- వెంటనే పార్టీ నాయకత్వాన్ని మార్చాలని అమిత్‌షాకు లేఖ

జైపూర్: రాజస్థాన్‌లో వసుంధర రాజే సర్కారుకు అసమ్మతి సెగ తగులుతోంది. సీఎం వసుంధర రాజే పాలనలో ప్రజలు విసుగెత్తి ఉన్నారని, రాష్ట్రంలో నాయకత్వాన్ని వెంటనే మార్చాలంటూ బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షాకు పార్టీ ఓబీసీ విభాగం లేఖ రాయడం సంచలనం రేకెత్తించింది. అమిత్ షాకు లేఖ రాసింది నిజమేనని బీజేపీ కోటా జిల్లా ఓబీసీ విభాగం చీఫ్ అశోక్ చౌదరి స్పష్టం చేశారు. వసుంధర రాజే సర్కారు వ్యవహరిస్తున్న తీరుతో పార్టీ కార్యకర్తలు నిరాశ, నిస్పృహల్లో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై రైతులు, కార్మికులు, వ్యాపారులు, తదితరులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. బీజేపీ రాష్ట్ర చీఫ్ అశోక్ పర్నామీ.. సీఎం రాజేకు బానిసగా మారారని ఆరోపించారు. దీంతో రాష్ట్రంలో పార్టీ బలహీనపడటానికి ఆయనే ప్రధాన కారణమవుతున్నాడని తెలిపారు. రాజే ప్రస్తుతం చేపడుతున్న కార్యక్రమాలు పార్టీని ఓటమి దిశగా తీసుకెళ్లేందుకే దోహదం చేస్తాయని ఎద్దేవా చేశారు. ఈ యేడాదిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీ నాయకత్వాన్ని మార్చి కార్యకర్తల్లో ఉత్సాహం నింపాల్సిన అవసరముందని బీజేపీ హైకమాండ్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. అశోక్ చౌదరి చేసిన వ్యాఖ్యలను బీజేపీ అధికార ప్రతినిధి సంజయ్ లాటీ సమర్థించడం గమనార్హం. వసుంధర రాజే సర్కారు పనితీరు బాగా లేదని కార్యకర్తలు నిరాశలో ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు.

అధికార యావే.. బీజేపీ వ్యూహం

గిరిజనులకు భూ పంపిణీలో లెఫ్ట్ సర్కారే టాప్

- త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ముఖచిత్రం

నవతెలంగాణ - జనరల్ డెస్క్

ఈశాన్య రాష్ట్రాల్లోనూ కాషాయ పతాకాన్ని ఎగురవేయటానికి బీజేపీ నానా తంటాలు పడుతోంది. గోడమీద పిల్లుల్లా ఉన్న నేతల్ని ప్రలోభపెట్టి తమ వైపు తిప్పుకోవటమే కాకుండా.. అడ్డదారులన్నీ తొక్కి అధికారాన్ని చేజిక్కించుకోవాలని బీజేపీ అధిష్టానం చూస్తోంది. ఓటరు ఏం అడిగినా.. ఓటు వేయించుకునేదాకా ఇస్తామనేలా బీజేపీ లీడర్లు దిగజారుతున్నారని ప్రతిపక్షపార్టీలు ఆరోపిస్తున్నాయి.

రాష్ట్రంలో జరుగునున్న అసెంబ్లీ ఎన్నికల్లో గిరిజన తెగకు చెందిన ఇండెజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ)తో బీజేపీ పొత్తు కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే అడవి పుత్రులను భయపెట్టి అక్కడి సంపదను కొల్లగొట్టేలా కేంద్రం నిర్ణయాలు తీసుకుంటున్న విషయం విదితమే. వారిని అడవులనుంచి తరిమికొట్టి కార్పొరేట్లకు కట్టబెట్టేలా కుటీల రాజకీయాలకు పాల్పడుతున్న ఉదాహరణలు కొకొల్లలుగా ఉన్నాయి. అలాంటి మోడీ సర్కారు గిరిజన హక్కుల కోసం తాము కట్టుబడి ఉన్నామని చెబుతున్నది. ఐపీఎఫ్‌టీతో పొత్తు వారిని ఆకర్షించే కుటిల యత్నంలో భాగమేనన్నది బహిరంగ రహస్యమేనని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. గిరిజనుల ప్రయోజనాల విషయం పక్కనపెడితే.. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడుతున్న ఐపీఎఫ్‌టీకి హింసాత్మక చరిత్ర ఉంది. గిరిజనులపైనే దాడులకు తెగబడుతున్నది.

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి అత్యంత ముఖ్యమైన చర్యల్లో ఒకటి... (షెడ్యూల్డ్ తెగలు మరియు ఇతర అటవీవాసుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం 2006-ఎఫ్ఆర్ఏ). ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా సేద్యం చేస్తున్న అటవీ ప్రాంతాల్లోని భూమి వారికే చెందేలా ఈ చట్టం అనుమతిస్తున్నది. ఆదివాసీలు తాము సాగుచేసుకుంటున్న భూమికి సంబంధించి అధికారులకు దరఖాస్తు చేసుకుంటే.. ఆ కుటుంబానికి ఆ భూమి చెందేలా అధికారులు పట్టాలు మంజూరుచేస్తారు. ఈ చట్టం పూర్తిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయాల్సినది.



బీజేపీ పాలిత రాష్ట్రాలతో పోలిస్తే...
త్రిపురలో ఈ చట్టం అమలుతీరు ఇలా

ఈ చట్టం అమలుతీరులో ఇతర అన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలతో పోలిస్తే.. త్రిపుర అగ్రస్థానంలో ఉంది. గిరిజనుల దరఖాస్తులను పరిష్కరించి వారికి భూమిని మంజూరు చేసిన రాష్ట్రాల్లో లెఫ్ట్ ప్రభుత్వానిదే తొలి స్థానం. త్రిపుర ప్రభుత్వం, గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ జారీ చేసిన తాజా స్టేటస్ నివేదిక ప్రకారం... ఎఫ్ఆర్ఏ కింద దరఖాస్తు చేసుకున్నవారిలో 63 శాతం మంది గిరిజనులకు భూమి ప్రదానం జరిగింది. గిరిజన జనాభా గణనీయంగా ఉన్న ఇతర ప్రధాన రాష్ట్రాలు, బీజేపీ పాలిత రాష్ట్రాలు భూ పంపిణీలో చాలా వెనుకబడి ఉన్నాయి. అభివృద్ధికి నమూనాగా మోడీ తరచుగా చెప్పుకునే గుజరాత్‌లో 45 శాతం మంది దరఖాస్తుదారులకు మాత్రమే భూ పంపిణీ జరిగింది. దీర్ఘకాలంగా బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో 44శాతం, 40శాతం దరఖాస్తుదారులకు మాత్రమే భూ పంపిణీ జరిగింది. త్రిపురకు పొరుగున ఉన్న అసోంలో 38 శాతం మంది దరఖాస్తుదారులకు పట్టాలు ఇవ్వడం జరిగింది.

భూమి పట్టాలు ఇవ్వడంతోపాటు చట్ట నిబంధనలను అధిగమించి గిరిజన కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని కూడా అందిస్తూ త్రిపుర సర్కార్ మరో అడుగు

గిరిజనులకు భూ పంపిణీ
ఎఫ్ఆర్ఏ కింద ఆమోదించిన దరఖాస్తులు (శాతంలో)

త్రిపుర	63
జార్ఖండ్	55
రాజస్థాన్	51
గుజరాత్	45
ఛత్తీస్‌గఢ్	44
మధ్యప్రదేశ్	40
అసోం	38
మహారాష్ట్ర	31

ముందుకేసింది. పట్టాలు పొందినవారు నిరుపేదలు కావడంతో.. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం ఇచ్చిన భూమిని తాకట్టు పెట్టే పరిస్థితులకు వారు నెట్టబడుతున్నారు. దీనిని నిరోధించడానికి దేశంలో ఒక్క త్రిపుర వామపక్ష సంఘటన మాత్రమే వారికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది.

ఇప్పటివరకూ 93,349 కుటుంబాలకు ఈ ప్యాకేజీని త్రిపుర సర్కార్ అందించింది. ఈ పథకం అమలుకోసం ఆర్థిక సహాయం చేయాల్సిందిగా కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసినప్పటికీ ఎలాంటి సహాయం అందలేదు. తాము గిరిజనుల పక్షాన నిలబడ్డామని బీజేపీ చేసే ప్రకటనలు నీటి మూటలేనన్నది ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో పనితీరుచూస్తే స్పష్టమవుతున్నది. గిరిజనాభివృద్ధికి వారు నిజంగా కట్టుబడి ఉంటే.. గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఎఫ్ఆర్ఏ పటిష్టంగా అమలు జరిగి ఉండేది.

ఈ గణాంకాలను బట్టీ చూస్తే.. త్రిపురలో ప్రజలు వామపక్ష కూటమి పాలనలో అభివృద్ధి దిశలో అడుగులు వేశారు.. వేస్తున్నారు. రానున్న ఎన్నికలలో కూడా ఇది ప్రతిబింబిస్తుందనడంలో ఎలాంటి సందేహంలేదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

పత్తి విత్తనంపై ప్రయివేటు పెత్తనం

ప్రముఖ కంపెనీలకు సర్కార్ వత్తాసు

- బీటీ అమ్మకాలపై చర్యలు శూన్యం
- మరోసారి దగాకు రంగం సిద్ధం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

పత్తి విత్తనంపై కొన్ని ప్రముఖ కంపెనీల పెత్తనం కొనసాగుతున్నది. రాష్ట్రంలో రూ. వందల కోట్ల విలువ చేసే హెచ్‌టీ రకం పత్తివిత్తనాలను అమ్మి రైతులను నష్ట పర్చడమే కాక పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగించిన ప్రముఖ కంపెనీలకు రాష్ట్ర సర్కార్ అండదండలు లభిస్తున్నాయి. మరో మారు దోపిడీకి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అతి కీలకమైన పత్తివిత్తనాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ముందు చూపు లేక పోవటంతో వచ్చే ఖరీఫ్ కాలంలో కూడా విత్తనాల అక్రమ వ్యాపారం కొనసాగించటానికి ఆ కంపెనీలు సన్నాహాలు చేసుకుంటున్నాయి. రాష్ట్రంలో పత్తి సాధారణ సాగు 32 లక్షల ఎకరాలు కాగా అంచనాలకు మించి రైతులు పత్తిసాగు చేస్తున్నారు. పత్తిసాగు తగ్గించి పప్పు ధాన్యాలు పండించాలని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించటంతో 2016లో రైతులు ఇతర పంటలు వేశారు. కంది సాగు పెద్ద ఎత్తున చేసినప్పటికీ గిట్టుబాటు ధర కల్పించటంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం కావటంతో 2017 ఖరీఫ్‌లో మళ్లీ పత్తి పంటకే రైతులు మొగ్గుచూపారు. 46 లక్షల ఎకరాల్లో పత్తిసాగు చేశారు. దీనిలో దాదాపు 19 లక్షల ఎకరాల్లో కలుపును నివారించే బీజీ 3 పత్తివిత్తనాలు వేయటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ రకం విత్తనాలు వేసిన చేలల్లో దిగుబడి పూర్తిగా తగ్గిపోవటంతో పాటు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించక పోవటంతో రైతులు కుదేలై పోయారు. భారత దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా నిషేధించిన బీజీ 3 హెచ్‌టీ రకం పత్తివిత్తనాలను రాష్ట్రంలో అక్రమంగా ఉత్పత్తి చేసి అమ్మకాలు చేసిన కంపెనీలు, డీలర్లు, ఆర్గనైజర్లకు సర్కార్ అండదండలు లభించటంతో వారు యథేచ్ఛగా తమ అక్రమ వ్యాపారం కొనసాగించారు. పొరుగు రాష్ట్రమైన ఏపీలో 6 లక్షల ఎకరాల్లో హెచ్‌టీ రకం పత్తిని వేయటంతో అక్కడి ప్రభుత్వం ముందుగానే అప్రమత్తమై వ్యవసాయ శాస్త్రవేత్తలతో కూడిన ఒక కమిటీని నియమించింది. కావేరి, నూజివీడు వంటి ప్రముఖ కంపెనీలకు సంజాయిషీ నోటీసులు ఇవ్వటంతో పాటు డీలర్లు, ఆర్గనైజర్లపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసింది. రాష్ట్రంలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉన్నది. ఇక్కడ కూడా హెచ్‌టీ విత్తనాలను కొన్ని ప్రముఖ కంపెనీలు ఉత్పత్తి చేసి భారీగా అమ్మకాలు కొనసాగిస్తున్నా వారిపై చర్యలకు ఉపక్రమించక పోవటం చూస్తే వారికి సర్కార్ అండదండలు పుష్కలంగా లభిస్తున్నట్టు తెలుస్తున్నది. అక్రమ విత్తన వ్యాపారం అరికట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అయినప్పటికీ వ్యవసాయ శాఖ మౌనం వహించటం వెనుక రాజకీయ ఒత్తిడులే కారణమని తెలుస్తున్నది. హెచ్‌టీ విత్తనాలపై కేంద్రానికి లేఖ రాసి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకోవటం పలు అనుమానాలకు తావిస్తున్నది.

వచ్చే ఖరీఫ్ కోసం ఇప్పటి నుంచే...

రాష్ట్రంలో 40 లక్షల ఎకరాలకు తగ్గకుండా వచ్చే ఖరీఫ్‌లో కూడా పత్తిసాగు చేస్తారని భావిస్తున్న ప్రముఖ కంపెనీలు మళ్లీ బీటీ రకానికి చెందిన హెచ్‌టీ విత్తనాలను అమ్మటానికి రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఎకరానికి రెండు ప్యాకెట్ల చొప్పున 80 లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరం కాగా సాధారణ హైబ్రీడ్ రకాల విత్తనాలు సరఫరా చేయటానికి అవసరమైన విత్తన ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం తయారు చేయలేక పోయింది. గత సంవత్సరం హెచ్‌టీ రకాల విత్తనాలు అమ్మిన కంపెనీలు, డీలర్లు, ఆర్గనైజర్లపై ఎటువంటి చర్యలు తీసుకోక పోవటంతో వారే మళ్లీ విత్తన వ్యాపారంపై పట్టు బిగిస్తున్నారు. ఖరీఫ్ అవసరాలకు సరిపోయే విత్తనాలను సరఫరా చేయటానికి కార్పొరేట్ కంపెనీలు పెద్దఎత్తున విత్తనోత్పత్తి చేస్తున్నాయి.



టీఎస్ఆర్టీసీ టెలీఫోన్ డైరీ ఆవిష్కరణ

టీఎస్ఆర్టీసీ టెలిఫోన్ డైరీని ఆవిష్కరిస్తున్న ఎండీ జివి రమణారావు, రవీందర్, సత్యనారాయణ, జీఆర్ కిరణ్, జి. రాధాక్రిష్ణ తదితరులు

కండ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నారు

- ఆయనో దోపిడీ దొంగ : కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతల ఫైర్
- మోడీని ప్రశ్నిస్తే కేసీఆర్ కుటుంబం జైలుకే...



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీపై మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై టీపీసీసీ మండిపడింది. స్థాయి మరచి, కండ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నారని ఫైరయింది.అధికారబలం వల్ల ఆయన కండకా వరంతో రాహుల్‌పై వ్యాఖ్యలు చేశారని విమర్శించింది. కాంగ్రెస్ లోఫర్ పార్టీ అంటూ తన అహంభావాన్ని చాటుకున్నారని దుయ్యబట్టింది. గూగుల్‌లో కేటీఆర్ అని టైప్ చేస్తే దోపిడీ దొంగ అని వస్తున్నదని పేర్కొంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకుంటే నీవెక్కడ ఉండే వాడివని ప్రశ్నించింది. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ పార్టీ నష్టపోతుందని తెలిసి కూడా రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ మీకు లోఫర్‌పార్టీగా కనిపించిందా? అని ప్రశ్నించింది. గురువారం గాంధీభవన్, సీఎల్పీలో వేర్వేరుగా ఆ పార్టీ నేతలు విలేకరులతో మాట్లాడారు.

ఉత్తమ్‌తో పాటు నేను సన్యాసం తీసుకుంటా : కోమటిరెడ్డి



వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుంటే ఉత్తమ్‌తో సహా తాను కూడా రాజకీయ సన్యాసం తీసుకుంటానని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్ చేశారు. కాంగ్రెస్‌కు 70 సీట్లకు పైగా వస్తాయన్నారు. రాహుల్‌గాంధీని పప్పు అనడం కేటీఆర్ అహంకారానికి నిదర్శనమన్నారు. ఇక ముందు ఇలాటి వ్యాఖ్యలు చేయకుండా నీ కొడుకును కంట్రోల్‌లో పెట్టుకో అని కేసీఆర్‌ను హెచ్చరించారు. సోనియాగాంధీ కాళ్ళు మొక్కినప్పుడు లేనిది ఇప్పుడు లోఫర్ పార్టీగా కనిపించిందా? అని ప్రశ్నించారు.

ఛీటర్స్ ఫ్యామిలీ టీఆర్ఎస్‌ను నడుపుతున్నది : రేవంత్‌రెడ్డి

టీఆర్ఎస్ అంటేనే లాత్కోర్ పార్టీ దాన్ని నడుపుతున్నది ఛీటర్స్ ఫ్యామిలి అని కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి చెప్పారు. కేటుగాడి పాత్ర కోసం తండ్రి కొడుకులు పోటీ కాంగ్రెస్ గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయాల నుంచి పారిపోయేందుకు కేటీఆర్ రాజకీయ సన్యాసం తీసుకుంటాననంటున్నారన్నారు. బడ్జెట్లో నిధుల కేటాయింపులో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని కేసీఆర్ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎంపీలు కేంద్రాన్ని నిలదీస్తుంటే...టీఆర్ఎస్ ఎంపీలు మాత్రం చోద్యం చూస్తున్నారని విమర్శించారు. పార్లమెంటులో మోడీకి టీఆర్ఎస్ ఎంపీలు మోకరిల్లుతున్నారని మండిపడ్డారు.

కాంగ్రెస్‌లో ఓనమాలు దిద్దిన కేసీఆర్ లోఫరేనా? : దాసోజు శ్రవణ్ ప్రశ్న



కాంగ్రెస్ పార్టీని లోఫర్ అంటున్న కేటీఆర్...కాంగ్రెస్ పార్టీలో ఒనమాలు దిద్దిన కేసీఆర్ కూడా లోఫరేనా? అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. గురువారం గాంధీ భవన్‌లో అధికార ప్రతినిధులు జనక్‌ప్రసాద్, నగేష్ ముదిరాజులతో కలిపి ఆయన విలేకరులతో మాట్లాడారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్ రెడ్డి, పార్టీ నేతలు నిరంజన్, శ్యామ్ మోహన్ లతో కలిసి మంత్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ చాలా దిగజారిపోయి మాట్లాడారని విమర్శించారు.

మాట తప్పిన వారే లోఫర్స్ : కనుకుల

టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తామని చేయకుండా మాట తప్పిన వారే లోఫర్స్ అని టీపీసీసీ సేవాదళ్ చైర్మెన్, మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్ధన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కేంద్ర,రాష్ట్రాల్లో మంత్రి పదవులు తీసుకున్నది మీరు కాదా అని ప్రశ్నించారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌లో కలిసి పని చేయలేదా? మాట్లాడే ముందు మీరేంటో తెలుసుకుని మాట్లాడాలని కేటీఆర్‌కు ఆయన సూచించారు.

మోడీ దిష్టిబొమ్మ దహనం

రాష్ట్ర విభజనపై ప్రధాన నరేంద్రమోడీ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును మోడీ తప్పు పట్టడం సరైందికాదని అంజన్‌కుమార్ అన్నారు.

నల్లగొండ జిల్లాలో రోడ్డు ప్రమాదం

నవతెలంగాణ– చిట్యాల

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెల్మినేడు గ్రామ శివారులో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో 56 గొర్రెలు కూడా మృత్యువాత పడ్డాయి. రంగారెడ్డి జిల్లాలోనూ ప్రమాదవశాత్తు నిప్పంటుకుని 80 మేకలు ఆగ్నికి ఆహూతయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం... వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన దోనికి కుమారస్వామి (40), చెన్నారావుపేట మండల ఉత్తరపల్లి చెందిన కొల్లూరు రాకేష్ (22), సంగెం మండలం కృష్ణాపూర్‌కు చెందిన మేకల మల్లయ్య (36) బుధవారం నెక్కొండ సంతలో 105 గొర్రెలు కొనుగోలు చేశారు. వాటిని హైదరాబాద్‌లోని మియాపూర్ సంతలో అమ్మడానికి గురువారం తెల్లవారుజామున డీసీఎంలో తీసుకుని సూర్యాపేట మీదుగా వెళ్తున్నారు. డీసీఎం వెల్మినేడు గ్రామశివారులోకి రాగానే జాతీయరహదారి పక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎంలో ఉన్న కుమారస్వామి, రాకేష్, మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందారు. డీసీఎంలో ఉన్న 56 గొర్రెలు మృతి చెందాయి. డ్రైవర్ మేడిపల్లి వెంకటేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆయన్ను చికిత్స నిమిత్తం కామినేని ఆస్పత్రికి తరలించారు. మరో 49 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు అవిశెట్టి శంకరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం రాంనుంతల గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్న తాండాకు చెందిన పాత్లావత్ గోప్యానాయక్ రోజు మాదిరిగానే బుధవారం సాయంత్రం తన మేకలను దొడ్లో కట్టేశాడు. గురువారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు మేకల దొడ్డికి నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో దొడ్లో ఉన్న 80 మేకలు కాలి బూడిదయ్యాయి. వాటి విలువ సుమారు రూ.5 లక్షలకు పైగానే ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి ఘటనా స్థలాన్ని సందర్శించారు.

కృష్ణానదిలో ఆగిన మరబోటు

కాపాడిన పోలీసులు, తప్పిన ప్రమాదం

నవతెలంగాణ–మహబూబ్‌నగర్‌ప్రతినిధి

కృష్ణానదిలో ప్రయాణిస్తున్న మరబోటు వల తగిలి ఆగి పోయింది. నది మధ్యలో బోటు ఆగి పోవడంతో అందులో ఉన్న వారంతా ఆందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులు, ఇతర అధికారులకు సమాచారం అందించారు. పోలీసులు మరో బోటు తీసుకెళ్లి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఈ ఘటన గురువారం జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని వనపర్తి జిల్లా వీపనగండ్లకు చెందిన 21 మంది శివస్వాములు శ్రీశైలం వెళ్లేందుకు కృష్ణానదిలో మరబోటు ఎక్కారు. బోటు నది మధ్యలోకి రాగానే చేపల కోసం వేసిన వల తగిలి ఆగి పోయింది. వెంటనే వారంతా తమ వద్దనున్న సెల్‌ఫోన్‌లతో బంధువులు, అధికారులకు సమాచారం అందజేశారు. కర్నూలు ఆర్డీఓ ఆదేశాల మేరకు ఆత్మకూరు సీఐ క్రిష్ణయ్య, కొత్తపల్లి తహాశీల్దార్ రామకృష్ణ హుటా హుటిన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఆలోపే రాష్ట్రంలోని కొల్లాపూర్ ఎస్సై మరో బోటు తీసుకెళ్లి శివస్వాములను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.



మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

విద్యాశాఖ కమిషనర్‌కు ఎంఎస్‌టీఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో– హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎంఎస్‌టీఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. లేకుంటే ఈనెల 20న డైరెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించింది. గురువారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్‌కు ఆ సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొండయ్య మాట్లాడుతూ...అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్, ఎంఎస్‌టీఎఫ్ పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా, సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని చెప్పారు. ఐదేండ్లు నుంచి పనిచేస్తున్నా ఇప్పటికీ సర్వీస్ రూల్స్ లేవని, దీంతో ఉపాధ్యాయులంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. వేసవిలో ప్రమోషన్లను చేపట్టి, బదిలీలు నిర్వహించాలని కోరారు. టీచర్లు, ఉద్యోగులకు హెల్త్‌కార్డులు లేదా మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు పీడీ మరియు స్వీపర్లను నియమించాలనీ, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి అన్ని రకాల సెలవులు వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, టీఎస్ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర నాయకులు జయప్రకాశ్, బి సురేశ్, జగన్నాథ్, సీహెచ్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగుల డీఎస్ఈ ముట్టడి

నవతెలంగాణ బ్యూరో– హైదరాబాద్

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఈనెల 10న పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్టు టీఎస్‌యూటీఎఫ్ ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ రాములు, చావ రవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, వేసవి సెలవుల్లోనూ వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

సంపాదకీయం

స్టాక్ మార్కెట్ సంక్షోభం

అమెరికాలోనూ ప్రపంచ వ్యాప్తంగానూ గత శుక్రవారం నుంచి స్టాక్ మార్కెట్లలో తీవ్ర స్థాయిలో షేర్ల ధరలు పతనమౌతున్నాయి. గత శుక్రవారంనాడు ఒక్కరోజే డౌ జోన్స్ పారిశ్రామిక సగటు 665పాయింట్లు పతనమైంది. అంటే డౌలో అది 2.54శాతం. 2016 సంవత్సరం జూన్ తరువాత ఒకే రోజు ఇంతగా షేర్ల ధరలు ఎన్నడూ పతనం కాలేదు.

సామాజిక ఉద్రిక్తతలు తీవ్రమై కార్మికవర్గ పోరాటాలు పునఃరుత్తేజితమౌతున్నాయి. వర్గ పోరాటాలను కృత్రిమంగా అణచిన సుదీర్ఘ చారిత్రక వలయం అంతిమదశకు చేరుకుంటున్నది. తాము కోల్పోయిన దానికంటే ఎక్కువగా తిరిగి సాధించటానికి కార్మిక వర్గానికి మార్గం సుగమం అయ్యే తరుణం ఆసన్నమైంది!

అమెరికాలోని ఇతర స్టాక్ మార్కెట్ సూచికలు కూడా ఇదే స్థాయిలో పడిపోయాయి. ఐరోపాలో కూడా ఇదే ధోరణి కొనసాగింది. జర్మనీకి చెందిన డాక్స్ సూచిక 1.68శాతం పడిపోయింది.

గత రెండేండ్ల కాలంలో ఒక వారం రోజుల్లో స్టాక్ మార్కెట్ అమెరికాలో ఇంతగా ఎన్నడూ పతనం చెందలేదు. అమెరికా ప్రభుత్వ బాండ్లపై వడ్డీ రేట్లు పెరుగుతుండటం, జనవరి నెలలో అంతకు ముందు ఏడాది కంటే 2009 సంవత్సరం తరువాత అత్యధికంగా 2.9శాతం వేతనాలు పెరగటం వంటి కారణాల మూలంగా స్టాక్ మార్కెట్‌లో సంక్షోభం ఏర్పడిందని ఫైనాన్షియల్ ప్రెస్ పేర్కొంది. శుక్రవారంనాడు మొదలైన స్టాక్ మార్కెట్ల పతనం ఆస్తుల బుడగ విస్ఫోటనానికి సూచికగా ఉన్నదా అనే విషయం తేలవలసి ఉన్నది. అయితే ఈ పరిస్థితి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకు చెందిన ఆర్థిక, రాజకీయ సంక్షోభాన్ని ప్రతిబింబిస్తున్నది. అనేక కారకాల కారణంగా స్టాక్ మార్కెట్ల పతనం జరుగుతున్నది. అంతర్జాతీయ స్థాయిలో తిరిగి ఆవిర్భవిస్తున్న కార్మిక వర్గ పోరాటం వీటన్నింటిలోకి ముఖ్యమైనదని చెప్పవచ్చు. గత నాలుగు దశాబ్దాలుగా తాము కోల్పోయిన వేతనాలను, ఉద్యోగాలను, జీవన ప్రమాణాలను తిరిగి సాధించుకోవటానికి కార్మికవర్గం సమరశీలం అవుతున్నందునే జనవరిలో వేతనాలు పెరిగాయని సామ్రాజ్యవాద దేశాలలోని పాలకవర్గాలు ఆందోళన చెందుతున్నాయి. పెరుగుతున్న ఆర్థిక అసమానతలకు, మిత వ్యయ విధానాలకు వ్యతిరేకంగా జర్మన్ పారిశ్రామిక కార్మికులు గత 15ఏండ్లలో ఎన్నడూ లేనంతగా సమ్మెలు చేస్తున్నారు. అలానే గ్రీస్‌లో సిరిజా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా నిరసనలు వెలువెత్తు తున్నాయి. తూర్పు ఐరోపాలోని కార్ల కంపెనీలలోను, బ్రిటన్‌లోని రైల్వేలలోను కార్మికులు సమ్మెలు చేస్తున్నారు. ఇరాన్, ట్యునీషియాలలో కూడా కార్మిక వర్గం నిరసన ప్రదర్శనలు చేస్తున్నది.



అమెరికాలో అకస్మికంగా వడ్డీ రేట్లు ఎక్కువ కావటానికి కార్మికుల వేతనాలు పెరగటమే కారణం. దీనితో స్టాక్ మార్కెట్ బూమ్‌కిగల పునాది ప్రమాదంలో పడింది. అంతేకాకుండా 2008లో సంభవించిన వాల్‌స్ట్రీట్ సంక్షోభం తరువాత కార్పొరేట్– ఫైనాన్షియల్ బూర్జువావర్గం చేతిలో కేంద్రీకృతమైన విపరీతమైన సంపద కూడా ప్రమాదంలో పడింది. పదేండ్ల అమెరికా ట్రెజరీ బాండ్లపై వడ్డీ 2.85శాతానికి పెరిగింది. నాలుగేండ్లలో ఈ పెరుగుదల అత్యధికం. ఐరోపాలో కూడా ప్రభుత్వ బాండ్ రేట్లు పెరుగుతున్నాయి. 'ప్రభుత్వ బాండ్లపై వడ్డీ రేట్లు భారీగా పెరగటంతోపాటుగా ద్రవ్యోల్బణం ప్రవేశించటం స్టాక్ మార్కెట్లకు అత్యంత ప్రమాదకరం. నిజానికి ఈ ప్రమాదం ఇప్పటివరకూ నిగూఢంగా ఉన్నది. అయితే అది ప్రస్తుతం భయంకరంగా బయటకు వచ్చింది' అని ఫైనాన్షియల్ టైమ్స్ వ్యాఖ్యాత జాన్ ఆథర్స్ పేర్కొన్నారు.

2009నుంచి అమెరికా ప్రభుత్వం ఫెడరల్ రిజర్వ్ ద్వారా బ్యాంకులకు, హెడ్జ్ ఫండ్స్‌కు, బడా పెట్టుబడిదారులకు అపరిమితంగా డబ్బు పంపిణీ చేసింది. వడ్డీ రేట్లను అత్యంత నామమాత్రంగా ఉంచి ఫైనాన్షియల్ మార్కెట్లలోకి డబ్బును ముద్రించి ప్రవేశపెట్టింది. ఈ ప్రక్రియనే 'పరిమాణాత్మక సడలింపు (క్వాంటిటేటివ్ ఈజింగ్)' అని పిలుస్తున్నారు. ప్రధాన సామ్రాజ్యవాద దేశాలలోని ప్రభుత్వాలు, ఐరోపా, ఆసియా దేశాలలోని కేంద్ర బ్యాంకులు అమెరికా విధానాన్ని అనుసరిస్తూ లక్షల కోట్ల విలువగలవని తమ బ్యాలెన్స్ షీట్స్‌లో నమోదుచేయబడిన పనికిమాలిన ఆస్తులను ప్రభుత్వ లెడ్జెర్లలోకి బదిలీ చేశాయి.

ప్రపంచంలోని ద్రవ్య పెట్టుబడిదారీ వర్గాన్ని తన నేరపూరిత చర్యల పర్యవసానాలనుంచి రక్షించి మరింత ధనవంతులను చేసే మహాకార్యాన్ని పెట్టుబడిదారీ రాజ్యం కార్మికవర్గాన్ని కుంగదొక్కుతూ నిర్వహించింది. మిత వ్యయ చర్యలు, వేతనాల కోతవంటి విధానాలతో రాజ్యం ప్రజల జీవన ప్రమాణాలను, సామాజిక పరిస్థితులను దెబ్బతీసింది. అనేక దశాబ్దాలుగా కొనసాగుతున్న సామాజిక ప్రతీఘాత విప్లవం గత పదేండ్లలో తీవ్రతరమైంది. స్టాక్ మార్కెట్లలో షేర్ల ధరలు క్రమేణా పెరగటంలో పాలక వర్గం చేస్తున్న ఈ దాడి ప్రతిబింబించింది. ఈ ప్రక్రియ వర్గ పోరాటాలను అణచివేయటంపై ఆధారపడింది. కార్మికసంఘాలను లోబర్చుకుని కార్మికవర్గ ప్రతిఘటనను పాలకవర్గాలు దెబ్బతీశాయి. పర్యవసానంగా కార్మికవర్గానికి ఉండే బేరమాడే శక్తి ఏమేరకు బలహీనపడిందో ఆ మేరకు స్టాక్ మార్కెట్ బలపడింది.

2018లో సామాజిక ఉద్రిక్తతలు తీవ్రమై కార్మికవర్గ పోరాటాలు పునఃరుత్తేజితమౌతున్నాయి. వర్గ పోరాటాలను కృత్రిమంగా అణచిన సుదీర్ఘ చారిత్రక వలయం అంతిమదశకు చేరుకుంటున్నది. తాము కోల్పోయిన దానికంటే ఎక్కువగా తిరిగి సాధించటానికి కార్మిక వర్గానికి మార్గం సుగమం అయ్యే తరుణం ఆసన్నమైంది!

ప్రజావాణి

అడుగడుగునా అన్యాయం

మిర్చి వ్యవసాయ మార్కెట్‌లో అధిక ధర పలుకుతున్నప్పటికీ తూకాల్లో మోసాలవల్ల తీవ్రంగా నష్టపోతున్న వైనం అనేకచోట్ల కనబడుతున్నది. తూకంలో మోసాల వల్ల కొంత తగ్గిపోవటంతో ధర కూడా తక్కువవు తున్నది. రైతులు తూకాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. తూకాలలో మోసం వల్ల ధర ఎక్కువగా ఉన్న రైతుకు మిగిలేది స్వల్పంగానే భావించాలి. కొన్ని చోట్ల అధికారులు తూకాలలో మోసాలను అరికట్టారు. మరికొన్ని జిల్లాల్లో అరికట్టాల్సి ఉంది. ప్రతి అసలు రేటు ఇస్తున్నట్టు చెబుతూ క్వింటాల్‌కు రూ.100 దళారీలు తగ్గిస్తున్న వైనం కొన్నిచోట్ల జరుగుతున్నది. దీన్ని రైతులు వ్యతిరేకించటం జరిగింది. అన్ని పంటలకు అనువైన గిట్టుబాటు ధర కల్పించి, కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అటు రైతు బాగుపడక, ఇటు వినియోగదారుడు బాగుపడక నడుమ దళారీ బాగుపడు తున్నాడు. మార్కెట్‌లో తక్కువగా ఉన్న రైతుకు గిట్టుబాటు ధర రాకపోవటంతో పాటు వినియోగదారుడి వద్దకు వచ్చేసరికి ధర మాత్రం అధికంగా పలుకుతున్నది. నష్టపోయేది రైతులు, వినియోగదారులే! దానికితోడు యూరియా ధరలు, ఎరువుల, విత్తనాల ధరలు పెంచేందుకు సంస్థలు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

అయినం రఘురామారావు, ఖమ్మం.

ఈ బడ్జెట్ బడాబాబులది..

పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ 2018–19 వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ వార్షిక బడ్జెట్ బడుగు బలహీన వర్గాలకు మొండిచేయి చూపించింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పరిపాలనా విధానాలకు తగినట్టుగానే ఉంది. ముఖ్యంగా ఈ బడ్జెట్ అరచేతిలో వైకుంఠం చూపు తున్నట్టుగా కనిపిస్తున్నది. మధ్యతరగతి జీవులకు మొండిచేయి చూయించారు. ఇక నిరుద్యోగులకు బడ్జెట్‌లో అనుకొనినంత మేలు కలుగలేదు. పేరు మాత్రం వేలాది కోట్ల బడ్జెట్.. అయినా నిరుద్యోగులకు కానీ, కర్షకులకు కానీ ఎలాంటి ఉపయోగపడటం లేదు. నరేంద్ర మోడీ వార్షిక బడ్జెట్ ఏ సామాన్య జీవుడికి కూడా భరోసా ఇవ్వటం లేదు. ఇది పూర్తిగా బడా పారిశ్రామిక వేత్తలకు, బడా బాబులకు బాగా ఉపయోగపడే విధంగా ఉన్నది. ఇక పరిపాలకులకు మేలు చేసేది బడా బాబులే కాబట్టి.. బడాబాబులకు మేలు చేయటం కోసం ఈ బడ్జెట్ ప్రవేశపెట్టినట్టుగా ఉన్నది. ఇక విసిగి వేసారిన ప్రజలు వజ్రాయిధం లాంటి ఓటుతో బీజేపీకి బుద్ధిచెప్పకపోరు.

రంగినేని జగదీశ్వరుడు, నాగర్‌కర్నూల్‌జిల్లా.

వినాయకుడిది ప్లాస్టిక్ సర్జరీ అంటే.. నవ్విపోతున్న జనం



డాక్టర్ దేవరాజు మహారాజు

ప్రజల్లో లెక్కలేనన్ని అశాస్త్రీయ భావనలున్నాయి. అందుకు గల కారణాల్ని అర్థం చేసుకోగలం. ప్రజలకు శాస్త్రీయ పరిశోధనల గూర్చి, వాటి ఫలితాల గూర్చి తెలియదు. కానీ, దేశంలో ఒక విచిత్రమైన పరిస్థితి నెలకొంది. దేశంలో వేలాదిమంది శాస్త్రజ్ఞులున్నారు. వారు, వారి పరిశోధనశాలల్లో ఫలితాల విషయంలో ఎంతో నిక్కచ్చిగా ఉంటారు. కానీ, పరిశోధనలశాలల్లోంచి బయటకు రాగానే ఎన్నో సామాజిక–అశాస్త్రీయ అంశాల్ని అంగీకరిస్తున్నారు. వాటిని ఖండించటం లేదు. అంటే మానసికంగా ఎదగడం లేదు. గొప్ప శాస్త్రవేత్తలయినప్పటికీ, గొప్ప ఆత్మస్థైర్యం గల మనుషులు కాలేకపోతున్నారు. ఉదాహరణకు భారత ప్రధాన మంత్రి "వినాయకుడి కథ... మనదేశంలో వేల సంవత్సరాల క్రితమే ప్లాస్టిక్ సర్జరీ ఉందని రుజువు చేస్తుంది.." అని సెలవిచ్చారు.


> **శాస్త్రవేత్తలు హేతుబద్ధంగా ఆలోచించగల మనుషులు కావడం అవసరం. పరిశోధన కేవలం ఉద్యోగ ధర్మమే కాదు, దాని స్ఫూర్తితో తమ జీవన విధానాన్ని రూపొందించుకోవాల్సి ఉంది. మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 51(ఎ) (హెచ్) నిర్దేశించినట్టు ప్రజలందరిలో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే!**

దానిపై ప్రఖ్యాత శాస్త్రవేత్త పుష్పా.యం.భార్గవ స్పందిస్తూ... "దానికి వైద్య శాస్త్రాల ఆధారంగానీ, పురావస్తు ఆధారంగానీ, ఇంకా ఏ ఇతర ఆధారాలు గానీ లేవు.." అని ప్రధాని ప్రకటనను ఖండించారు. ఆయనతో పాటు మరో ఒకరిద్దరు శాస్త్రవేత్తలు మాత్రమే ఖండించారు. కానీ, మొత్తానికి మొత్తంగా భారతీయ వైజ్ఞానిక సమాజం ఖండించలేదు. అయితేనేం? వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న భారతీయుడు, నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ వెంకీ రామకృష్ణన్, భారత ప్రధాని ప్రకటనను ఖండించడమే కాక, ఇంకా ఇలా అన్నారు. "భారతదేశంలోని వైజ్ఞానిక సమాజం అంతా ఒక్కటై, ఏక కంఠంతో ప్రధాని పేర్కొన్న అశాస్త్రీయ విషయాన్ని ఖండించకపోవడం నాకు ఆశ్చర్యాన్ని, ఆవేదననూ కలిగించింది. ఇలాంటి వాటిని ఖండించడం తప్పక జరగాలి! అసలు ప్రమాదం ఏమిటంటే శాస్త్రీయ ఆలోచనా విధానంతో సమాజానికి మార్గదర్శనం చేయవల్సిన వారు నిస్సహాయంగా, మూర్ఖంగా మూఢనమ్మకాల్లో మునిగి తేలుతున్నారు.." అంటూ ఎంతో ఆవేదనతో 'ద హిందూ' ఇంగ్లీషు దినపత్రిక ఇంటర్వ్యూ (20.3.2015)లో చెప్పారు.

అలాగే మన మాజీ రక్షణమంత్రి డిఫెన్స్ లాబొరేటరీ (డీఆర్‌డీఎల్) శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. "మన పూర్వకాలంలో రుషులంతా గొప్ప సైంటిస్టులని, ముని దధీచి ఇంద్రుడికి వజ్రాయుధాన్ని అందించాడనీ, నేటి మన శాస్త్రవేత్తలంతా రాందేవ్‌బాబా స్థాయిని అందుకోవాలని.." ఉద్బోధించారు. వాస్తవం చెప్పుకోవాలంటే.. దధీచి, ఇంద్రుడు వగైరా అందరూ పురాణ పురుషులు. అంటే మనిషి ఊహల్లోంచి, కల్పనల్లోంచి వచ్చిన పురాణ పాత్రలు. కల్పిత పాత్రల్ని ఆదర్శంగా తీసుకొమ్మని రక్షణమంత్రి సైంటిస్టులకు చెప్పడం ఏమైనా బాగుందా? దేశం ఎటుపోతోంది అని దేశ ప్రజలకు ఆందోళనగా ఉంది. ఇప్పటి మన ఆధునిక దృక్కోణంలోంచి పరిశీలించి "ఇంద్రుడు ఒక కల్పిత పాత్ర" అని మనం చెప్పడం కాదు, అసలు వేదాలలోనే ఇంద్రుడి ఉనికిని ప్రశ్నించడం ఉంది. నేమృషి అనే రుషి రుగ్వేదంలో ఇలా ప్రశ్నించాడు "మీరు ఎవరిని స్తుతింతురు? ఇంద్రుని ఎవరు జూచినారు? ఈ నేమృషి దృష్టిలో ఇంద్రుడనువాడు లేడు" అని! (రుగ్వేదం 8వ మండలం, 89వ సూక్తం, 3వ మంత్రం). పౌరాణిక గాథని పౌరాణిక గాథలాగే తీసుకుంటే సమస్యలుండవు. దధీచి గొప్ప సైంటిస్ట్ అన్నంత మాత్రాన అయిపోతాడా? రుజువులు చూపాలి కదా? అందులో అధికారంలో ఉండి, రక్షణశాఖ శాస్త్రవేత్తలతో మాట్లాడటమంటే ఎంత బాధ్యత, జాగ్రత్త అవసరం? యోగా ముసుగులో వ్యాపారం చేసుకునే బాబాను వీరు ఆదర్శంగా తీసుకోవాలా? శాస్త్రజ్ఞుడికి, బాబాకు, పూర్వకాలపు రుషికి తేడా తెలుసుకోని వారు అధికారం వెలగబెడుతున్నారు. ఇక దేశానికి సంబంధించిన కీలక నిర్ణయాలు వీరెలా తీసుకోగలరని సామాన్యులు ఆందోళన పడడంలో అర్థం ఉంది.

రుజువు పరచబడిన విషయాలను మాత్రమే అంగీకరించే ఆలోచనా విధానమే సైన్సు.. అదే శాస్త్రీయ ఆలోచనా విధానం. శాస్త్ర విషయాలను పరిశోధించి, ఫలితాలను, ఫలాలను ప్రజలకు అందించే వారే శాస్త్రవేత్తలు. కానీ నేడు దేశంలో జరుగుతున్నదేమిటి? శాస్త్రవేత్తల్లో ఎక్కువమంది అశాస్త్రీయ భావాలు కలిగి ఉంటున్నారు. అందుకు రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి.. ఇలాంటి ప్రభుత్వ పెద్దల ప్రభావం–ఒత్తిడి. రెండు, వారు పుట్టి పెరిగిన వారి వారి సంప్రదాయ కుటుంబాల నేపథ్యం. ఈ రెండింటిలోంచి ఎదిగి, శాస్త్రవేత్తలు హేతుబద్ధంగా ఆలోచించగల మనుషులు కావడం అవసరం. పరిశోధన కేవలం ఉద్యోగ ధర్మమే కాదు, దాని స్ఫూర్తితో తమ జీవన విధానాన్ని రూపొందించుకోవాల్సి ఉంది. మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 51(ఎ) (హెచ్) నిర్దేశించినట్టు ప్రజలందరిలో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే! కానీ, వారు అందుకు విరుద్ధంగా పనిచేస్తున్నారు. మన ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఏం చేసింది? సైన్సు పరిశోధనలకు ఇచ్చే నిధుల్ని బాగా తగ్గించింది. పైగా నిధులను ప్రయివేటు పారిశ్రామిక వేత్తల నుండి పొందాలని ఆదేశించింది. పైగా సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి వర్యులు మరో గొప్పమాట సెలవిచ్చారు. 'భారతదేశంలోని పరిశోధనలు వాణిజ్యపరం కావాలి' అని ఆకాంక్షించారు. అదెంత ప్రమాదకారో అర్థం చేసుకోవాలి. పారిశ్రామిక వేత్తలు పరిశోధనలకు నిధులు సమకూరిస్తే ఏమవుతుంది? వారి ఉత్పత్తులు ప్రజారోగ్యానికి ప్రమాదకారకాలైనా, అవి మంచివే అని శాస్త్రవేత్తలతో చెప్పిస్తారు. నిధులు సమకూర్చేవాడి పాట–పాడకుండా వారెలా ఉండగలరూ? వారి వ్యాపారాన్ని దెబ్బతీసే ప్రకటనలు ఎలా ఇవ్వగలరూ? నిధులు సమకూరుస్తున్నవాడికి శాస్త్రజ్ఞులంతా అమ్ముడుపోతారు కదా? ఉదాహరణకు శాస్త్రవేత్త సునీతా నారాయణన్ ఎంతో ధైర్యంగా ముందుకొచ్చి, తన పరిశోధన వివరాల్ని ప్రజల ముందు పెట్టారు. పెప్సీ, కోకోకోలాలు క్యాన్సర్ కారకాలని ఆవిడ నిరూపించారు. ఆయా కంపెనీలలో పనిచేసే శాస్త్ర సాంకేతిక సిబ్బంది ఎవరూ ముందుకురాలేదు. సునీతా నారాయణన్ ప్రకటనను సమర్థించలేదు. తమ కంపెనీల యజమానులైన పారిశ్రామిక వేత్తలకు నష్టం కలిగించే ప్రకటనలు వారివ్వలేరు. తమ కంపెనీల ఉత్పత్తులు ప్రజారోగ్యాన్ని చెడగొడుతున్నాసరే! పరిశోధన వ్యాపారం కాకూడదు. కేంద్ర ప్రభుత్వ నిధులతో మాత్రమే పరిశోధనలు జరగాలి. దేశ జనావళికి మేలు చేసే విధంగా అవి ఉండాలి.

పౌరాణిక గాథల్లోని అంశాలను ప్రచారం చేస్తూ, మళ్లీ సనాతన ధర్మాల్ని ప్రతిష్టించాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. వారికి మద్దతు పలికే ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇకనేం రెచ్చిపోతున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ డైరెక్టర్‌తో తమకు అనుకూలమైన ప్రకటన చేయించుకున్నారు. తమకు అనుకూల పరిశోధనలు చేయిస్తున్నారు. అవి ఈ కాలానికి, ఈ సమాజానికి ఏమైనా ఉపయోగపడతాయా లేదా అనే కామన్‌సెన్స్ పక్కన పెట్టేశారు. ఉదాహరణకు ఒక ఉదాంతం చూడండి. ఐ–సర్వే అనే ఒక సంస్థ ఢిల్లీలో ఒక జాతీయ సెమినార్ నిర్వహించింది. దానికి ఎన్నుకున్న అంశం



ఏమిటంటే.. క్రీ.పూ.2000లో పురాతన సంఘటనల్ని శాస్త్రబద్ధంగా నమోదు చేయడం. దీనిలో ప్రధానంగా "శ్రీరాముడు ఎప్పుడు పుట్టాడు" అనే విషయం మీద కొన్ని వందల పేజీల్లో వివరణ ఇచ్చారు. ఇందులో డాక్టర్ వర్తక్ అనే ఆయన శ్రీరాముని పుట్టిన రోజు క్రీ.పూ. డిసెంబర్ 4, 7323 అని ప్రకటించాడు. అలాగే ఐ–సర్వే సంస్థ డైరెక్టరైన సరోజ్‌బాలా, రాముని పుట్టిన రోజుని క్రీ.పూ. జనవరి 10, 5114గా నిర్ధారించాడు. ఎవరి వాదనలు వారివి. నిర్ణయం ఏకగ్రీవంగా రాలేదు. సరే, వారన్నట్టు ఏదో ఒక తేదీని ఒప్పుకుంటే ఆ కాలమాన ప్రకారం రాముడు సీత ఎలా ఉండి ఉంటారూ? అడవుల్లో ఆదిమానవుల్లాగా ఒళ్ళంతా వెంట్రుకలతో వానరులా ఉండి ఉంటారు. మనం ఇప్పటి చిత్రపటాల్లో, చలనచిత్రాల్లో చూస్తున్నట్టు అందమైన ఆకారాలతో, బంగారం, వజ్ర వైఢూర్యాలతో చేసిన ఆభరణాలతో, పట్టు పీతాంబరాలతో ఉండి ఉండరు కదా? ఆ కాలానికి మనిషి, అంత నాగరికుడు కాలేదు. రాముడు మనిషి కాదు దేవుడు అని అంటారా? సరే.. సర్వాంతర్యామి, నిరాకారుడు అయిన వాడికి పుట్టిన రోజు ఏదని లెక్కలు వేయడం ఎందుకూ? ఇది ఏరకంగానూ సమర్థనీయం కాని విషయం. ఎవరు తీసుకున్న గోతిలో వారే పడ్డట్టుగా తయారైంది వారి సెమినారు, వందల పేజీల సావనీరు.

ఇవన్నీ ఇలా ఉంచి, ఒక్కసారి రామాయణ కావ్యం రచించిన వాల్మీకి ఏమన్నారో చూద్దాం. రాముడు పదకొండు వేల ఏండ్లు రాజ్యం చేశాడని ఆయన చెప్పారు. పైగా ఆయన, తన దివ్యదృష్టితో అన్నీ చూసి రాశాడని మన పండితులు చెపుతున్నారు. ఏమైనా, "దశవర్ష సహస్రాణి, దశవర్ష శతానిచ, రామోరాజ్య ముపాసిత్వా" అని వాల్మీకి చెప్పిన దానికీ, మన 'మేతావులు' పరిశోధించి ప్రకటించిన రాముని పుట్టిన తేదీకి సంబంధం లేదు. దేనికి ఏదీ కలవకుండా ఉన్నప్పుడు, రుజువు సరిగా లేనప్పుడు అది "కల్పన" అని భావించవల్సి వస్తుంది కదా? పైగా పురాణ కావ్యాల్ని పురాణాలు గానే చూడాలి. అవి వైజ్ఞానిక శాస్త్ర పరిధిలోకి రానేరావు. మత విశ్వాసకులు అనుకునే 'శాస్త్రం' వేరు. దాన్ని సైన్సు పరిగణలోకి తీసుకోదు. ఓ కవి తన కావ్యానికో నాయకుణ్ణి సృష్టించి, కావ్యం రాస్తాడు. తరువాత తరం వారు ఆ కావ్య నాయకుడి పుట్టినరోజు గురించి పరిశోధనలు చేశామనడం హాస్యాస్పదంగా లేదూ?

జ్యోతిష్యానికి మద్దతు పలికే విధంగా తెలంగాణ ప్రభుత్వం ఒక పథకం ప్రవేశపెట్టింది. ఏ రాశివారికి, ఏ నక్షత్రం వారికి ఏ మొక్క శుభమో ఆ మొక్కలే పంపిణీచేస్తామని, పత్రికల్లో పట్టిక ప్రకటించారు. అసలే జ్యోతిష్యుల చేతుల్లో జనం తోలుబొమ్మలయ్యారు. ఇప్పుడు ఇలా శుభం కలిగించే మొక్కల గురించి ప్రచారం చేస్తే, జనం తమ ఇండ్లల్లో, పెరళ్ళలో, ఇండ్లముందు ఆ మొక్కలు మాత్రమే ఉంచుకుని మిగతా చెట్లన్నీ అశుభం జరుగుతుందన్న భయంతో కొట్టేస్తారు. అప్పుడు హరితహారం కాదు గదా, హరిత సంహారం విజయవంత మౌతుంది. కొత్త కొత్త మూఢనమ్మకాల్ని ప్రచారం చేయడంలో ప్రభుత్వాలే ముందుంటే సమాజంలో వైజ్ఞానిక స్పృహ ఎలా పెరుగుతుందీ? అసలు జ్యోతిష్యం సైన్సు కాదని పద్మవిభూషణ్ జయంత్ నార్లేకర్, నరేంద్ర దబోల్కర్‌లు నిరూపించారు. వారు చేసిన పరిశీలనలు, ప్రయోగాలు.. వాటి ఫలితాలు మార్చ్–ఏప్రిల్ 2013 సంచిక "స్కెప్టికల్ ఎంక్వైరర్" పత్రికలో ప్రచురించారు. ఇందులో వందమంది తెలివైన బాలబాలికలు మరో వందమంది మానసిక వికలాంగుల పుట్టిన రోజు, సమయం వగైరాలిచ్చి వారిలో ఎవరు చదువులో రాణిస్తారు.. అని జ్యోతిష్యులనడిగితే, వారు వాస్తవానికి విరుద్ధమైన విషయాలు చెప్పారు. ఇచ్చిన రెండు వందల మందిలో ఎవరు మానసిక వికలాంగులో ఎవరు ఆరోగ్యవంతులైన తెలివైన పిల్లలో జ్యోతిష్యులకు చెప్పలేదు. జాతకంలో అన్నీ రాసుంటాయనే జ్యోతిష్కులు అవకతవకలుగా జాతకం చెప్పారు. మానసిక వికలాంగులు అత్యంత మేధావులవుతారని, తెలివిగల పిల్లలకు చదువురాదని చెప్పారు. చివరికి జ్యోతిష్యమంటే కాకిలెక్కలని తేలింది. మరో పదేండ్ల తర్వాత జాతకాలు పరిశీలించి చూసినా, అవి ఎవరి విషయంలోనూ నిజం కాలేదు. ఈ ప్రభుత్వాలు అశాస్త్రీయ కార్యక్రమాలు ఇలా ఎందుకు చేపడతాయీ.. అంటే ఇవి కార్పొరేట్ ప్రభుత్వాలు కాబట్టి! ప్రజా చైతన్యాన్ని భరించలేవు కాబట్టి!!

వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీవేత్త, బయాలజీ ప్రొఫెసర్, సెల్: 9908633949



దేవి

మహిళని మరచిన మాయదారి బడ్జెట్

> **హర్యానాలో 6రోజుల్లో ఎనిమిది గ్యాంగ్‌రేప్‌లు, హైదరాబాద్‌లో 4 రోజుల్లో ఆరుగురి స్త్రీలపై హింసాత్మక నేరాలు జరిగాయి. జరుగుతున్నాయి. జరగబోతున్నాయి. నిర్భయ నిధి ఏమైందో బడ్జెట్ ప్రతిపాదన అంతా వెతికినా కనబడటం లేదు. "భారత మాత"కు మహా హారతులు, పద్మావతి శీలాన్ని కాపాడటంలో వీధులకు ఎగబడ్డ మూకలే అత్యాచారాలు చేయటంలో అగ్రస్థానం పొందుతున్నారు. బహుశా అందుకే కావచ్చు నిర్భయ చట్టం అమలు నిధి అజా పజా లేదు. ఉన్మాదం వర్తించడానికి వేదికలు ఏర్పాటు చేయటంలో తీరికలేని కాషాయ ప్రభుత్వమే స్త్రీల భద్రతకు తీరికేది? అసలు స్త్రీల భద్రత అనేదే ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత లేదు.**

"బొంకరా బొంకరా వెంకన్నా అంటే మా వూళ్లో మిరియాలు తాటికాయలంత" అన్నాడట. అన్న వాడికీ మిరియాల సైజు తాటికాయల సైజు తెలియకకాదు. తెలిసి నటించడం. దీన్నే మన దేశ బడ్జెట్ అంటున్నారు సదరు ఆర్థిక మంత్రి. బల్లలు చరిచిన పెద్దలు "ఫిదా" అయిపోయారు. వారి సంతోషం ఒక్కటే. వచ్చే ఈ ఏడాదంతా కష్టపడితే "తాటికాయలంత మిరియాల గురించి దేశాన్నంతా నమ్మింగచలం అని. మరి ఇంతకు ముందు ఎన్నికల్లో జనాన్ని ఊచకోత కోయించిన వ్యక్తిని వికాస పురుషుడుగా 10వేల కోట్ల ఖర్చుతో నమ్మించారు గాదా! ఇప్పుడు ఈ ప్రచార బడ్జెట్‌ను అసమదీయులు ఎటూ ఇస్తారు. దానికితోడు జనం డబ్బుతో జనానికి అబద్ధాలు చెప్పే భాగ్యం కలిగిందనే ఆనందం..

అయితే వారికీ జనానికీ కూడా ఒక విషయం బాగా అర్థం అయింది. గత ఐదేండ్లలో వికాసం అంతా గోరక్షణ, మూకల అభివృద్ధి, విదేశీ పర్యటనలు, కార్పొరేటు రాయితీల్లోనే జరిగిందనే వాస్తవం, అందరికీ అర్థం అయ్యింది. ఇప్పుడు "వికాసపు" సానుకూల ప్రచారం నడవదు. మతానికి ద్రోహం జరిగిందా లేదా అనేదానికంటే జనానికి తాము తింటున్నామా లేదా అనేదే ముందు ముఖ్యం అయిపోయింది. కాబట్టి ఇప్పుడు నాలుగేండ్ల తర్వాత అచ్చేదిన్ కోసం నిరీక్షణ పొడిగించడంలో భాగంగా "రైతు" ఆరోగ్యం, కొంత సంక్షేమం అవసరం అయింది. పాపం ఇంకా రాయితీలు ఆశించిన కార్పొరేట్లు (49శాతం నుండి 58శాతానికి, ప్రస్తుతం 73శాతానికి, సంపద ఒక్కశాతం చేతిలోకి చేరినా) సంతృప్తి చెందలేదు, ఆశాభంగం చెందాయి. ఈ ఒక్కసారి ఓపిక పడితే మళ్ళీ ఐదేండ్లు రాయితీలే రాయితీలని వారు అర్థం చేసుకున్నారు. గాని వారి ఆశాభంగం ప్రకటించక పోతే సర్కారు "రైతు" పక్షం అయిందనే విషయం వెల్లడికాదు. కాబట్టి యథాశక్తి అసంతృప్తి ప్రకటించారు.

కాని, పులిమచ్చలు ఏదేసి తోమినా పోవు. కాబట్టి ఎంత దాచినా అబద్ధాలు అంకెలుగా బయటపడతాయి. గత ఐదారేండ్లలో ఎన్నడూ లేనంతగా మహిళా రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. వలసల వలన వ్యవసాయంలో ఇప్పుడు 68శాతం మహిళలే. వాళ్ళు కూలీలుగానే కాదు, సేద్యం చేసేవాళ్ళుగా ఉన్నారు. స్వంత భూమేకాదు, కౌలుకు తీసుకుని కూడా సేద్యం చేస్తున్నారు. అయితే భూమి పట్టా వారి పేరుమీద లేకపోవడం కౌలు రైతులకు గుర్తింపు లేకపోవడంతో వారికి ఎటువంటి ప్రభుత్వ సహకారం, రాయితీలు లభించవు. ఆత్మహత్యలు చేసుకుంటే "రైతు"గా పరిహారం ఉండదు. కుటుంబ కారణాలు అనే నమోదు అవుతుంది. బతుకులోనే కాదు, చావులో కూడా నేలకు వారు ధారపోసిన శ్రమ గుర్తింపునకు నోచదు.. ఈ బడ్జెట్ "రైతు"కు ప్రకటించిన సదరు తాయిలాల్లో ఎక్కడా మహిళా రైతుల ప్రస్తావన కనిపించదు. అంటే వ్యవసాయం ఏ తీరున ఎవరి చేతిలో సాగుతుందో తెలిసి కూడా స్త్రీలను పక్కన పెట్టడం అంటే వారికున్న ప్రత్యేక సమస్యల్ని నిర్లక్ష్యం చేయటం. ప్రభుత్వ పరంగా వారి గుర్తింపు నిరాకరించడం. వ్యవసాయం.. రైతుది. మగాళ్ళది.. వాళ్ళకిస్తే కుటుంబానికీ స్త్రీలకూ



యిచ్చినట్టే అనే పచ్చి మతవాద మనువాద మగస్వామ్య అలవాటులో భాగమే. రైతుని కాపాడటం వ్యవసాయ సంక్షోభం నుండి బయట పడేయటం అత్యవస్యకం, అయితే రైతమ్మలను కలుపుకోకుండా వ్యవసాయాన్ని బాగుచేయటం అసాధ్యం.. ఆ విషయం పరిగణనలోకి తీసుకోలేదంటే అసలు వ్యవసాయాన్ని బాగుచేసే ప్రకటనల్ని ఎన్నికల ముందు జరిగే "గుండు గుత్తా" ప్రకటనల్లో భాగంగానే భావించాలి.

హర్యానాలో 6రోజుల్లో ఎనిమిది గ్యాంగ్‌రేప్‌లు, హైదరాబాద్‌లో 4 రోజుల్లో ఆరుగురి స్త్రీలపై హింసాత్మక నేరాలు జరిగాయి. జరుగుతున్నాయి. జరగబోతున్నాయి. నిర్భయ నిధి ఏమైందో బడ్జెట్ ప్రతిపాదన అంతా వెతికినా కనబడటం లేదు. "భారత మాత"కు మహా హారతులు, పద్మావతి శీలాన్ని కాపాడటంలో వీధులకు ఎగబడ్డ మూకలే అత్యాచారాలు చేయటంలో అగ్రస్థానం పొందుతున్నారు. బహుశా అందుకే కావచ్చు నిర్భయ చట్టం అమలు నిధి అజా పజా లేదు. ఉన్మాదం వర్తించడానికి వేదికలు ఏర్పాటు చేయటంలో తీరికలేని కాషాయ ప్రభుత్వమే స్త్రీల భద్రతకు తీరికేది? అసలు స్త్రీల భద్రత అనేదే ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత లేదు.

స్త్రీల ఉపాధి 46 నుండి 19.7శాతానికి పడిపోయింది. దీనిని సరిచేయడానికి 14 లక్షల అంగన్‌వాడీలకు 500 కోట్లు కేటాయించారు. అంటే ఒక్కొక్క కేంద్రానికి 3700 చిల్లర వస్తుంది. దీనితో గ్రామంలో మహిళలకు సాధకారిత, వృత్తి నైపుణ్యాలు అన్నీ అందించేయాలి. అది కూడా అంగన్‌వాడీ టీచరే చేయాలి. నేర్పేవారిని నియమించడానికి ఈ "నిధి"తో అవకాశమే లేదు. ఇక "ముద్ర" రుణాలు తీసుకుని పకోడీల వ్యాపారం స్వయం ఉపాధితో పనిచేసే వయస్సులో ఉన్న 30 కోట్ల మంది (15–60ఏండ్ల) స్త్రీలు ఆర్థిక స్వావలంబన పొందే స్వర్ణయుగం ఈ బడ్జెట్ ద్వారా ఆవిష్కరించబడింది. ఇదే "ముద్ర" రుణాలు ఒక విషాద వైఫల్య గాథని అందరూ మొత్తుకుంటున్నారు. కానీ అది గిట్టని వాళ్ళ ప్రచారం అని కొట్టిపారేశారు మన ఆర్థిక మంత్రి.

ఇక దీనికి కొనసాగింపుగా జాతీయ జీవనోపాధుల మిషన్‌కు 5,700 కోట్లు కేటాయించారు. ఇది ప్రధానంగా స్త్రీలకు సంబంధించింది. ఈ నిధిని కూడా ఉపాధి అవసరం ఉన్న స్త్రీల సంఖ్యతో పోల్చి చూస్తే సముద్రంలో కాకిరెట్టని అర్థం అవుతుంది.

"నూరు రోజుల పని"కి ఎన్నడూ లేనంత కేటాయింపు చేశామని జబ్బలు చరుచుకున్నారు. కాని పనికోసం అడిగి పని పొందని వారి సంఖ్య 15శాతంపైగా ఉందని, ఏ రాష్ట్రమూ పూర్తిగా వందరోజుల పని యివ్వడం లేదని ప్రభుత్వ నివేదిక ఆర్థిక సర్వే పేర్కొంది. పనిచేసిన వారికి చెల్లింపులు జరగకపోవడం 35శాతం నుండి 56శాతానికి పెరిగిందని కూడా ఆ నివేదిక నిర్ద్వందంగా పేర్కొంది. మరి గతంలో జరిగిన కేటాయింపులు ఎటు మళ్ళాయి? ఇప్పుడు కేటాయించిన నిధి నిజంగా పనివారికి చేరుతుందా అనేదే అసలు సమస్య.

ఈ నూరు రోజుల పని గ్రామీణ దుర్భరత్వానికి స్వాంతన యిచ్చింది. ప్రత్యేకించి స్త్రీలకు అవకాశం కలిగించే నియమ నిబంధనలు కలిగి ఉంది. అటువంటి పథకాన్ని గత ఐదేండ్లలో నీరు కార్చి నానా తిప్పలు పెట్టి ఇప్పుడు ఉన్నట్టుండి నిధులు పెంచాం అంటున్నారు. ఇది నిజానికి గతేడాది కంటే కేవలం 1శాతం పెరిగింది. గతేడాది 8 రాష్ట్రాలు కరువు రాష్ట్రాలుగా ప్రకటించాయి. దానికి తోడు "నోట్ల రద్దు"తో ఉపాధి అవకాశాలు నాశనం అవడంతో పట్టణాలు వదిలి పల్లెలకు చేరుకున్న వలసదారులతో నూర్రోజుల పని ఒక్కటే కుటుంబాధారంగా మారింది. మరి 1శాతం పెంపు ఎందరి కడుపు నింపుతుందో చూడాలి.

మహిళా శిశు సంక్షేమశాఖకు 12శాతం నిధులు పెంచినట్టుగా ప్రకటించారు. అయితే తరచిచూస్తే ప్రధానమంత్రి మాతృవందనం, కౌమార బాలికా పథకం, మహిళా శక్తికేంద్రాలు, శిశు సంరక్షణా కేంద్రాలు, మహిళా హాస్టల్ స్కీమ్, గ్రామీణ నిర్భయ కేంద్రాల వంటి అన్ని రకాల పథకాలు కలిపి ఈ శాఖ కేటాయింపుల కిందకి చేర్చడం వలన ఈ పెరుగుదల భారీ అంకెగా కనబడుతోంది. నిజానికి 4 వేల కోట్ల నిర్భయ నిధిలో గతేడాది ఒక్క 500 కోట్లదాకా ఖర్చు చేసారు. మిగిలింది దారి మళ్లించారు. ఇప్పుడు కేవలం 500 కోట్లు అదీ గ్రామీణ నిర్భయ కేంద్రాల కోసం కేటాయించారు. గతేడాది దేశవ్యాప్తంగా 150 జిల్లా కేంద్రాల్లో నిర్భయ కేంద్రాలు ఏర్పాటుకు 150 కోట్లు కేటాయించింది. ఇప్పుడు మిగిలిన జిల్లాల గురించి ప్రస్తావించకుండా నేరుగా గ్రామస్థాయికి ఈ కేంద్రాల ఏర్పాటుకు 500 కోట్లు అంటే ఉట్టి కెగరలేని వాళ్ళు స్వర్గానికెగురుతారనన్నట్టుంది.

స్త్రీలకు సంబంధించినంత వరకూ ఈ బడ్జెట్ ఓటర్లుగా కూడా వారిని ఆకర్షించాలనే ఉద్దేశ్యంతో అయినా కేటాయింపులు చేయలేదు. ప్రత్యుత్పత్తి, శిశు సంక్షేమంలోనే వారిని పరిమితం చేయటం ద్వారా ఉపాధిలో ఉత్పత్తిలో వారి పాత్రను అవసరాన్ని గుర్తించడానికి నిరాకరించింది. ఇది వారు అనుసరించే ఛాందస భావజాలపు ప్రతిబింబం. ■



మోకాళ్ళు నల్లబడితే!



పాదాలు అందంగా, మృదువుగా కనిపించడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. అయిన ఎలాంటి ఫలితం కనిపించపోతే ఓ సారి కింది చిట్కాలను పాటించి చూడండి.

- క్యారెట్ తురుములో రెండు చెంచాల గ్లిజరిన్ కలిపి పాదాలకు ప్యాక్‌లా వేసుకుంటే పాదాలు మృదువుగా తయారవుతాయి. అలాగే సగం చెంచా పసుపు, తాజా కొబ్బరి తురుము సగం కప్పు తీసుకోవాలి. ఈ రెండింటినీ బాగా కలిపి పాదాలకు పట్టించి మర్దనా చేయాలి. తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగితే అరికాళ్ళు రంగు మారడంతో పాటు అందంగా తయారవుతాయి.
- అరి కాళ్ళు మృదువుగా ఉండాలంటే తరచూ వాటిని కొబ్బరి నూనెతో మర్దనా చేస్తుండాలి.
- మోకాళ్ల నల్లగా ఉంటే నారింజ పొడిని కొబ్బరినూనెలో అరగంట పాటు నానబెట్టి ఆ మిశ్రమాన్ని మోకాళ్ళకు ప్యాక్ లా వేసుకోవాలి. తర్వాత శనగపిండి, పాలు, తేనె ఒక్కో చెంచా తీసుకొని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మోకాళ్ల కు పట్టించి ఆరాక కడిగేసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. .
- కీరా జ్యూస్‌లో బియ్యపు పిండిని కలిపి పాదాలకు ప్యాక్‌గా వేసుకుంటే కాళ్ళపగుళ్ళు తగ్గుతాయి.
- కొందరికి పాదాల మడమలు మోటుగా బిరుసైన చర్మంతో ఉంటాయి. ఇటువంటివారు నిమ్మరసం పంచదార కలిపిన మిశ్రమంతో మర్దనా చేసుకుంటే ఫలితం ఉంటుంది.
- చెంచా శనగపిండి, కొద్దిగా పసుపును పెరుగులో కలపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు రాసి కాస్త ఆరిన తర్వాత గట్టిగా రుద్ది కడిగేస్తే మృతకణాలు తొలగిపోతాయి.

ఉప్పునీరు వాడితే..!

జుట్టు ఊడిపోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. అయితే జుట్టు ఊడిపోవడానికి ప్రధాన కారణం వింటే మీరు ఆశ్చర్యపోతారు. ఏంటంటారా? అవే ఉప్పునీళ్ల. పదేపదే ఆ నీటితో స్నానం చేయడం వల్ల ఆ నీటిలో ఉండే కొన్ని రకాల ఖనిజ లవణాలు తలకు హానిచేస్తాయి. ముఖ్యంగా



వెంట్రుకలను బలహీనపరుస్తాయి. దాంతో చివర్లు చిట్లి క్రమంగా ఊడిపోతాయి. పొడిబారినట్టై కొన్నిసార్లు జుట్టు ఎండుగడ్డిలా మారడం, పల్చబడటం, నెరవడం వంటి సమస్యలూ తప్పవు. కండిషనర్ వాడుతున్నప్పటికీ ఈ సమస్యలు ఎదురవుతాయి కాబట్టి మీరు వాడుతున్న నీటిలో రసాయనాలు ఏ మేరకు ఉన్నాయనేది తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ఒక మగ్గు నీటిలో సబ్బు వేసి నురగ వచ్చేదాకా బాగా కలపాలి. నురగ బాగా వస్తే ఆ నీరు కఠిన జలం కాదని తెలుస్తుంది. ఒకవేళ నురగ రాకపోతే ఆ నీటిని తలస్నానానికి వాడకూడదు. ✶

అయినా పొడిబారితే..?

పెదాలకు లిప్‌బామ్ రాస్తున్నా ఇంకా పొడిబారుతున్నాయా.. అయితే దాన్ని మానేయడం మంచిది. అందులోని రసాయనాలే ఈ సమస్యకు కారణం అవుతాయి. అయితే లిప్‌బామ్‌ని ఎంచుకునే ముందు ఈ విషయాలు గుర్తుపెట్టుకోవడం మంచిది.

- ఫినాల్, మెంతాల్, శాలిసినిక్ ఆసిడ్ లాంటివి పెదాలను తాత్కాలికంగా మృదువుగా ఉంచినా తర్వాత పొడిబారుస్తాయి. ఈసారి లిప్‌బామ్ ఎంచుకునే ముందు అందులో ఏమున్నాయో పరిశీలించుకుంటే మంచిది.
- లిప్‌బామ్‌లో తేమనందించే ఎస్‌పీఎఫ్ కనీసం 30 శాతం ఉండేలా చూసుకోవాలి.
- వివిధ పరిమళాలు, ఫ్లేవర్లున్నవి కొన్నిసార్లు దురదకు కారణమవ్వొచ్చు. మామూలు రకాలు ఎంచుకోవడానికే ప్రయత్నించండి.
- మన శరీరంలో ఇనుము, విటమిన్ బి శాతం, నీటి శాతం



తగ్గినా, పెదాలు పొడిబారతాయి. ఇవన్నీ ఒకసారి పరిశీలించుకోండి. అవసరం అనుకుంటే ఆ పోషకాలను ఆహారంగా తీసుకోండి.
- ఇంట్లో అందుబాటులో ఉండే పదార్థాలతోనే పెదాలను ఆరోగ్యంగా ఉంచుకునేందుకు ప్రయత్నించండి. వీలైతే తేనె, నెయ్యితో మృదువుగా మర్దనా చేయండి. ఇవి పెదాలకు సహజ తేమను అందిస్తాయి. ✶



డాక్టర్ వినోద వెంకట స్వామి... చదువు సమాజానికి ఉపయోగపడాలని నిరంతరం తపించే వ్యక్తి. భర్త నిత్యం ట్రాన్స్‌ఫర్లతో రాష్ట్రమంతా తిరిగేవారు. అయినా కుటుంబ బాధ్యతలు చూస్తూ చదువును కొనసాగించారు. నలుగురు పిల్లలకు తల్లిగా, కోడలిగా, భార్యగా ఇన్ని కర్తవ్యాలు నిర్వర్తిస్తూనే నేటి పిల్లలకు నాణ్యమైన విద్యతోపాటు ఉపాధి కల్పించేలా ఓ విద్యా సంస్థను స్థాపించారు. ఎంతోమంది యువకులకు బంగారు భవిష్యత్‌ను చూపిస్తున్న ఆమె గురించి మరికొన్ని సంగతులు ఆమె మాటల్లోనే...

సమాజానికి ఏమైనా చేయాలనే



నేను పుట్టింది హన్మకొండ. అమ్మది హన్మకొండ, నాన్నది కరీంనగర్. నాన్న శ్రీధరస్వామి. ఉస్మానియాలో రిటైర్డ్ ప్రొఫెసర్. ప్రైమరీ స్కూల్ టీచర్‌గా జీవితం ప్రారంభించిన ఆయన తర్వాత ప్రొఫెసర్ వరకు ఎదిగారు. అమ్మ జయప్రద. గృహిణి. మేం ముగ్గురు ఆడపిల్లలం, ఓ అబ్బాయి. ఇంట్లో అందరూ చదువుకున్న వారే కాబట్టి చదువుకు ప్రాధాన్యం ఇచ్చేవారు.

చదువుకు బ్రేక్ పడలేదు

ఉద్యోగరీత్యా నాన్న హైదరాబాద్ రావడంతో మా చదువంతా ఇక్కడే సాగింది. స్కూల్లో ఉన్నప్పుడు లెక్కలంటే చాలా ఇష్టం. అయితే డాక్టర్ కావాలనే కోరికతో మొదట బైపీసీ తీసుకున్నాను. కానీ అది సాధ్యం కాలేదు. దాంతో మళ్ళీ ఎంపీసీ తీసుకున్నాను. నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు సెలక్ట్ అయ్యాను. ఇంటర్ నుండి ఎమ్మెస్సీ వరకు ఫ్రీగా చదువుకున్నాను. అప్పట్లో ఆడపిల్లలకు ఇంత చదువులు అవసరమా? అని విమర్శించే వారు. మా బంధువుల్లో నాకంటే చిన్నపిల్లలకు పెండ్లి చేసేవారు. కానీ మా నాన్న మాత్రం నా చదువుకు ప్రాధాన్యం ఇచ్చారు. కనీసం డిగ్రీ పూర్తి చేసేవరకు పెండ్లి చేయకూడదని నిర్ణయించుకున్నారు. దాంతో నా చదువుకు బ్రేక్ పడలేదు.



నాన్న సలహా, మామయ్య సహకారం

డిగ్రీలో బీఎస్సీ చేసి ఎమ్మెస్సీ (ఆర్గనిక్ కెమిస్ట్రీ) చేశాను. పీజీ ఫస్ట్ ఇయర్‌లో ఉన్నప్పుడు నా పెండ్లి జరిగింది. మావారు వెంకట స్వామి. అప్పట్లో సర్కిల్ ఇనిస్పెక్టర్. నేను పీజీ పూర్తి చేసి కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేద్దామని చేరాను. అయితే ప్రెగ్నెన్సీ కన్ఫామ్ అయిన తర్వాత కెమికల్స్ వల్ల ఇబ్బంది అయ్యింది. దాంతో రీసర్చ్ కొనసాగించలేకపోయా. అక్కడితో అది ఆగిపోయింది. అప్పుడే నాన్న 'నువ్వు బీఎడ్ ఎందుకు చేయకూడదు' అన్నారు. నాన్న ఇచ్చిన సలహాతో బీఎడ్, ఎంఎడ్ చేశాను. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సబ్జెక్ట్ తీసుకుని పీహెచ్‌డీ కూడా పూర్తి చేశాను. పెండ్లి తర్వాత మా నాన్న పాత్రను మామయ్య తీసుకున్నారు. దాంతో నా చదువుకు ఎలాంటి ఆటంకం కలగలేదు.

చదువు సమాజానికి ఉపయోగపడాలి

మావారికి ఎక్కువగా ట్రాన్స్‌ఫర్‌లు ఉండడంతో ఒక దగ్గర కంటిన్యూగా ఉండలేకపోయాం. దాంతో ఉద్యోగం చేయలేకపోయాను. చదువుకున్న తర్వాత ఖాళీగా ఎందుకు ఉండాలి? ఇంత చదువుకుని ఏమీ చేయకపోతే రేపు నా పిల్లలకు ఏం చెప్పగలను. ముందు తల్లిగా పిల్లలకు ఆదర్శంగా నిలవాలి. పైగా స్కాలర్‌షిప్‌తో చదువుకున్నాను. సమాజానికి ఏమైనా చేయాలి. అందుకే షాదాన్ కాలేజీలో లెక్చరర్‌గా చేరాను. అదే సమయంలో మా వారికి కడపకు ట్రాన్స్‌ఫర్ అయింది. అప్పటికే మాకు ముగ్గురు అమ్మాయిలు, బాబు. పిల్లలతో నేను ఇక్కడ, ఆయన అక్కడ కష్టమయింది. దాంతో నేను కూడా పిల్లల్ని తీసుకుని కడప వెళ్ళిపోయాను. అక్కడకు వెళ్ళిన తర్వాత ఓ కోచింగ్ సెంటర్ మా ఇంట్లోనే ప్రారంభించాం. ఇంటర్ ఎంసెట్, బీఎస్సీ వారికి కెమిస్ట్రీ కోచింగ్ ఇచ్చేదాన్ని. ఆరు నెలల్లో పిల్లల సంఖ్య 150కు చేరుకుంది. దాంతో నాపై నాకు నమ్మకం వచ్చింది.

మంచి ఫ్యాకల్టీ వల్లనే

మళ్ళీ మావారికి హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయింది. ఫ్యామిలీ మొత్తం ఇక్కడికి రావాలంటే పిల్లల చదువులకు ఇబ్బంది. అందుకే పిల్లలను హాస్టల్లో చేర్పించి మేం హైదరాబాద్ వచ్చేశాం. అప్పటికే కడపలో కోచింగ్ సెంటర్ ప్రారంభించడంతో మంచి అనుభవం వచ్చింది. దాంతో 1991లో ఐఎస్ఓ పేరుతో ఇక్కడే ఎంసెట్ కోచింగ్ సెంటర్ ప్రారంభించాం. నాకు ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మా దగ్గర చేరిన వారిలో ముగ్గురు టాపర్స్‌గా నిలిచారు. మంచి ఫ్యాకల్టీ ఉండటం వల్ల ఇది సాధ్యమైంది. పిల్లలకు, తల్లిదండ్రులకు మా ఇనిస్టిట్యూట్‌పై నమ్మకం ఏర్పడింది. దాంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. అదే సమయంలో 1995లో నాచారంలో ఓ కాలేజీ మూసివేస్తుంటే నాన్న నన్ను తీసుకోమన్నారు. దాన్ని రెగ్యులర్ జూనియర్ కాలేజీగా ప్రారంభించాం. కార్పొరేట్ కాలేజీలు వచ్చిన తర్వాత కాస్త కంగారు పడ్డాం. కానీ మా ఇనిస్టిట్యూట్‌కు ఎలాంటి ఇబ్బంది రాలేదు. అంతటి పోటీని కూడా తట్టుకని నిలబడ్డాం. ఇది కేవలం మంచి ఫ్యాకల్టీ వల్లనే సాధ్యమైంది. మా దగ్గర గత 20 ఏండ్ల నుంచి పని చేస్తున్న ప్రొఫెసర్స్ ఉన్నారు.

తృప్తిగా ఉంది

రెగ్యులర్ కోర్సులతోపాటు పిల్లలకు వృత్తివిద్య కూడా అందించాలని కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ గ్రాఫిక్స్, లాబ్ టెక్నీషియన్, ఎంపీహెడ్‌డబ్ల్యూ, ఫార్మసీ ఇలా ఐదారు ఒకేషనల్ కోర్సులు ప్రారంభించాం. ఇవి కాక రెగ్యులర్ ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ కూడా ఉన్నాయి. 2011లో 'నవ్య ఎడ్యుకేషన్ సొసైటీ' పేరుతో బికాం కంప్యూటర్స్, బికాం జనరల్, బిఎస్సీ కంప్యూటర్ కోర్సులతో డిగ్రీ కాలేజీ ప్రారంభించాం. లాలాపేట్‌లో ఒకేషనల్ కాలేజీ, ఇంటర్ ఉంది. అందరూ కలిపి 800 మంది విద్యార్థులు ఉంటారు. ఇంతమంది పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నందుకు చాలా తృప్తిగా ఉంది. మావారు మూడేండ్ల కిందట ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ కమిషనర్‌గా రిటైర్డ్ అయ్యారు. ఇప్పుడు బాసర ట్రిపుల్ ఐటీ కాలేజీ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరం ఒకే ఫీల్డ్‌లో ఉన్నాం కాబట్టి ఆలోచనలు షేర్ చేసుకుంటాం. మా పిల్లలు కూడా ఇనిస్టిట్యూట్‌ను ఇంకా డెవలప్ చేయాలని ఆలోచిస్తున్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తి

ప్రొఫెసర్ జయశంకర్‌గారు మా నాన్నకు మంచి స్నేహితులు. ఆయన్ని నేను మామయ్య అని పిలిచేదాన్ని. నాకు స్ఫూర్తి ఆయనే. తొలి తెలంగాణ ఉద్యమంలో ఆయనతో కలిసి నాన్న చాలా యాక్టివ్‌గా పని చేశారు. అండర్ గ్రౌండ్‌లో కూడా ఉన్నారు. ఈ మధ్య జరిగిన ప్రత్యేక తెలంగాణ పోరాటంలో ఆత్మహత్యలు చేసుకున్న వారిని కలిసి వివరాలు సేకరించారు. ప్రస్తుతం నాన్నకు 84 ఏండ్లు. ఇప్పటికీ ఆయన దగ్గర తెలంగాణకు సంబంధించి చాలా సమాచారం ఉంది.

కవితలు రాస్తాను

నా అసలు పేరు బినోద. బెంగాలీ నవలలు నాన్న బాగా చదివేవారు. ఆయన చదివిన ఓ నవలలోని పేరు నాకు పెట్టారు. నేను కూడా రవీంద్రనాథ్ ఠాగూర్ పుస్తకాలు బాగా చదువుతాను. అయితే ఇక్కడ బినోద అని పలకకపోవడం వల్ల వినోదగా మారిపోయింది. పదో తరగతి నుండే కవితలు రాస్తున్నాను. ఆలిండియా రేడియోలో యాంకరింగ్, కొన్ని లైవ్ ప్రొగ్రామ్స్ చేశాను. 'అక్షరం నుంచి అనంతానికి' అనే కార్యక్రమం నేనే చేశాను. మా పెద్దమ్మాయి డాక్టర్, ఇద్దరమ్మాయిలు ఇంజనీర్స్, బాబు ప్రస్తుతం మెడిసన్ చేస్తున్నాడు. ఇద్దరు అల్లుళ్ళు డాక్టర్లు. నాకు ఐదుగురు మనవళ్ళు . ఎవరి పుట్టిన రోజైనా ఓ కవిత రాసి విష్ చేస్తాను. దాంతో పిల్లలు కూడా చాలా హ్యాపీగా ఫీలవుతారు.

సలీమ

ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం

కుటుంబంలో అమ్మాయికి ఆర్థిక స్వేచ్ఛ ఉండాలి. ప్రతి దానికీ ఇతరులపై ఆధారపడడం, చిన్న చిన్న ఖర్చుల కోసం భర్త దగ్గర చేయిచాపడం మంచిది కాదు. మనకంటూ కొంత ఆదాయం ఉండాలి. మనం సంపాదించిన డబ్బుతో అమ్మ అవసరాలు తీర్చితే చాలా సంతోషంగా ఉంటుంది. కాబట్టి అమ్మాయిలకు ఆర్థిక స్వేచ్ఛ చాలా అవసరం. చదువుంటే ఏపనైనా చేసుకుని స్వతంత్ర్యంగా బతకొచ్చు. బయటకు వెళ్ళి జాబ్ చేయాలనేం లేదు. ఇప్పటి టెక్నాలజీని ఉపయోగించి ఇంట్లో ఉండే డబ్బు సంపాదించే ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించుకోవాలి.

పిల్లల అభిప్రాయాలకు విలువనివ్వాలి

పిల్లలకు చదువు విషయంలో కొంత స్వేచ్ఛ నివ్వాలి. పిల్లల శక్తినీ, ఆసక్తిని తల్లిదండ్రులు గుర్తించాలి. తమ కోరికలను, ఆశలను బలవంతంగా పిల్లలపై రుద్దకూడదు. ఏ కోర్సు చేస్తే ఎలాంటి ఉపయోగాలో చెప్పి వాళ్ళను గైడ్ చేయాలి. కానీ ఒత్తిడి చేయకూడదు. పిల్లల అభిప్రాయాలకు విలువనివ్వాలి. ముఖ్యంగా ఇతర పిల్లలతో పోల్చకూడదు. దీన్ని వల్ల పిల్లలు ఇబ్బంది పెడతారు. పిల్లలపై ఒత్తిడి పెంచితే వాళ్ళు మానసికంగా కుంగిపోయి చివరకు ఆత్మహత్యలు చేసుకునే స్థాయికి దిగజారుతారు. కాబట్టి పిల్లల్లో మనం మానసిక ధైర్యాన్ని పెంచాలి.



20 నుంచి 30 అనేది ప్రతి వ్యక్తి వయసులో చాలా ముఖ్యమైనది. మీ కోసం మీరు ఊహించిన జీవితాన్ని నిర్మించడం ఈ సమయంలోనే మొదలెడతారు. జీవితంలో స్థిరపడాలని ఆశించేందుకు అనువుగా వున్న ముఖ్యమైన కాలం కూడా ఇదే. కొంతమంది డబ్బు సంపాదించడం, దాన్ని ఖర్చుపెట్టి సరదాలు తీర్చుకోవడం మీదే దృష్టిపెడతారు. అయితే 20,30 వయసులో మీ ఆర్థిక లక్ష్యాలను చేరుకునే విషయంలో చేసే తప్పుల గురించి చెప్పేవారు తక్కువ. అందుకే ఈ వయసులో ఎక్కువ మంది చేసే తప్పుల గురించి ఇక్కడ తెలుసుకుందాం.

అసలైన సమయం ఇదే

బడ్జెట్ లేకుంటే

మొదటి ఉద్యోగం. అది ఒక గొప్ప భావన. మీరు డబ్బు సంపాదిస్తున్నారంటే, దానిని మీరే ఖర్చు చెయ్యాలి. అది అలా పోయేంత వరకూ మనము తరచుగా ఖర్చు చేస్తూ ఉంటాం. బడ్జెట్ అనే మాట కాస్త కఠినంగా ఉన్నా, వాస్తవానికి అది మీకు మరింత స్వేచ్ఛను ఇస్తుంది. బడ్జెట్ ఉంటే అనవసరమైన ఖర్చులను తగ్గిస్తుందనే విషయం తెలియకుండా ముందుకు సాగుతుంటారు. కానీ ఇలా కష్టార్జితానికి బడ్జెట్ లేకపోతే కష్టం.

క్రెడిట్ రేటింగ్

కొంత మంది అతి జాగ్రత్తగా డబ్బు వాడటం వల్ల క్రెడిట్ స్కోర్ అనేది లేకుండా తయారవుతారు. తక్కువ క్రెడిట్ స్కోర్ ఉంటే ఇన్సూరెన్స్, కారు ఫైనాన్సింగ్, తనఖా రేట్లు లాంటి వాటి కోసం మీ ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడు మీ సొంత క్రెడిట్ కార్డును పొందడం, బిల్లులను శ్రద్ధగా చెల్లించడం, క్రెడిట్-భీమా రుణాన్ని పొందడం ద్వారా మంచి క్రెడిట్ స్కోర్ను మీరే సరిగ్గా నిర్మించుకున్న వారవుతారు.

అంచులో జీవించు

మీరు చిన్న వయసులో ఉన్నప్పుడు అత్యవసర నిధి గురించి పెద్దగా ఆలోచించరు. అలాంటప్పుడు భవిష్యత్తులో ఏం జరగవచ్చో మీకు తెలియదు. ఆర్థికంగా హఠాత్తుగా తలెత్తే సంక్షోభాలు చాలా మందిని రోడ్డున పడేస్తాయి. ఒక్కోసారి మీరు లోటు బడ్జెట్లో ఉన్నప్పుడు పెంపుడు జంతువు ఆకస్మిక అనారోగ్యం కూడా పెద్ద సవాలుగా కనపడతుంది. ఊహించని పరిణామాలు ఎదురైనప్పుడు, అత్యవసర నిధులను మీ దగ్గర ఉండేందుకు దోహదం చేసే ప్రయత్నాన్ని ఇప్పుడే ప్రారంభించండి.

ఆరోగ్య బీమా

ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న యువకులు ఆరోగ్య బీమా ఉంటే చాలు వచ్చే ఆటంకాలను దాటవేయవచ్చు అనుకుంటున్నారు. కానీ కొన్ని రకాల దీర్ఘకాల వ్యాధులకు బీమాలు పనికిరావు. అటువంటి అధిక వైద్య బిల్లులు కారణంగా మీరు వ్యక్తిగత దివాలాకు దారి తీస్తారు. మీరు కోరుకునే ఉత్తమ కవరేజ్‌ను పొందటం కోసం బీమా ఎంత త్వరగా చెల్లిస్తుందో తెలుసుకోవాలి. ఎటువంటి పరిస్థితుల్లోనైనా కనీసం రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల కవరేజీ కలిగిన హెల్త్ ఇన్సూరెన్స్ కలిగి ఉండటం ఇప్పుడు కనీస అవసరం.

ప్రవాహంతో వెళ్లడం


"మీరు అవసరానికి తగ్గట్లుగా దిశను మార్చుకోకపోతే, మీ ఆరంభం దగ్గరే మీ ప్రయాణం ముగుస్తుంది" అన్నారు ఓ మేధావి. ఒక మంచి ఆలోచన చేసి, దాని కోసం మీరు ఏ మార్గములో ఉన్నారనే దానిని మొదటే నిర్ధారించుకోండి. "నేను ఒక సొంత ఇంటి కోసం పని చేయాలనుకుంటున్నాను", "నేను ఒక వారంలో 20,000 పొదుపు చెయ్యాలి" వంటి సాధారణ లక్ష్యాలనే విస్తృతమైన అవగాహనతో ఆ దిశగా మొదటిగా చిన్న చిన్న అడుగులను వెయ్యడం ప్రారంభించాలి.

ఆర్థిక అక్షరాస్యత ముఖ్యమే

ఇంటర్నెట్లో మీ ఆర్థిక వ్యవస్థలను నిర్వహించడంలో మీకు సహాయపడే సైట్లు ఒకానొక నిర్ణీత పరిధి వరకు సలహాలను అందిస్తాయి. మనకంటూ ఓ ఆర్థిక సలహాదారును కలిగి ఉండటం వల్ల ఆర్థిక స్థితిని గాడిలో పెట్టుకోవచ్చు. అలా కాకుండా ఏదో సాగుతుంది కదా అనే ధోరణితో ఎక్కడ పడితే అక్కడ పెట్టుబడులు పెడితే దీర్ఘకాలంలో కొన్ని ఆర్థిక ఇబ్బందులు తప్పవు. ✶

ప్రస్తుతం అందరికీ ఉన్న ఏకైక సమస్య గాలి కాలుష్యం. బయట ట్రాఫిక్‌లో తిరుగుతున్నప్పుడే కాదు.. ఇంట్లో కూర్చున్నా స్వచ్ఛమైన గాలిని పీల్చలేకపోతున్నాం. గాలిని స్వచ్ఛంగా మార్చుకునేందుకు ఎయిర్ ప్యూరిఫయర్లు కూడా వాడేస్తున్నాం. కానీ అలాంటివేమీ వాడకుండానే మీ ఇంట్లో మీరు స్వచ్ఛమైన గాలిని పీల్చొచ్చు. దానికి చేయాల్సిందల్లా కొన్ని రకాల మొక్కల్ని పెంచడమే.

గాలిని శుభ్రపరిచే మొక్కలు











పీస్ లిల్లీ: అత్యంత శక్తివంతమైన ఇండోర్ ఎయిర్ ప్యూరిఫయర్లలో పీస్ లిల్లీ ఒకటి. నీడలో ఈ మొక్క చాలా సులభంగా ఎదుగుతుంది. దీనికి సూర్యరశ్మితో పనిలేదు. దీని పచ్చని ఆకులు, తెల్లని పువ్వులు సంవత్సరం పొడవునా వికసిస్తూనే ఉంటాయి.

స్నేక్ ప్లాంట్: మీ బాత్ రూంలో తేమను తగ్గించాలనుకుంటే ఓ కుండీలో స్నేక్ ప్లాంట్‌ను తీసుకుని అనువైన చోట ఉంచండి. అంతేకాకుండా ఈ స్నేక్ ప్లాంట్‌కు విషవాయులను శోషించుకునే గుణం కూడా ఉంది. కాబట్టి గాలి కూడా స్వచ్ఛంగా మారుతుంది. ఇది ఎండ, నీడ రెండు చోట్ల బతుకుతుంది.

మనీ ప్లాంట్: ఇది చాలామందికి తెలిసిన ఇండోర్ ప్లాంట్. దీనిలో గాలిని శుద్ధిచేసే గుణాలు పుష్కలంగా ఉన్నాయి. మనీ ప్లాంట్ గాలిని ఫిల్టర్ చేసి ఆక్సిజన్ ఇన్‌ఫ్లోను పెంచుతుంది.

కలబంద: చర్మ సౌందర్యానికి కలబంద బాగా పనిచేస్తుందని మనకి తెలుసు. దీని జ్యూస్ కూడా ఆరోగ్యానికి చాలా మందిచి. అయితే మొక్క రూపంలో కూడా ఇది మనకు మేలు చేస్తుంది. కలబంద మొక్కను చిన్న కుండీలో నాటి ఇంట్లో పెట్టుకుంటే మనం పీల్చే గాలిని శుద్ధి చేస్తుంది.

చైనీస్ ఎవర్‌గ్రీన్: ఈ మొక్కలు మనకు చాలా విరివిగా దొరుకుతాయి. అంతే సులువుగా పెరుగుతాయి కూడా. తక్కువ కాంతి ఉండే ప్రదేశాల్లో వీటిని ఉంచితే మంచిది. వీటిని మీ బాత్ రూంలో పెంచుకుంటే గాలిలో మలినాలను తొలగించి స్వచ్ఛంగా మారుస్తుంది. అలాగే ఇంటి ఆవరణలో కూడా దీన్ని పెంచుకోవచ్చు. ✶

జైల్లోనూ పోరాటమే...

● నిర్బంధాలను ఎదుర్కొని ముందుకెళ్తాం ● ప్రజల శ్రేయస్సే మాకు ప్రధానం
● నవతెలంగాణతో పలువురు సీపీఐ(ఎం) సీనియర్ నేతలు

లాఠీలు, తూటాలు, జైలు జీవితం, కేసులు నమోదు చేయడం వంటివి ఉద్యమాన్ని ఆపలేవని సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభల్లో పలువురు నాయకులు చెప్పారు. ప్రభుత్వ ఆంక్షలు, నిర్బంధాలు తమకు కొత్త కాదని, అయినా సమస్యల పరిష్కారం కోసం ముందుకెళ్తామని అన్నారు. మౌలిక వసతులు కల్పించాలని, నాణ్యమైన ఆహారం అందించాలని కోరుతూ జైల్లోనూ పోరాటమే చేశామని ఉద్ఘాటించారు. ప్రజల శ్రేయస్సే తమకు ప్రధానమని అన్నారు. నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలకు వచ్చిన వారిని బుధవారం నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్ పలుకరించారు. వారి మాటల్లోనే...

ఖైదీలను చైతన్య పరిచా



అటవీ శాఖ అధికారిపై దాడి కేసులో జైలుకెళ్లాను. 90 రోజులు జైల్లోనే ఉన్నాను. రోజు బ్యారక్‌లో ఉండే ఖైదీలకు రాజకీయ అంశాలపై శిక్షణ ఇచ్చే వాడిని. వారిలో చైతన్యం నింపేందుకు కృషి చేశా. నేను జైలు నుంచి బయటికి వచ్చేటపుడు 200 మంది ఖైదీలు సాగనంపడానికి మెయిన్ గేటు వరకు వచ్చారు. ప్రభుత్వం ఎంత నిర్బంధం విధించినా భయపడేది లేదు. ఇప్పుడు భూనిర్వాసితుల పోరాటం చేస్తున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టు కింద 20,21 ప్యాకేజీ కింద మంచిప్ప, కొండెం రిజర్వాయర్ పరిధిలో 3 గ్రామాలు, 8 తండాలు మునిగిపోతాయి. భూంపల్లి రిజర్వాయర్ కింద 22 ప్యాకేజీ ప్రకారం నేరల్ తండా ముంపునకు గురవుతుంది. అభివృద్ధి పేరుతో విధ్వంసం సృష్టించొద్దని పోరాటం చేస్తున్నాం. ప్రభుత్వ దమనకాండకు గురవుతున్న ప్రజలను సమీకరించి పోరాడతాం. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పనిచేస్తాం. ఆర్థిక పోరాటాలతోపాటు, సామాజిక అంశాలపైనా పోరాటం చేస్తాం.

- పెద్ది వెంకట్రాములు (నిజామాబాద్)

ప్రాణం ఉన్నంత వరకూ ప్రజాజీవితంలోనే



ప్రాణం ఉన్నంత వరకూ ప్రజాజీవితంలోనే కొనసాగుతా. నేను 1988 నుంచి 2002 వరకు కమాండర్‌గా అజ్ఞాతంలో ఉన్నా. 11 హత్య, 130 ఇతర కేసుల్లో ఉన్నా. మొత్తం 7 ఏండ్ల 7 రోజుల జైలు జీవితం గడిపాను. ఉమ్మడి ఆదిఆబాద్ ఎస్పీ కౌముది పిలిచి రూ.20 లక్షలు ఇప్పిస్తా, జనజీవనంలోకి రావాలన్నారు. డబ్బుల కోసం అజ్ఞాతంలోకి వెళ్లలేదని, అట్టడుగువర్గాల కోసం పనిచేయడం కోసమే ఎర్రజెండా పార్టీలో ఉంటానని చెప్పా. నక్సలైట్ పార్టీలో అభివృద్ధి కనిపించలేదు. పురోగమనం లేకుండా తిరోగమనం అనిపించింది. 2002లో సీపీఐ(ఎం)లో చేరాను. బెంగాల్, త్రిపుర, కేరళ రాష్ట్రాలను చూసి మరింత ఆకర్షణకు లోనయ్యా. ప్రజలకు మేలు కలిగేది సీపీఐ(ఎం)తోనే అని నిర్ణయించుకున్నా.

- రాజన్న (మంచిర్యాల)

చిన్నతనంలోనే అజ్ఞాతంలోకి వెళ్లా



నాకు 13,14 ఏండ్ల ప్రాయంలోనే అజ్ఞాతంలోకి వెళ్లాను. పురోహితునిగా పనిచేయడం, అగ్రకులం అయినందున ఎవరూ నన్ను అనుమానించేవారు. కొరియర్‌గా పనిచేశాను. అజ్ఞాతంలో ఉండే నాయకులు, చుట్టుప్రక్కల గ్రామాల్లోని నాయకులకు మధ్య ఉత్తరాలు అందించే వాడిని. మా గడ్డివాములోనే ఆయుధాలుండేవి. 1948 ఏప్రిల్‌లో నిజాం గుర్రాల సైన్యం దాడి మా గ్రామంలో కిష్టయ్య, జనార్ధన్‌రెడ్డిని కాల్చిచంపాయి. ఆ ప్రభావం నాపై చూపింది. మా ఇంటిమీద దాడి చేయడంతో మేం పిట్టంపల్లికి మకాం మార్చాం. అప్పుడే పార్టీతో క్రియాశీలంగా సంబంధాలు ఏర్పడ్డాయి. పేదలకు న్యాయం జరగాలంటే ఎర్రజెండాతోనే సాధ్యమనే భావం ఏర్పడింది. ధనవంతులు, దోపిడీదారులపై ద్వేషం ఏర్పడింది. నర్రా రాఘవరెడ్డి, మల్లు వెంకట నర్సింహ్మారెడ్డితో సహచర్యం మరువలేనిది. పార్టీ ఇప్పుడు తీసుకున్న సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి అన్న కార్యక్రమం మంచిది. దళితులు, పేదలపై కేంద్రీకరించి పనిచేయడం సరైన విధానమే. కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, టీఆర్ఎస్‌లకు బలమైన శక్తిగా బీఎల్ఎఫ్ ఎదుగుతుంది. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలనూ ఓడించాలి.

- అనంతరామశర్మ (నల్లగొండ)

జైలుకెళ్లినా పోరాటం ఆగదు



జైలు జీవితం మాకు కొత్తకాదు. జైలుకెళ్లినా పోరాటం కొనసాగిస్తాం. చర్లపల్లి జైల్లోనూ మంచి తిండి పెట్టాలని, మౌలిక వసతులు కల్పించాలని పోరాటం చేశాను. రెండు రోజులు నిరాహారదీక్ష చేశాను. భూపోరాటంలో భాగంగా పోడుభూముల విషయంలో ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలోని విక్రంనగర్, కంగిడి, జంపాలనగర్‌లో ఉద్యమించాం. ఆ భూములపై అటవీ అధికారులు దాడి చేసి పంటపొలాలను ధ్వంసం చేశారు. నాయకత్వం వహిస్తున్న నాపై విష ప్రయోగం చేశారు. విషం కలిపిన విత్తనాలను నా నోట్లో వేశారు. మూడు రోజులు ఆస్పత్రిలో చికిత్స పొందాను. నా చేయి విరగ్గొట్టారు. నాపై అక్రమ కేసులు బనాయించారు. అయినా పోరాటం ఆపకపోవడంతో పీడీ యాక్ట్ పెట్టారు. 2010 నుంచి 11 వరకు చర్లపల్లి జైల్లో 180 రోజులు గడిపాను. హైకోర్టులో కేసు వేయడంతో కొట్టివేసింది. ప్రభుత్వం సుప్రీం కోర్టులో అప్పీల్‌కు వెళ్లింది. గిరిజనుల హక్కుల కోసమే పోరాటం చేశాడని, అటవీ అధికారులదే తప్పు అని సుప్రీం కోర్టు చెప్పింది. ఇప్పుడు ఆ పోడు భూములను గుంజుకోవాలని కేసీఆర్ చూస్తున్నారు. పట్టాలు వచ్చే వరకు పోరాడతాం.

- భూక్యా వీరభద్రం (ఖమ్మం)

జైల్లోనే రాటుదేలా



నేను పీపుల్స్‌వార్ పాటలకు ఆకర్షితురాలినయ్యా. అందుకే పదో తరగతిలోనే అజ్ఞాతంలోకి వెళ్లాను. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఓ పనిమీద వచ్చాను. పోలీసులు నిఘా పెట్టి నన్ను అరెస్టు చేశారు. ఇక నన్ను చంపేస్తారని అనుకున్నా. వసంత అలియాస్ నూర్జహాన్ అని ఓ పోలీసు అధికారికి తెలియడంతో ఎన్‌కౌంటర్ చేయలేదు. తినడానికి తిండి లేదు, ఒకటే జత బట్టలున్నాయి. తీవ్ర మానసిక క్షోభ అనుభవించాను. ఆ కేసులో నన్ను వరంగల్ సెంట్రల్ జైలుకు తీసుకెళ్లారు. ప్రజల కోసం పనిచేస్తే ఇన్ని నిర్బంధాలా?అని ఆలోచించేదాన్ని. తోటి ఖైదీలను చూసేందుకు వారి కుటుంబ సభ్యులు వస్తే నా కోసం ఎవరైనా వస్తారేమోనని రోజూ ఎదురుచూసేదాన్ని. ఓ చెట్టు కింద కూర్చొని ఏడ్చేదాన్ని. నేను జైలుకు మా బాబుకు 8 నెలలు. ఇద్దరమే జైలులో గడిపాం. ఎవరూ రారని తెలిసి ధైర్యం తెచ్చుకున్నా. అప్పుడే రాటుదేలాను. ప్రజా ఉద్యమం పట్ల అనేక విషయాలు తెలుసుకున్నాను. ఎర్రజెండా అంటే నాకు ప్రాణం, అభిమానం. అందుకే సీపీఐ(ఎం)లో చేరాను.

- నూర్జహాన్ (నిజామాబాద్)

జైలుకెళ్లినా భయపడలేదు



భద్రాచలం సబ్‌జైలులో 27 రోజులు గడిపాను. అయినా భయపడలేదు. పోడు భూముల పోరాటంలో నేను జైలుకెళ్లాను. గిరిజనులకు పోడు భూములు దక్కే వరకు పోరాటం కొనసాగిస్తాను. ప్రభుత్వం మీద తిరగబడతాం. మమ్మల్ని నమ్ముకొని ఉన్న ప్రజల ఆశలను వమ్ము చేయను. పేదలకు ఇండ్ల స్థలాలు వచ్చే వరకూ, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించే వరకూ పోరాడతాం.

- తానం రవీందర్, భద్రాద్రి కొత్తగూడెం

బీఎల్ఎఫ్‌కు భవిష్యత్తు ఉంది

హైదరాబాద్ సీపీఐ(ఎం) మాజీ నగర కార్యదర్శి పీఎస్ఎన్ మూర్తి



కామ్రేడ్ నర్రా రాఘవరెడ్డి నగర్ (నల్లగొండ) నుంచి బి.బసవపున్నయ్య


రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా ఏర్పాటైన బహుజన లెఫ్ట్‌ఫ్రంట్‌కు భవిష్యత్తు ఉందని సీపీఐ(ఎం) హైదరాబాద్ నగర మాజీ కార్యదర్శి పీఎస్ఎన్ మూర్తి అభిప్రాయపడ్డారు. మూడు రకాల పాలకవర్గాలను రాష్ట్రం చవిచూసిందన్నారు. అయినా ప్రజలకు మేలైన ప్రజాపరిపాలన అందలేదని చెప్పారు. నల్లగొండలో సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభల సందర్భంగా 'నవతెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రస్తుత కేంద్ర,రాష్ట్ర రాజకీయాలు, కేసీఆర్ పరిపాలన గురించి ఆయన మాటల్లోనే...

రాష్ట్రంలో ప్రభుత్వాలు, పార్టీలు మారాయి. కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్ ప్రభుత్వాలు పరిపాలించాయి. పార్టీలు మారినా పరిపాలన మారలేదు. విధానాలు ఒక్కటే. దీంతో ప్రజలకు, బడుగుబలహీన వర్గాలకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరలేదు. మెజారిటీ ప్రజలు నష్టపోయారు. అన్నిరకాలుగా ఇబ్బందుల్లో ఉన్నారు. ఈనేపథ్యంలో సీపీఐ(ఎం)తోపాటు మరో 27 పార్టీలుగా వేదికగా బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ ఏర్పడింది. ప్రస్తుత రాజకీయాల్లో బీఎల్ఎఫ్ ఆవిర్భావం అనివార్యమైంది. చారిత్రాత్మకం కూడా. ఇది కచ్చితంగా 2019 ఎన్నికలను ప్రభావితం చేస్తుంది. బలం చూపిస్తుంది. ఎదురుదెబ్బలు పడ్డా, నిలబడుతుంది. కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు సోషల్‌మీడియాను, మీడియాను ఉపయోగించుకుని గతంలో అధికారంలోకి వచ్చింది. గత రెండున్నరేండ్లుగా అది కొనసాగించింది. ఇప్పుడు పూర్తివ్యతిరేకతను మూటకట్టుకుంది. సంఘ్‌పరివార్ శక్తులు కేంద్రాన్ని నడుపుతున్నాయి. దేశంలో శాంతిభద్రతలు, మతవిద్వేషాలను సైతం రెచ్చగొడుతున్నాయి. ప్రధాని మోడీ సినిమా నటుడిని తలపిస్తున్నారు. ఆయన ఛరిస్మా గాలికి కొట్టుకుపోయింది. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం కబుర్ల సర్కారుగా మారింది. కుటుంబ పాలన సాగిస్తున్నది. ప్రజలు గమనిస్తున్నారు. 2019 ఎన్నికల్లో బుద్ధి చెబుతారు.

ఎర్రజెండే ప్రత్యామ్నాయం

పార్టీపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసం

నవతెలంగాణతో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు హైమావతి



గట్టి ప్రత్యామ్నాయం కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బి హైమావతి చెప్పారు. ఎర్రజెండే ప్రత్యామ్నాయమని అన్నారు. సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి కోసం పోరాడుతున్న సీపీఐ(ఎం) పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతున్నది. నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలకు వచ్చిన ఆమెను బుధవారం నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్ పలుకరించారు. పలు అంశాలపై ఆమె మాట్లాడుతూ 1986లో పార్టీ సభ్యురాలిగా అయ్యాను. భద్రాచలం డివిజన్ చింతూరులో పోలీసు నిర్బంధం, మావోయిస్టులు, కాంగ్రెస్ దమనకాండ కొనసాగిన కాలం అది. 1985లో మావోయిస్టుల దాడిలో నా భర్త బీష్మారావు చనిపోయారు. అయినా నేను వెనక్కి తగ్గలేదు. 1986లో పార్టీ పూర్తికాలం కార్యకర్తగా వచ్చాను. అప్పటి నుంచి ఎన్నో హోదాల్లో పార్టీ, మహిళా సంఘం అభివృద్ధికి కృషి చేశాను. వ్యవసాయ కూలి పోరాటాలు చేపట్టాం. నాడు 4 రూపాయల 25 పైసల నుంచి నేడు రూ.400 వరకు కూలి పెరిగింది. నూతన ఆర్థిక విధానాల ఫలితంగా ప్రజలపై విపరీతంగా ప్రభావం పడింది. బూర్జువా పార్టీలతో కలిసి ఎన్నికల్లో పోటీ చేయడం వల్ల కొంత ఇబ్బంది కలిగింది. పాలక పార్టీలు చెప్పే వాగ్దానాలు, హామీల పట్ల ప్రజల్లో అనేక భ్రమలున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఒరిగేదేం లేదని ప్రజలంతా ఓ అభిప్రాయానికి వచ్చారు. పాలకులు చిత్తశుద్ధితో పనిచేయడం ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడం లేదని భావిస్తున్నారు. కుటుంబాన్ని పోషించుకునేందుకు ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి. మద్యం నిషేధించాలి. ఇవన్నీ చేయాలంటే గట్టి ప్రత్యామ్నాయం కావాలి. అది బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) రూపంలో ఆవిర్భవించింది. బీఎల్ఎఫ్ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతున్నది. గతంలో చెప్పినట్టుగా కాకుండా 119 నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని ప్రకటించడమూ ఓ ముందడుగు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరగాలన్నా, మద్యంపై నిషేధించాలన్నా బీఎల్ఎఫ్‌ను బలపరచాలి.

బహుజన తెలంగాణ కోసం బహుముఖ పోరాటాలు



మాట్లాడుతున్న జూలకంటి

బలమైన రాజకీయ శక్తిగా బీఎల్ఎఫ్

● విజయవంతమైన సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభ: విలేకర్ల సమావేశంలో జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ ప్రతినిధి

బహుజన లెఫ్ట్ ఫ్రంట్ తెలంగాణలో బలమైన రాజకీయ శక్తిగా ముందుకుపోయేందుకు బహుముఖ పోరాటాలు నిర్వహిస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సామాజిక, ఆర్థిక పోరాటాల్ని బలోపేతం చేసేందుకు అవసరమైన కర్తవ్యాలను మహాసభలో నిర్దేశించుకున్నట్టు తెలిపారు. గురువారం నల్లగొండ జిల్లా దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభను నాలుగు రోజుల పాటు నల్లగొండలో విజయవంతంగా నిర్వహించామన్నారు. దేశ, రాష్ట్ర రాజకీయాలతో పాటు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించామన్నారు. రాష్ట్ర మహాసభ ఉమ్మడి నల్లగొండ జిల్లా కమ్యూనిస్టు శ్రేణుల్లో సమరోత్సాహాన్ని నింపిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే సామాజిక తెలంగాణ, నీళ్లు, నిధులు, నియామకాలు వస్తాయనే ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదన్నారు. రైతులకు మద్దతు ధర, రుణమాఫీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. రైతు ఆత్మహత్యల్లో మన రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, కార్మికులు, విద్యార్థులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు, మైనార్టీలు, బీసీలు, ఎంబీసీలు, గిరిజనులు, ఆదివాసీల సమస్యల్ని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

వీళ్లందర్నీ ఏకం చేసి బహుజన తెలంగాణ సాధించేందుకు బహుముఖ పోరాటాల్ని నిర్మించాలని మహాసభలో కర్తవ్యాల్ని ఎంచుకున్నామన్నారు. ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై 50 తీర్మానాలు ఆమోదించినట్టు తెలిపారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర మహాసభల విజయవంతానికి సహకరించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కమ్యూనిస్టుల పట్ల అభిమానం, విశ్వాసం ఉన్న వాళ్లందరూ మహాసభ నిర్వహణ కోసం సహాయసహకారాలు అందించారన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయం

అమెరికా నేతలతో భేటీ కావడం లేదు

● ఉత్తరకొరియా స్పష్టీకరణ

సియోల్: దక్షిణ కొరియా నిర్వహిస్తున్న శీతాకాలం ఒలింపిక్ క్రీడల నేపథ్యంలో తమ ప్రతినిధులెవరూ అమెరికా నేతలతో భేటీ కావడంలేదని ఉత్తరకొరియా స్పష్టం చేసింది. శుక్రవారం ప్రారంభం కానున్న శీతాకాలం ఒలింపిక్ క్రీడల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ ఇప్పటికే క్రీడలు జరిగే ప్రాంతం పియాంగ్ చాంగ్ గ్రామానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉ.కొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్ సోదరి కిమ్ యాంగ్ నామ్‌తో సహా పలువురు ఉ.కొరియా సీనియర్ ప్రతినిధులు కూడా హాజరు కానున్నారు. తాము చర్చల కోసం అమెరికాను ఏనాడూ అభ్యర్థించలేదని, ఇదే వైఖరి భవిష్యత్‌లో కూడా కొనసాగుతుందని ఉ.కొరియా ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ అధికార వార్తాసంస్థ కేసీఎన్ఎ వెల్లడించింది. ఒలింపిక్ క్రీడలకు హాజరయ్యేందుకు ఉత్తరకొరియా నేతలపై ఆంక్షలు తొలగించాలని ద.కొరియా ఐరాసకు విజ్ఞప్తి చేసింది. ఐరాస నుండి ఆంక్షలను ఎదుర్కొంటున్న ఉ.కొరియా జాతీయ క్రీడల మార్గదర్శక కమిటీ ఛైర్మన్ చో హుయిని ఆంక్షల నుండి మినహాయించాలని ఐరాసకు తమ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్టు ద.కొరియా ఏకీకరణ మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఒలింపిక్స్‌లో ఉత్తరకొరియా 'సైనిక ప్రదర్శన'

తమ సైన్యం 70వ వార్షిక వేడుకలను నిర్వహించాలని ఉత్తరకొరియా భావిస్తోంది. దక్షిణ కొరియాలో ఒలింపిక్స్ ప్రారంభమైన రెండో రోజున ఈ కార్యక్రమం నిర్వహించాలని సన్నాహాలు చేసింది. సైనిక దళాలు ఏర్పాటైన రోజును పురస్కరించుకుని ప్యాంగాంగ్‌లో సైనిక కవాతు నిర్వహిస్తారు. గత ఏడాది ఏప్రిల్లో ఈ వేడుకలు జరిగాయి. 40 ఏండ్లుగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. 'ప్రపంచంలో ఏ దేశమైనా తమ సైన్యం ఆవిర్భవించిన రోజును పురస్కరించుకుని చాలా వైభవంగా వేడుకలు నిర్వహిస్తుంది. ఇదో సంప్రదాయం. ఆనవాయితీ.. ' అని ఉత్తర కొరియా పేర్కొంది. 'శీతాకాల ఒలింపిక్స్ పై దృష్టి కేంద్రీకరించాలంటే సైనిక కవాతు చేయకుండా ఉండటమే మంచిది..' అని అమెరికా పేర్కొంది. 13000 దళాలు, 200 ఆయుధాలు, ఇతర సామగ్రిని ప్యాంగాంగ్‌లోని విమానాశ్రయంలో ఉంచినట్లు దక్షిణ కొరియా అధికారులు తెలిపారు.



అవినీతి కేసులో ఐదేండ్లు జైలు

దోషిగా తేలిన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖాలెదా జియా

ఢాకా: బంగ్లాదేశ్‌లో అల్లర్లు చెలరేగాయి. అవినీతికి పాల్పడ్డ కేసులో మాజీ ప్రధాని, నేషనలిస్ట్ పార్టీ నాయకురాలు బేగం ఖాలెదా జియాను ప్రత్యేక న్యాయస్థానం దోషిగా తేల్చి ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. విదేశాల నుంచి విరాళంగా జియా చారిటబుల్ ట్రస్ట్‌కు వచ్చిన నిధులను అక్రమ మార్గంలో వినియోగించుకున్నారన్న ఆరోపణలు రుజువు కావడంతో ఈ శిక్ష పడింది. బంగ్లాదేశ్ ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నాయకురాలు, రెండు సార్లు ప్రధానిగా పనిచేసిన ఖాలెదా జియా.. జియా చిన్నపిల్లల చారిటబుల్ ట్రస్ట్ కోసం వినియోగించాల్సిన 21 మిలియన్ల టాకాలను (రూ.కోటి అరవై రెండు లక్షలు) దుర్వినియోగం చేశారని ఆరోపణలు రుజువు కావడంతో న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. సమాజంలో ఆమె హోదాను, ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా సెక్షన్లు 409,109 కింద ఈ శిక్ష విధించామని న్యాయమూర్తి మహ్మద్ అక్తేరుజ్మాన్ వెల్లడించారు. ఇదే కేసులో దోషులుగా తేలిన జియా కుమారుడు తారిఖ్ రెహమాన్, మరో నలుగురికి 10 సంవత్సరాల జైలు శిక్ష పడింది. తీర్పు సమయంలో న్యాయస్థానం వద్ద పోలీసులకు, జియా మద్దతు దారులకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఐదుగురు పోలీసులు గాయపడ్డారు. బంగ్లాదేశ్‌లో అల్లర్ల నేపథ్యంలో హై అలర్ట్ ప్రకటించారు. ముందస్తు జాగ్రత్తగా జియా మద్దతుదారులను అదుపులోకి తీసుకున్నట్టు పోలీస్ అధికారులు తెలిపారు.

సిరియా బలగాలపై అమెరికా సంకీర్ణదళాల దాడులు

● 100మంది మృతి

డమాస్కస్ : అమెరికా సంకీర్ణదళాలు సిరియా నగరంలో బీభత్సం సృష్టిస్తున్నాయి. సిరియా బలగాలపై గురువారం మెరుపుదాడికి పాల్పడ్డాయి. ఈ దాడుల్లో 100 మంది సైనికులు మృతి చెందారు. మరికొందరు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తూర్పు సిరియాలో జరిగిన దాడులకు ప్రతీకారంగా ఈ దాడులకు పాల్పడినట్టు అమెరికా సైన్యం ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఇటీవలి కాలంలో అత్యధిక మంది చనిపోయిన ఘటన ఇదే. దీర్-ఎజ్-జోర్ ప్రావిన్స్‌లో ప్రభుత్వ అనుకూల దళాలపై అమెరికా దాడులు చేపట్టింది. అమెరికా, సిరియాల మధ్య రసాయన ఆయుధాల వాడకం విషయంలో ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో ఈ దాడులు జరగడం గమనార్హం. సిరియా దళాలు, మిత్ర రాజ్యాల సైన్యం రసాయన ఆయుధాలు వాడుతున్నారని అమెరికా అనుమానిస్తోంది. ఇదిలా ఉండగా, అమెరికా దళాల దాడులపై రష్యా స్పందించింది. అమెరికా కూటమి చర్యలు చట్టాలకు అనుగుణంగా లేవని రష్యా పార్లమెంటు సభ్యుడు ఫ్రాంజ్ క్లింటెసెవిచ్ పేర్కొన్నారు. సిరియా సైన్యంపై అమెరికా సంకీర్ణదళాలు దురాక్రమణకు పాల్పడుతున్నాయని అన్నారు.

సిరియాలో అంతర్యుద్ధ నిర్మూలనే లక్ష్యం : రష్యా

మాస్కో : సిరియాలో శాంతిస్థాపనతో పాటు అంతర్యుద్ధ నిర్మూలనే తమ లక్ష్యమని రష్యా పేర్కొన్నది. సిరియన్ల సమస్యల పరిష్కారం కోసం ఇస్తాంబుల్ నగరంలో ప్రత్యేక భేటీ నిర్వహిస్తామని తెలిపింది. ఈ సదస్సుకు టర్కీ, ఇరాన్ దేశాధినేతలు కూడా హాజరవుతారని తెలిపింది. సిరియాలో 2011లో అంతర్యుద్ధం చెలరేగిన సంగతి తెలిసిందే. సిరియాలోని హక్కుల పర్యవేక్షణ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం...సిరియాలో అంతర్యుద్ధం చెలరేగినప్పటి నుంచి 4,81,612 మంది మృతి చెందారు. ప్రాణ భయంతో లక్షలాది మంది సిరియా నగరాన్ని వదిలిపెట్టి ఇతర దేశాలకు వలసవెళ్లారు. ఉగ్రసంస్థల అరాచకాలు పెరిగిపోయాయి. సిరియాలో శాంతి స్థాపన కోసం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఎంతో కృషి చేస్తున్నారు. సిరియా అధ్యక్షుడు అస్సద్‌కు బాసటగా నిలిచారు. రష్యా ఆర్మీ ఉగ్రసంస్థల నిర్మూలన కోసం సిరియా బలగాలతో కలిసి యాంటీ టెర్రర్ ఆపరేషన్ నిర్వహిస్తోంది.



ఏకాకిలా చనిపోయిన నైజిల్


వెల్లింగ్‌టన్, న్యూజిలాండ్ : న్యూజిలాండ్ ద్వీపానికి సమీపంలోని మానా ఐలాండ్‌లో అటవీ జంతువులను ఆకర్షించేందుకు పర్యావరణవేత్తలు సముద్ర తీరం వెంబడి కాంక్రీటుతో గనెట్ పక్షులను తయారు చేసి పెట్టారు. తన జాతి పక్షుల బొమ్మలకు ఆకర్షణ చెందిన నైజిల్ అనే పక్షి వాటితో పాటు జీవించడం ప్రారంభించింది. కాంక్రీటు బొమ్మలతో స్నేహం చేయాలని ప్రయత్నించింది. అక్కడే నివసించేందుకు గూడును కూడా ఏర్పాటు చేసుకుంది. జంతు సంపద లేని ద్వీపంలో ఒంటరినని గుర్తెరుగక కాంక్రీటు పక్షులతో జీవనం సాగించింది నైజిల్. కాంక్రీటు పక్షులతో జీవనం సాగిస్తున్న నైజిల్ న్యూజిలాండ్‌లో ఫేమస్ అయిపోయింది. క్రమంగా వారు దాని 'లోన్లీ బర్డ్' అని పిలుచుకోవడం ప్రారంభించారు. ఏమైందో ఏమో కానీ గతనెల మృతి చెందింది. నైజిల్ గురించి మాట్లాడిన పర్యావరణవేత్త బెల్.. దాని ప్రవర్తన ఆ జాతిలోని ఇతర పక్షులకు భిన్నంగా ఉండేదని చెప్పారు. మానా ద్వీపాన్ని తన ఇల్లుగా నైజిల్ భావించుకుందని అన్నారు. అందుకే అవకాశమున్నా ఎగిరి వెళ్లిపోలేదని అన్నారు. నైజిల్ మృతితో తీవ్ర మనస్తాపానికి గురయ్యానని అన్నారు. అది వయసు మళ్లీ మరణించిందా? లేక ఒంటరితనమే దాని మరణానికి కారణమా? అనే విషయం తెలియాల్సి ఉందన్నారు.

రక్షణ వ్యయాన్ని పెంచుకున్న ఫ్రాన్స్

పారిస్ : రక్షణ వ్యయాన్ని పెంచుకున్నట్టు ఫ్రాన్స్ అధికారికంగా ప్రకటించింది. ప్రతీ ఏడాది 1.7 బిలియన్ యూరోస్ (రూ.13,387 కోట్లు) చొప్పున 2022 వరకు రక్షణ వ్యయాన్ని పెంచాలనే ప్రతిపాదనకు అధ్యక్షుడు ఎమాన్యుయేల్ మేక్రాన్ అంగీకరించినట్టు తెలిపింది. జీడీపీలో రెండు శాతం రక్షణ రంగానికి కేటాయించాలనే లక్ష్యాన్ని 2023 నుంచి అమలు చేయనున్నట్టు అధ్యక్ష కార్యాలయం పేర్కొన్నది.

ఆ ఫీజు డబ్బు ఇవ్వాల్సిందే..

- జీవో 59 దరఖాస్తుపై కోర్టు
- జీవో 211లో స్పష్టత లేదంటున్న ట్రెజరీ అధికారులు
- కోర్టుకెక్కిన జీవో 59 బాధితుడు
- మూడునెలల్లో ఇవ్వాలి.. లేకుంటే ఆరుశాతం వడ్డీతో చెల్లించాలన్న కోర్టు
- సర్కార్ వద్దకు పంచాయితీ



నవతెలంగాణ - హైదరాబాద్ సిటీబ్యూరో

ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరించే జీవోలు అభాసు పాలవుతున్నాయి. నిరుపేదలకు (బీపీఎల్) 125 గజాలలోపు స్థలాలను ఉచిత క్రమబద్ధీకరణతో పట్టాలు మంజూరు చేసేందుకు జీవో 58, బీపీఎల్ పరిధి రాని (125 గజాలకుపైగా) స్థలాలను క్రమబద్ధీకరించేందుకు తగిన సొమ్ము చెల్లించే విధంగా జీవో 59ని ప్రభుత్వం జారీచేసింది. హైదరాబాద్ జిల్లాలో చాలామంది నిరుపేదలకు జీవో 58 ద్వారా పట్టాలు మంజూరు చేయాల్సిన అధికారులు, ప్రభుత్వానికి మరింత ఆదాయాన్ని రాబట్టేందుకు జీవో 58 దరఖాస్తుదారులను 59 జీవోకు బలవంతంగా బదలాయించినట్టు విమర్శలున్నాయి. జీవో 59లో తిరస్కరణకు గురైన ఓ దరఖాస్తుదారుడు తాను చెల్లించిన సొమ్మును తిరిగి ఇప్పించాలంటూ కోర్టును ఆశ్రయించాడు. అయితే దరఖాస్తు తిరస్కరణకు గురైనా డబ్బులు తిరిగి ఇచ్చేందుకు జీవో 211 ఉన్నా.. అందులో స్పష్టత లేదని, అందుకే ఇవ్వలేమని ట్రెజరీ అధికారులు చెబుతున్నట్టు సమాచారం.

మూడునెలల్లో చెల్లించకుంటే..

షేక్‌పేట మండలంలోని సయ్యద్ నూర్ ఉల్ జీవో 59 ద్వారా తన 150 చదరపు గజాల స్థలాన్ని క్రమబద్ధీకరణ చేయాలని దరఖాస్తు పెట్టుకున్నారు. నిబంధనల మేరకు సుమారు రూ.5.62 లక్షలు చెల్లించాడు. సరైన డాక్యుమెంట్లను చూపలేదనే కారణంతో అధికారులు దరఖాస్తును తిరస్కరించారు. దీంతో తాను చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని సయ్యద్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. అయినా ఫలితం లేకపోవడంతో కోర్టును ఆశ్రయించాడు. సయ్యద్ నూర్‌ఉల్ డబ్బును మూడునెలల్లో తిరిగి ఇవ్వాలని, లేదంటే మూడు నెలల అనంతరం ఆరుశాతం వడ్డీతో చెల్లించాలని కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఉత్తర్వులు అందుకున్న సయ్యద్‌కు మూడునెలలు గడిచినా రెవెన్యూ అధికారులు సొమ్ము చెల్లించలేదు.

జీవో 211లో స్పష్టత కరువు

క్రమబద్ధీకరణకు డబ్బు చెల్లించి, తిరస్కరణకు గురైన దరఖాస్తుదారుల సొమ్మును తిరిగి ఇచ్చేందుకు ప్రభుత్వం 211 జీవోను ప్రత్యేకంగా తీసుకొచ్చింది. తిరస్కరణకు గురైన దరఖాస్తుదారుల డబ్బు చెల్లించాలని జీవోలో ఉన్నా... ఏ పద్ధతిలో చెల్లించాలనేది స్పష్టత లేకపోవడంతో ట్రెజరీలో ఆగిపోయినట్టు తెలిసింది. దీంతో తహసీల్దార్లు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు మొరపెట్టుకోవడంతో దీనిపై స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టర్ లేఖ రాసినట్టు తెలిసింది. జీవో 211లో సొమ్ము చెల్లించే విధానంపై ప్రభుత్వమే తగిన మార్గదర్శకాలు ఇవ్వాల్సి ఉన్నందున, అధికారులు ప్రభుత్వ నిర్ణయం కోసమే ఎదురు చూస్తున్నారు.

చెల్లించాల్సిన సొమ్ము రూ.21.58 కోట్లు...

హైదరాబాద్ జిల్లాలో క్రమబద్ధీకరణ జీవో 59 ప్రకారం హైదరాబాద్ డివిజన్‌లో 1299, సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్‌లో 4873 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం దరఖాస్తులు 6172లో 809 దరఖాస్తులను తిరస్కరించారు. జీవో 59 దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.231 కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా, ఇప్పటికి రూ.130.90 కోట్లు వచ్చాయి. మరో రూ.100 కోట్లు దరఖాస్తుదారుల నుంచి రావాల్సి ఉంది. మరోవైపు, తిరస్కరణకు గురైన 809 మంది దరఖాస్తుదారులకు సుమారు రూ.21.58 కోట్లు తిరిగి చెల్లించాల్సి ఉంది. వీటికోసం దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా... ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో బాధితులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు.

సచివాలయం తరలింపును అడ్డుకోవాలి

రౌండ్‌టేబుల్‌లో కోదండరామ్

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

సచివాలయం తరలింపును అడ్డుకోవాలని జెఎసి చైర్మన్ కోదండరామ్ పిలుపునిచ్చారు. ఇక్కడి నుంచి సచివాలయాన్ని తరలించి ఆ భూమిని కార్పొరేట్ శక్తులకు అప్పగించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. 'ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం చేస్తున్న ప్రభుత్వ వైఖరి- సచివాలయం తరలింపు' అంశంపై హైదరాబాద్ జేఏసీ గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం, విద్య, ఉద్యోగం, వైద్యం, ఇళ్లు వంటి ప్రధాన అంశాలకు ఈ ప్రభుత్వం సరైన విధంగా నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. సచివాలయాన్ని తరలించి హుస్సేన్‌సాగర్ చుట్టూరా ఉన్న స్థలాన్ని బహుళజాతి సంస్థలకు ఇవ్వాలని ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. ప్రజల అవసరాల కోసం ఈ భూములను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సచివాలయం అంశంపై సంతకాల సేకరణ చేసి ఢిల్లీకి పంపిస్తామని, హోంమంత్రిని కలిసి వినతిపత్రం ఇస్తామని ఆయన తెలిపారు. ఎఐసిసి కార్యదర్శి వి హనుమంతరావు మాట్లాడుతూ వాస్తు పేరుతో ముఖ్యమంత్రి కేసీఆర్ మార్పులు చేస్తున్నారని తెలిపారు. రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీడీపీ, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, ప్రజా తెలంగాణ, ఆర్‌ఎస్పీ, బీజేపీ నాయకులు కె గోవర్ధన్, ఝాన్సీ, హన్మేష్, వనం రమేశ్, గాదె ఇన్నయ్య, జానకిరాములు, రామకృష్ణారెడ్డి, మాట్లాడారు.

గాడిలో పడిన వైద్యం : మంత్రి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆస్పత్రుల్లో సదుపాయాలు కల్పించడంతో రాష్ట్రంలో వైద్యఆరోగ్యం గాడిలో పడిందని ఆ శాఖ మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగులు బాగా పనిచేస్తున్నందువల్లే ఈ ఘనత సాధించామని చెప్పుకొచ్చారు. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ,క్యాలండర్‌ను మంత్రి హైదరాబాద్‌లో ఆవిష్కరించారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అత్యవసర సర్వీసుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వైద్యఆరోగ్యశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జూపల్లి రాజేందర్ అన్నారు. 108 ఉద్యోగుల కేంద్ర సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సమావేశం జరిగింది.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి అధికారులను ఆదేశించారు.

పలువురు ఎస్పీలకు సీనియర్‌గ్రేడ్ ర్యాంక్

ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో పలువురు ఎస్పీ స్థాయి ఐపీఎస్ అధికారులకు సీనియర్ గ్రేడ్ ర్యాంకును ఇస్తు ప్రభుత్వం ఉత్తర్వులుజారీ చేసింది. ఈ ర్యాంక్‌ను పొందిన వారిలో 2005 నుంచి 2007 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారులు ఉన్నారు. వీరిలో కరీంనగర్ ఎస్పీ కమలాసన్‌రెడ్డి, సంగారెడ్డి ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, నగర ఉత్తర మండలం డీసీపీ సుమతి, దక్షిణ మండలం డీసీపీ సత్యనారాయణ, పశ్చిమ మండలం డీసీపీ వెంకటేశ్వరరావు, మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్, నగర ట్రాఫిక్ డీసీపీ రంగనాథ్, సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, రాచకొండ ట్రాఫిక్ డీసీపీ రమేష్‌నాయుడు, రాష్ట్ర శాంతి భద్రతల విభాగం ఏఐజీ రమేష్‌లు ఉన్నారు. వీరికి సీనియర్ గ్రేడ్ ర్యాంక్ రావడంతో త్వరలోనే డీఐజీలుగా పదోన్నతులు కూడా పొందనున్నారని అధికార వర్గాలు తెలిపాయి.

రుణమాఫీ డబ్బులు వడ్డీకి జమ

- స్పీకర్‌కు టీడీపీ ఫిర్యాదు
- అసెంబ్లీలో సీఎం ప్రకటన అబద్ధమని వ్యాఖ్య



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ సొమ్మును వడ్డీకి జమ చేస్తున్నారని అసెంబ్లీ స్పీకర్ ఎన్.మధుసూదనాచారికి టీడీపీ ఫిర్యాదు చేసింది. అసెంబ్లీలో సీఎం చేసిన ప్రకటన అబద్ధమని అభిప్రాయపడింది. నాలుగు విడతలుగా ఒక్కొక్క రైతుకు రూ. లక్ష చొప్పున మాఫీ చేసినట్టుగా సభలో చెప్పడం సరికాదన్నారు. గురువారం అసెంబ్లీలో స్పీకర్‌ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణ, పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అమర్‌నాథ్‌బాబు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రుణమాఫీ పథకం నీరుగారిపోయిందని విమర్శించారు. ప్రభుత్వం చెప్పినట్టుగా కిందిస్థాయిలో జరగడం లేదన్నారు. ఖమ్మం జిల్లాలో కొందరు రైతులకు సంబంధించిన రుణ వివరాలను మీ దృష్టికి తీసుకువస్తున్నట్టు తెలియజేశారు. తమ ఫిర్యాదుకు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం టీడీపీ నేతలు విలేకర్లతో మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి స్పీకర్ హామీ ఇచ్చారని చెప్పారు.

సమాంతరంగా అర్బన్ భగీరథ పనులు

- వైస్‌చైర్మెన్ ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ రింగ్ రోడ్ అవతల జరగనున్న గ్రామీణ మిషన్ భగీరథ పనులకు సమాంతరంగా ఔటర్ రింగురోడ్డు లోపల చేపట్టిన అర్బన్ మిషన్ భగీరథ పనులు చేయాలని భగీరథ ప్రాజెక్టు వైస్ చైర్మెన్ వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని ఏ ఒక్క గ్రామంలోనూ ఈ వేసవికి తాగునీటి కొరత తలెత్తకూడదన్నారు. అనుగుణంగా సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో ప్రశాంత్ రెడ్డి సమావేశమయ్యారు. లోపలి గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న నీటి సరఫరా వ్యవస్థల పనితీరు, జనాభా వివరాలను ఆయన తెలుసుకున్నారు. పనులు త్వరగా పూర్తి చేసేందుకు గ్రామీణ మిషన్ భగీరథలో అమలుచేస్తున్న విధానాలను అధికారులకు వివరించారు. ప్రాధాన్యతలకు అనుగుణంగా పనులు చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సులభంగా చేరడానికి అవకాశం ఉందన్నారు.అర్బన్ మిషన్ భగీరథ పనులకు ఎక్కడైనా పైపులు, మెటీరియల్ అవసరమైతే అందజేస్తామన్నారు. హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చేలా నీటి సరఫరా వ్యవస్థ ఉండాలని సూచించారు. ఇందుకోసం కృష్ణా గోదావరి నదులను అనుసంధానిస్తూ తాగునీటి గ్రిడ్‌ను ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఈ వేసవికి ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న గ్రామాలకు బల్క్‌గా నీటిని సరఫరా చేయాలని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ దానకిశోర్, ఈడీ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు నీటి సరఫరా : మంత్రి జూపల్లి

వచ్చే వేసవినాటికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు.నియోజకవర్గాల వారిగా మిషన్ భగీరథ పనుల పురోగతిపై సచివాలయంలో సీఈ కృపాకర్ రెడ్డి, ఎస్‌ఈ చెన్నారెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, వర్క్ ఏజెన్సీల ప్రతినిధులతో బుధవారం మంత్రి సమీక్ష నిర్వహించారు.

తెలంగాణ టూరిజం డైరెక్టర్‌గా డాక్టర్ కె లక్ష్మి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డాక్టర్ కె లక్ష్మి ఐఏఎస్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం హిమయత్‌నగర్‌లోని కార్యలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు ఫ్లాప్‌ల తర్వాత వస్తున్నా..


సాయి ధరమ్ తేజ్

'ఏ సినిమాకైనా కథ ముఖ్యం. కథ బాగా లేకపోతే వినాయక్‌తో చేసినంత మాత్రాన ప్రయోజనం లేదు' అని అంటున్నారు సాయిధరమ్ తేజ్. వి.వి.వినాయక్ దర్శకత్వంలో సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా నటించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ సినిమా నేడు (శుక్రవారం) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా గురువారం సాయిధరమ్ తేజ్‌తో మీడియా జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు..

వినాయక్‌తో పనిచేయడాన్ని ఎలా ఫీలవుతున్నారు?

– 'ఖైదీ నంబర్ 150' లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వి.వి.వినాయక్ నాతో సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నా. నాతో ఆయన సినిమా చేస్తారని నేనస్సలు ఊహించలేదు. ఆయనతో పనిచేయడం చాలా కంఫర్ట్‌గా అనిపిస్తుంది. ప్రతి విషయాన్ని ఎంతో ఓపికగా, కూల్‌గా చెబుతారు. వర్క్ ఎట్మాస్ఫియర్ ఎంతో బాగుంటుంది. అనుభవం ఉన్న దర్శకుడితో పనిచేయడంలో ఉన్న కంఫర్ట్స్ వేరేలా ఉంటాయి. ఆయన అనుభవం ఈ సినిమాకు ఎంతో ఉపయోగపడుతుంది.

కెరీర్ పరంగా ఈ సినిమా మీకు హెల్ప్ అవుతుందా?

– నాలుగు ఫ్లాప్‌ల తర్వాత చేస్తున్న చిత్రమిది. నా కెరీర్‌కు కచ్చితంగా బ్రేక్ ఇస్తుందనుకుంటున్నా. అయితే ప్రతి సినిమా కూడా బ్రేక్ ఇస్తుందనే చేస్తాం. అందుకోసం మన వంతుగా చేయాల్సిన హార్డ్ వర్క్ చేస్తాం. కానీ ఫలితం మాత్రం ప్రేక్షకుల చేతుల్లో ఉంది. దేనికైనా కథ ముఖ్యం. వినాయక్‌తో చేసినంత మాత్రాన కథ బాగా లేకపోతే ప్రయోజనం లేదు.

వరుస ఫ్లాప్‌లపై రివ్యూ చేసుకున్నారా?

– బ్యాక్ టు బ్యాక్ ఫ్లాప్‌లకు కారణం ఒక్కటే.. సరైన కథలు లేకపోవడం. కథతోపాటు ఆ కథను దర్శకులు డీల్ చేసే విధానం కూడా ప్రేక్షకులకు ఏమాత్రం కనెక్ట్ కాలేదు. పైగా మేం అనుకున్న స్క్రిప్ట్‌లు అనుకున్న విధంగా రాలేదు. 'జవాన్' చిత్రంపై చాలా ఆశలు పెట్టుకున్నాను. కథ కూడా నాకు బాగా నచ్చింది. కానీ ఫలితం తేడా కొట్టింది.

చిరంజీవి పాటల రీమిక్స్‌లో మీ పాత్ర ఉందా?

– నాదేం లేదండి. దర్శకుల డిమాండ్ మేరకే రీమిక్స్ చేస్తున్నాం. ఇంకా ఇలాంటివి ఎన్ని చేయాలనేది కూడా దర్శకుల చేతుల్లోనే ఉంది. ఇప్పటి వరకు చేసిన పాటలన్నీ నాకు ఇష్టమైనవే. అన్నింటికీ ఒకేలా కష్టపడ్డాను. 'చమకు చమకు' పాటలో నేను డాన్స్ చేస్తుంటే చిరంజీవి గుర్తొచ్చారని వినాయక్ చెప్పడం పెద్ద కాంప్లిమెంట్‌గా భావిస్తున్నాను. మరో రకంగా ఆ కాంప్లిమెంట్‌ను రిసీవ్ చేసుకోవడం కష్టంగా ఉంటుంది. ఎందుకంటే ఇండస్ట్రీలో చిరంజీవి ఒక్కరే ఉంటారు. ఆయనలా మేం కాలేం కదా.. (నవ్వుతూ)

ఒక్క రోజు గ్యాప్‌లో వస్తున్న వరుణతేజ్ సినిమాను పోటీగా ఫీలవుతున్నారా?

– పోటీ ఏం లేదండి. సినిమా బాగుంటే ఎన్ని సినిమాలైనా ప్రేక్షకులు చూస్తారు. వరుణ్‌తేజ్ నటించిన 'తొలిప్రేమ' విడుదల తేదీని చిత్ర బృందం తెలియకుండా ప్రకటించినట్టు చెప్పారు. దానికి మనమేమీ చేయలేం. కాకపోతే ఒకేరోజు ఇద్దరి మెగా హీరోల సినిమాలు వచ్చి బాక్సాఫీసు వద్ద విజయం సాధిస్తే చూడాలనిపించింది. కానీ అది మిస్ అయ్యింది. మా సినిమాల విడుదల గురించి వరుణ్, నేను మాట్లాడుకునేవాళ్ళం. సినిమాలు విడుదలయ్యాక ఇద్దరం కలిసి 'సక్సెస్‌మీట్‌లు పెడతాం' (నవ్వుతూ). మెగా హీరోలు పెరగడం వల్ల రిలీజ్ ఇబ్బందులు వస్తున్నాయంటున్నారు. అది నిజమే. మా మధ్యే మాకు పోటీ ఉంటుంది. మాకిది పరీక్ష లాంటిది. అయినప్పటికీ ఒకేసారి సినిమాల విడుదల లేకుండా ప్లాన్ చేసుకుంటాం.

మీరిక కమర్షియల్ సినిమాలకే పరిమితమా?

– కొత్తగా చేయాలని నాక్కూడా ఉంది. నా దగ్గరకు ఎక్కువగా కమర్షియల్ కథలే వస్తున్నాయి. ఈ విషయంలో రాజేంద్రప్రసాద్ ఓ మాట చెబుతుండేవారు. రాని వాటి గురించి ఆలోచించడం కన్నా వచ్చిన అవకాశాలను మన కెరీర్‌కు తగ్గట్టుగా ఎలా మలుచుకుంటామనేది ముఖ్యమని. నేను కూడా అదే ఫాలో అవుతున్నా. అందుకే నాకు నచ్చిన కథలే చేస్తున్నా. కొత్త కాన్సెప్ట్ వస్తే కచ్చితంగా చేస్తా. ప్రస్తుతం కరుణాకర్ దర్శకత్వంలో చేస్తున్న లవ్ స్టోరీ కొత్తగానే ఉంటుంది.

ఇంటిలిజెంట్ అనే టైటిల్ పెట్టడానికి రీజన్?


– హీరో తన తెలివి తేటలతో విలన్ ఆటలను కట్టడి చేయడమే సినిమా. మనం ఎదగడానికి కొంత మంది సహాయపడతారు. అలాంటి వాళ్ళు కష్టాల్లో ఉన్నప్పుడు మనం కూడా సహాయం చేయాలి. వాళ్ళకి అండగా నిలవాలి. హెల్ప్ చేసిన వాళ్ళని మరవద్దనే సందేశం సినిమాలో అంతర్లీనంగా ఉంటుంది. మైండ్‌గేమ్‌తో చాలా సినిమాలొచ్చాయ్. కానీ అవి పెద్దగా ఆదరణ పొందలేదు. ఇది కొత్తగా ఉంటుంది. కచ్చితంగా ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాం.

మీ క్యారెక్టరైజేషన్ ఎలా ఉంటుంది?


– ఇందులో నేనొక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ని. నా కంఫర్ట్ జోన్ నుంచి బయటపడేందుకు ప్రయత్నించను. కొన్ని సంఘటనల వల్ల ఆ జోన్‌లో నుంచి బయటకు రావాల్సి వస్తుంది. సమస్యల్లో ఉన్న నా ఫ్యామిలీ కోసం పోరాటడతాను. ఇది పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్. ఆడియెన్స్‌కు కావాల్సిన వినోదాన్ని కథతోపాటు నా పాత్ర కూడా పంచుతుంది. లావణ్యతో పనిచేయడం హ్యాపీగా ఉంది. మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఉన్న నటి. ఇక మా చిత్ర టీజర్‌ను విడుదల చేసిన బాలకృష్ణ, పాటను విడుదల చేసిన ప్రభాస్‌కు థ్యాంక్స్. బాలకృష్ణ మా మెగా హీరోలను గుర్తించి మాట్లాడటం అభినందనీయం. ఈ విషయాల్లో ఆయన్నుంచి మాతరం చాలా నేర్చుకోవాలి.

నవచిత్రం

అమర్ అక్బర్ ఆంటోని..!


రవితేజ

'**రా**జా ది గ్రేట్'తో ఆకట్టుకున్న రవితేజ ఇటీవల 'టచ్ చేసి చూడు'తో మెప్పించలేక పోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. అలాగే శ్రీనువైట్లతోనూ ఓ సినిమా చేయనున్నట్టు ఇటీవల ఆయనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ నెల 19న అమెరికాలో ఈ సినిమా ప్రారంభం కానున్నట్టు సమాచారం. అమెరికా నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో రవితేజ మూడు విభిన్న పాత్రల్లో కనిపిస్తారని తెలుస్తోంది. అందుకే సినిమాకు 'అమర్ అక్బర్ అంటోని' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. రవితేజ క్యారెక్టర్స్‌ని బట్టి ఈ చిత్రంలో ముగ్గురు హీరోయిన్లు నటించే అవకాశం ఉందని వేరే చెప్పక్కర్లేదు. కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ప్రస్తుతం వైజాగ్‌లో చిత్రీకరణ జరుపుకుంటోంది. దీనికి 'నేల టికెట్' అనే టైటిల్‌ను అనుకుంటున్నారట. దీంతోపాటు ఎన్టీఆర్, చరణ్ హీరోలుగా, రాజమౌళి దర్శకత్వంలో రూపొందే మల్టీస్టారర్ చిత్రంలో రవితేజ విలన్‌గా నటించే అవకాశం ఉన్నట్టు సోషల్ మీడియా కోడై కూస్తోంది.


రజనీకాంత్

అభిమానులకు కానుక..

రజనీకాంత్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నటించిన 'రోబో 2.0' చిత్ర విడుదల పలు మార్లు వాయిదా పడుతుండటంతో ఆయన అభిమానులే కాదు ప్రేక్షకులు సైతం నిరుత్సాహపడుతున్నారు. వారి నిరుత్సాహాన్ని ఉత్సాహంగా మార్చేందుకు రజనీ నటించిన 'కాలా' చిత్రం త్వరలోనే విడుదలకు రెడీ అవుతోంది. ఈచిత్రాన్ని ఏప్రిల్ 14న విడుదల చేసేందుకు చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. తమిళ నూతన సంవత్సరాది సందర్భంగా 'కాలా' రూపంలో అభిమానులకు రజనీ గిఫ్ట్ ఇవ్వబోతున్నారని చిత్రయూనిట్ అంటోంది. 'కబాలి' తర్వాత పా.రంజిత్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతున్న విషయం విదితమే. ఇందులో రజనీకాంత్ సరసన హ్యూమా ఖురేషి కథానాయికగా నటిస్తోంది. ముంబయి మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. సంతోష్ నారాయణన్ సంగీతం అందించిన ఈ చిత్ర మ్యూజిక్‌ను త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, 'రోబో 2.0' చిత్రాన్ని కూడా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్ట్ 15న విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారట.

కడుపుబ్బ నవ్వించే గోలీసోడా

మానస్, నిత్య నరేష్, కారుణ్య నాయకానాయికలుగా నటించిన చిత్రం 'సోడా గోలీసోడా'. మల్లూరి హరిబాబు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఎస్.బి.ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై చక్రసీద్ సమర్పణలో భువనగిరి సత్య సింధూజ నిర్మించారు. ఈ సినిమాను ఈ నెల 16న విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఆ విశేషాలను నిర్మాత సత్య సింధూజ తెలియజేస్తూ, 'పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా తెరకెక్కించాం. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకర్షించే కంటెంట్ ఉంది. కమర్షియల్ వ్యాల్యూస్‌తో రాజీపడకుండా సినిమాను నిర్మించాం. దర్శకుడు హరిబాబు సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దారు. హాస్యనటుల కామెడీ కడుపుబ్బ నవ్విస్తుంది. ఇటీవలే సెన్సార్ పూర్తి చేసి క్లీన్ యు సర్టిఫికెట్ పొందాం. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఈ నెల 16న గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం. అందరిని అలరించే చిత్రమవుతుంది' అని అన్నారు.


మానస్, నిత్య నరేష్

ప్రేక్షకులను మెస్మరైజ్ చేసే సినిమా..


'దండుపాళ్యం 3' చిత్రంలోని ఒక దృశ్యం

విభిన్న కథాంశంతో రూపొందుతున్న 'దండుపాళ్యం' సిరీస్ చిత్రాలు మంచి ఆదరణ పొందుతున్నాయి. ఇప్పటి వరకు విడుదలైన 'దండుపాళ్యం', 'దండుపాళ్యం 2' విశేష ప్రేక్షకాదరణతో విజయం సాధించాయి. తాజాగా వీటికి రెండో సీక్వెల్‌గా 'దండుపాళ్యం 3' రూపొందుతోంది. శ్రీనివాసరాజు దర్శకత్వం వహించిన ఈ చిత్ర తెలుగు విడుదల హక్కులను శ్రీ వాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శ్రీనివాస్ మీసాల, రజని తాళ్లూరి దక్కించుకున్నారు. బొమ్మాలి రవిశంకర్, పూజా గాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే నెలలో విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, "దండుపాళ్యం' సిరీస్‌లో భాగంగా వచ్చిన చిత్రాలు ఎంతటి సంచలన విజయం సాధించాయో తెలిసిందే. రికార్డు కలెక్షన్లను వసూలు చేశాయి. తాజాగా వస్తున్న సినిమాకు దర్శకుడు శ్రీనివాసరాజు కథ, కథనం అద్భుతంగా కుదిరాయి. సన్నివేశాలు ఆడియెన్స్‌ను మెస్మరైజ్ చేస్తాయి. సహజత్వంతో కూడిన సన్నివేశాలతో, భావోద్వేగపూరిత డైలాగులతో కథ సాగుతుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. ఈ చిత్ర తెలుగు విడుదల హక్కులను ఫ్యాన్సీ రేటుకు దక్కించుకున్నందుకు సంతోషంగా ఉంది. త్వరలోనే భారీ స్థాయిలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ప్లాన్ చేస్తున్నాం. మార్చి 2న సినిమాను విడుదల చేస్తాం' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అర్జున్ జన్యా, సినిమాటోగ్రఫీ: వెంకట్ ప్రసాద్, ఎడిటింగ్: రవిచంద్రన్.


సోనమ్ కపూర్

అప్పట్లో రెండు లక్ష్యాలుండేవి..

'నటిగా నాకు ఏ ఆర్టిస్టు అయితే, ఏ ఫిల్మ్ మేకర్ అయితే ఛాలెంజింగ్‌గా అనిపిస్తారో వారితో పనిచేసేందుకు సిద్ధంగా ఉంటాను' అని అంటోంది సోనమ్ కపూర్. కెరీర్ తొలి నాళ్ళ నుంచి విభిన్న కథా చిత్రాలు, వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ రాణిస్తున్న సోనమ్ 'నీర్జా' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. తన కెరీర్‌ను సోనమ్ విశ్లేషించుకుంటూ, 'నా కెరీర్ 'రాంజానా'కు ముందు, 'రాంజానా'కు తర్వాత అన్నట్టుగా సాగింది. ఎందుకంటే ఆ సినిమా కంటే ముందు నాకు ఏడాదిన్నర గ్యాప్ వచ్చింది. కెరీర్ పరంగా ఎంతో రియలైజ్ అయ్యాను. అప్పట్లో రెండు లక్ష్యాలుండేవి. ఒకటి పెద్ద సూపర్ స్టార్ కావాలని, మరోకటి హ్యూమన్ బియింగ్‌గా ఉండాలని. దర్శకుడు ఆనంద్ ఎల్.రాయ్ 'రాంజానా' సినిమాలో ఛాన్స్ ఇచ్చారు. దీంతో బెటర్ యాక్టర్‌గా పేరు తెచ్చుకోవాలని ఎంతో కష్టపడ్డాను. అందులోని నా నటనకు గిఫ్ట్‌గా 'ఖుబ్ సూరత్', 'నీర్జా' చిత్రాలొచ్చాయ్. నేను మొదట్లో నటనను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా, కానీ తర్వాత తప్పుదారి పట్టింది. ఆ విషయం చాలా మంది మా తల్లిదండ్రులకు చెప్పేవారు. ' సోనూ నటనను ఈజీగా తీసుకుంటోంది. పెద్ద సూపర్ స్టార్ అయ్యే లక్షణాలు కనిపించడం లేదు' అని చెప్తే, దానికి మా నాన్న (అనిల్ కపూర్) స్పందిస్తూ, 'మా కూతురు ఆలోచన ఎలా ఉందో మీకెలా తెలుస్తుంది. దాని గురించి వదిలేయండి' అని చెప్పేవారు. అప్పట్నుంచి ఎంతో కష్టపడి పనిచేశాను. 'నీర్జా' సినిమాకు నేనేంటో నిరూపించుకునే ఛాన్స్ వచ్చింది. ఆ సినిమా కోసం నన్ను నేను ఎంతో కష్టపెట్టుకున్నాను. అది నాకెంతో పేరు తెచ్చిపెట్టింది. అందుకే ఛాలెంజింగ్ ఫిల్మ్ మేకర్స్, ఛాలెంజింగ్ ఆర్టిస్టులతో పనిచేయాలనుకుంటున్నాను. అలా చేయడం వల్ల యాక్టర్‌గా నాలో బెటర్‌మెంట్ వస్తుంది' అని తెలిపింది. సోనమ్ ప్రస్తుతం 'వీర్ ది వెడ్డింగ్', 'ఏక్ లడ్కీ కో దేఖా తో హైసా లాగా', సంజయ్ దత్ బయోపిక్‌లో నటిస్తోంది.


జాక్వెలిన్ ఫెర్నాండేజ్

ఏక్.. దో.. తీన్..

'ఏక్.. దో.. తీన్..' పాట బాలీవుడ్‌ని ఓ ఊపు ఊపేసింది. 1988లో విడుదలైన 'తేజాబ్' చిత్రంలో మాధురీ దీక్షిత్‌పై చిత్రీకరించిన ఈ పాట అప్పట్లో ఓ సంచలనం. ఈ చిత్రాన్ని తెలుగులో వెంకటేష్ హీరోగా 'టూ టౌన్ రౌడీ'గా రీమేక్ చేశారు. ఇందులో 'వన్.. టూ.. త్రీ..'గా వచ్చే ఈ పాట తెలుగులోనూ అందర్నీ ఉర్రూతలూగించింది. బాలీవుడ్, టాలీవుడ్‌ల్లో సంచలనం సృష్టించిన ఈ పాటను 'బాఘి 2' చిత్రం కోసం రీమిక్స్ చేయబోతున్నారు. ఈ పాటలో జాక్వెలిన్ మెరవబోతుందట. ఈ విషయాన్ని బాలీవుడ్ సినీ విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. అప్పటి పాటను మించేలా తాజా పాట చిత్రీకరణ ఉండబోతుందని, ఇది మరో ట్రెండ్ సెట్టర్ అవుతుందని చిత్ర వర్గాలూ అంటున్నాయి. టైగర్ షరాఫ్, దిశా పటానీ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి అహ్మద్ ఖాన్ దర్శకత్వం వహిస్తున్నారు. 2016లో విడుదలై విశేష ప్రేక్షకాదరణ పొందిన 'బాఘి' చిత్రానికి సీక్వెల్‌గా 'బాఘి 2' రూపొందుతున్న విషయం విదితమే. జాక్వెలిన్ ప్రస్తుతం 'డ్రైవ్', 'రేస్ 3' చిత్రాల్లోనూ నటిస్తోంది.

తెలుగు రాష్ట్రాల్లో డిమాండ్ల పరిష్కారానికి జేఏసీ కృషి

జేపీతో పవన్ భేటీ



నవతెలంగాణబ్యూరో– హైదరాబాద్
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు కానున్న జేఏసీ, కేవలం ఆ రాష్ట్ర డిమాండ్ల కోసమే కాదని, రెండు తెలుగు రాష్ట్రాల్లో డిమాండ్ల పరిష్కారానికి క షి చేయనున్నట్టు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ్ తెలిపారు. గురువారం ఆ ఇద్దరు నేతలు సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గంభీరమైన, ఉద్వేగాల సమయంలో ఏపీ విభజన జరిగిందన్నారు. నేతల తీరుమాత్రం ఏరుదాటాక తెప్ప తగలేసినట్టు మారిందన్నారు. పార్లమెంట్ సాక్షిగా చాలా రచ్చ, చర్చ, రభస జరిగాక ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్థిక లోటులో, రైల్వేజోన్ విషయంలో, అభివృద్ధిలో ఏపీకి అండగా నిల వాలని.. తెలంగాణకు పరిశ్రమలు, ఎయిమ్స్ విషయంలో సాయం అందిం చాలని కోరారు. ఇలా ప్రతి అంశంలో రెండు రాష్ట్రాల మేధావులతో చర్చించి తమ జేఏసీ ముందుకెళుతుందని తెలిపారు. ఇరు రాష్ట్రాల్లో శాంతియుత వాతావరణం నెలకొందని, సీఎంలను అభినందిస్తున్నానని చెప్పారు. ప్రజల కోసం తపించే పవన్‌కల్యాణ్‌ను అభినందిస్తున్నానని జేపీ అన్నారు.

వేతనాల చెల్లింపులు సరిచేయాలి: టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో– హైదరాబాద్
రాష్ట్రంలోని ఎయిడెడ్ టీచర్ల వేతనాలు, ఏరియర్స్ చెల్లింపులు సక్రమంగా చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గురువారం డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ శ్రీరామచంద్రమూర్తిని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి కొండల్‌రెడ్డి, ఎం శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఎం రవీందర్, సోమేశ్వర్ కలిసి వినతిపత్రం అందించారు. వేతనాలు, ఏరియర్స్ చెల్లింపుల్లో వస్తున్న సాంకేతిక లోపాలను సరిచేస్తామని ఆయన హామీనిచ్చారు. పీఆర్‌సీ బకాయిలను ఒకేసారి విడుదల చేయాలనీ డైరెక్టర్ ఆఫ్ లోకల్ ఫండ్ వెంకటేశ్వర్‌రావును సంఘం ప్రతినిధులు కోరారు.

సరోగసీతో పిల్లల్ని కంటే ప్రసూతి సెలవులు

(మొదటిపేజీ తరువాయి)

హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని సూచించింది. ప్రసూతికి ముందు, ఆ తర్వాత ఇచ్చే సెలవులు(180 రోజులు) సరోగసీ ద్వారా పిల్లల్ని కనే ఉద్యోగులకూ వర్తిస్తాయని హైకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. సరోగసీ ద్వారా కవల పిల్లలకు జన్మనిచ్చిన కేంద్రీయ విద్యాలయకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు తనకు ప్రసూతి సెలవులివ్వడానికి ప్రభుత్వం నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయించగా ఈ తీర్పు ఇచ్చింది. సరోగసీ ద్వారా పిల్లల్ని కనేవారు భౌతికంగా తల్లులు కాబోరన్న కారణంతో సెలవులను నిరాకరించడాన్ని హైకోర్టు తప్పు పట్టింది. చట్టపరంగా తల్లులు అవుతున్నందున సెలవులకు అర్హులని స్పష్టం చేసింది.

పాలకుల పాపం .. పిల్లలకు శాపం



(మొదటిపేజీ తరువాయి)

వివరాల ప్రకారం... కాగజ్‌నగర్ పట్టణం ద్వారకానగర్‌కు చెందని గజెల్లి వెంకటేష్ లక్ష్మి దంపతులకు ఇద్దరు జ్యోతిష్(8), మణికంఠ(6) కుమారులు ఉన్నారు. వెంకటేష్ గతంలో సిర్పూర్ పేపర్ మిల్లులో పనిచేశాడు. మూడేండ్ల కిందట మిల్లు మూతపడటంతో ఉపాధి కోల్పోయాడు. అప్పట్నుంచి చిన్నాచితకా పనులు చేసినా కుటుంబం గడవడం భారంగా ఉంది. కొన్ని రోజులుగా ఏ పనీ దొరక్క ఇంటివద్దే ఖాళీ ఉంటున్నాడు. పేపర్ మిల్లు తెరుస్తామని స్థానిక నేతల ప్రకటనలు చూసి మళ్లీ ఉపాధిపై ఆశలు పెట్టుకున్నాడు. కానీ రేపు, మాపు అంటూ ప్రభుత్వం మాటలకే పరిమితమైంది. పైగా ఎస్పీఎం కార్మికులకు ఎలాంటి ప్రత్యామ్నాయమూ చూపలేదు. దీంతో వెంకటేష్‌కు కుటుంబ పోషణ భారంగా మారి రోజురోజుకూ సమస్యలు అధికమయ్యాయి. ఇప్పట్లో మిల్లు తెరుచుకుంటుందో లేదోనని మనోవేదనకు గురై కొద్దిరోజుల కిందట మతిస్థిమితం కోల్పోయాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఇంట్లో అన్నంలో పురుగుల మందు కలిపి ఇద్దరు కుమారులకు తినిపించేందుకు యత్నించాడు. భార్య లక్ష్మి అడ్డుపడటంతో ఆమెను కొట్టి ఇంట్లో నుంచి బయటకు తోసేసి గడియ పెట్టుకున్నాడు. దాంతో తల్లి గట్టిగా కేకలు వేసి.. స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లారు. విషాహారం తినిపించబోతుండగా అడ్డుకుని చిన్నారులకు బయటకు తీసుకొచ్చి పోలీసులకు సమాచారం అంది ంచారు. ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వెంకటేష్‌ను అదు పులోకి తీసుకున్నారు. నిందితునిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అతనికి మతిస్థిమితం సరిగ్గాలేనందున చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

ఇంటికి దారేదీ..

(మొదటిపేజీ తరువాయి)

నడుములోతు నీళ్లలో నడిచి పోతారు. నెలకు సరిపోయే వంట సామగ్రి ఒక్కసారే పుట్టిమీద పోయి తెచ్చుకుంటారు. గ్రామానికి తాగునీటి సౌకర్యం లేదు. కృష్ణానది నీటిలో కంపెనీల నుంచి వస్తున్న కాలుష్యం వచ్చి చేరుతుంది. ఆ నీటినే గ్రామస్తులు తాగి అనేక రోగాల బారిన పడుతున్నారు. మిషన్ భగీరథ ఈ గ్రామానికి లేదు. గ్రామంలో కనీస సౌకర్యాలు లేక పోవడంతో ఎవరూ పిల్లనివ్వడానికి, చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. ఇప్పటికీ 80 మంది యువతీ యువకులు పెండ్లిళ్లు కాక వయస్సు మీద పడిపోతోంది.

బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు..?

గుర్రంగడ్డ గ్రామానికి రాంపూర్ నుంచి నదిలో కాలినడక రహదారి ఉంది. అక్కడ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే..రాకపోకలు సులభమవుతాయి. గతంలో రూ.14.60కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే ఇది ఈఎన్‌సీలో ఉంది. ఇక్కడి నుంచి ప్రతిపాదన వస్తే.. వెంటనే పనులు చేసే అవ కాశాలు ఉన్నాయి. కానీ పదేండ్లుగా బ్రిడ్జి నిర్మాణం ఒక కొలిక్కి రావడం లేదు. గ్రామస్తులంతా కలిసి రూ.16లక్షలు ఖర్చు చేసి నదిలోనే ఒక మట్టి రోడ్డును, మూడు కల్వర్టులను ఏర్పాటు చేయించారు. వరదలొచ్చినపుల్లా రోడ్డు కొట్టుకు పోతోంది.

కలుషిత నీటితో కిడ్నీ వ్యాధి
భీముడు, మత్స్యకార్మికుడు

ప్రతి రోజూ చేపలవేట కోసం కృష్ణానదికి వెళ్లక తప్పదు. మాకు శుద్ధి చేసిన నీళ్లు రాకపోవడం వల్ల నది నీళ్లనే తాగుతున్నం. ఆరోగ్యం బాగాలేదని కొన్నేండ్ల కింద ఆస్పత్రికి పోతే కిడ్నీల వ్యాధి అని చెప్పిండ్రు.

పెండ్లి సంబంధాలు వస్తలేవు
రాఘవేందర్ రెడ్డి

మాకు 16ఎకరాల భూమి ఉంది. పెద్దగా చదువుకోలేదు. ఉన్నంతలో బతుకుతున్నం. నాకు 40ఏండ్లు వచ్చినయ్. ఇంకా పెండ్లి సంబంధాలు వస్తలేవు. మా ఊరికి సౌకర్యాలు లేనందునే పిల్లనిస్తానికి ఇష్టపడతలేరు.


విభజనపై కట్టుబడి ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఎంపీ కవిత మాట్లాడారు. ఎన్డీయే భాగస్వామ్యపక్షమైన టీడీపీ సభలో ఆందోళన చేయడం దేశానికి చెడు సంకేతం వెళ్తుందని అన్నారు. విభజన హామీలపై టీడీపీ, వైసీపీ చేస్తున్న పోరాటానికి తాము మద్దతిస్తున్నట్టు తెలిపారు. వ్యాపారం సులభతరం చేయడంలో ప్రదర్శించిన చిత్తశుద్ధి... రైతుల అంశంలో చూపడం లేదని కేంద్రంపై విమర్శలు గుప్పించారు. నాలుగేండ్లలో వ్యవసాయం, రైతులకు సంబంధించి కేవలం రెండు బిల్లులు మాత్రమే ఆమోదించారని గుర్తు చేశారు. ఇప్పటికీ చాలా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఇక తెలంగాణకు సంబంధించి కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం దన్నుగా నిలవాల్సిన అవసరముందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ మైక్రో ఇరిగేషన్ గురించి చాలా చెబుతున్నారని, కానీ అందుకు అవసరమైన పరికరాలపై కేంద్రం కేవలం 30 శాతం మాత్రమే సబ్సిడీ ఇస్తోందని చెప్పారు. పైగా ఈ సబ్సిడీ కూడా రెండు, మూడు సంవత్సరాల తరువాత రైతులకు చేరుతుందని, ఫలితంగా రైతులకు ప్రయోజనం కలగడం లేదని వాపోయారు. తెలంగాణ రాష్ట్ర సర్కారు వంద శాతం సబ్సిడీ ఇస్తోందని చెప్పారు. రైతులు పండించిన అన్ని పంటలకూ మద్దతు ధర ప్రకటించాలని కోరారు. అలాగే పంట బీమా అంశంలో రైతును యూనిట్‌గా తీసుకోవాలని కోరారు.

రైతుల పేరుతో
వ్యాపారుల క్రయవిక్రయాలు

- మార్కెట్లో అలా చేస్తే కఠిన చర్యలు
- అసలు రైతులే లబ్ధి పొందాలి
- యార్డులలోనే కొనుగోలుకేంద్రాలు: సమీక్షలో మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణబ్యూరో– హైదరాబాద్
రైతుల ముసుగులో క్రయవిక్రయాలు జరిపే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. ' 'నకిలీ రైతుల" పట్ల జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటి ఘటనలపై ఆయా జిల్లా కలెక్టర్లు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అసలు రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. కొనుగోలు కేంద్రాలను ఇకపై వ్యవసాయ మార్కెట్ యార్డులలోనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గురువారం సచివాలయంలో మార్కెటింగ్ కార్యకలాపాలు, కందులు, శనగలు, వేరుశనగ వంటి పంట కొనుగోలు కేంద్రాల అమలు తీరు, ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు తగ్గిన వెంటనే కొనుగోలు కేంద్రాలను తక్షణం ప్రారంభించాలని మంత్రి సూచించారు. మార్కెట్ యార్డుల వెలుపల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయొద్దని అన్నారు. ఇప్పటికే నడుస్తున్న సొసైటీల కొనుగోలు కేంద్రాలను సమీపంలోని మార్కెట్ కమిటీతో వెంటనే అనుసంధానించాలని మంత్రి కోరారు. సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులచే ధ్రువీకరణ పత్రం పొందిన రైతుల వద్ద నుంచి మాత్రమే ప్రభుత్వ కొనుగోళ్లు జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్‌కు రాకముందే నాణ్యతా ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కందుల సేకరణ సందర్భంగా కొన్ని చోట్ల, ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ, మహబూబ్ నగర్, ఆదిలాబాద్ లలో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయని మంత్రి తెలిపారు. వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బందాలను ఏర్పాటు చేసి మార్కెటు కమిటీలలో జరిగే క్రయవిక్రయాలపై నిఘా ఉంచాలన్నారు. 25 క్వింటాళ్ళ కు మించి అదనంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చిన వ్యక్తులపై నిఘా పెట్టాలని కోరారు. రైతులకు మద్దతు ధర కల్పించే విషయమై పూర్తిస్థాయి చర్యలు తీసుకొని వారి ముసుగులో ప్రభుత్వానికి నష్టం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించి, నిజమైన రైతులకు లబ్ధి చేకూర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ కార్యదర్శి పార్థసారథి, వ్యవసాయశాఖ కమిషనర్ డాక్టర్ జగన్‌మోహన్, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, జాయింట్ డైరెక్టర్ లక్ష్మణుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

స్తంభించిన ఏపీ

(మొదటిపేజీ తరువాయి)

గంటలకే వామపక్ష, వైసీపీ నాయకులు పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ప్రయాణాలకు సిద్ధంగా ఉంచిన బస్సులు నిలిపేశారు. అప్రమత్తమైన అధికారులూ బస్సులను బయటకు పంపలేదు. లెనిన్ సెంటర్లో అన్ని పార్టీల నాయకులూ నిరసన కార్యక్రమం చేపట్టారు. మోడీ ఇచ్చింది మట్టి, కుండేనంటూ వినూత్న ప్రదర్శన చేపట్టారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మోకాళ్లపై నిలబడి నిరసనలో పాల్గొన్నారు. విద్యార్థి సంఘాలూ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించాయి. ముస్లిం ఐక్యవేదిక నాయకులు కూడా అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు, జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, సీపీఐ నాయకులు దోనేపూడి కాశీనాథ్, న్యూడెమొక్రసీ నాయకులు పొలారి, ఎంఎల్ పార్టీ నాయకులు అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. మహిళా సంఘాల నాయకులు మోడీకి వ్యతిరేకంగా వినూత్న నిరసన చేపట్టారు. జర్నలిస్టు సంఘాలు తొలిసారి బంద్‌లో పాల్గొన్నాయి. ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీడబ్ల్యూజేయూ, ఐజేయూ, ఏపీజేఎఫ్, ఏపీపీజేఏ, ఏపీబీజేఏ తదితర సంఘాలన్నీ బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ప్రతిపక్షనాయకుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లాలో బంద్‌లో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర వైఖరికి నిరసనగా పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాదు పోరంకి సెంటర్లో గుండు గీయించుకుని నిరసన వ్యక్తం చేశారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన బెంజ్ సర్కిల్లో పెట్రోలు బంకు వద్ద నిరసన ప్రదర్శన చేశారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో కొంతమంది సిబ్బంది విధులకు హాజరవగా బంద్ నిర్వాహకులు వాటిని మూయించారు,

ప్రజా విజయమన్న వామపక్షాలు

బంద్‌కు ప్రజల నుండి సంపూర్ణ మద్దతు వచ్చిందని, అపూర్వమని, ప్రజా విజయమని వామపక్ష పార్టీలు ప్రకటించాయి. ఇప్పటి వరకూ జరిగిన కార్యాచరణను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని ఆ పార్టీలు ప్రకటించాయి. సీపీఐ ఏపీరాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కర్నూలులో బంద్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులందరూ జిల్లాల వారీగా తెలుగుదేశం ఇచ్చిన నిరసన పిలుపులో పాల్గొన్నారు. టీడీపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు కిమిడి కళా వెంకట్రావు గుంటూరులో అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించడం ద్వారా కేంద్రానికి తమ నిరసన తెలిపారు. విజయవాడలో నిరాహార దీక్ష చేపట్టారు. మంత్రి అఖిలప్రియ కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో నిరసనలో పాల్గొన్నారు. మిత్రధర్మం మరువొద్దని ప్లకార్డును ప్రదర్శించారు. వైసీపీ నాయకులు కొలుసు పార్థసారథి తదితరులు విజయవాడ లెనిన్ సెంటర్లో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. జర్నలిస్టుల సంఘాల నాయకులు జి.ఆంజనేయులు, అంబటి ఆంజనేయులు, ఎస్.వెంకట్రావు, జయరాజు, కృష్ణాంజనేయులు, చందు జనార్ధన్ తదితరులు బంద్‌లో పాల్గొన్నారు.

బంద్‌పై చంద్రబాబు ఆరా

దుబాయ్‌లో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు బంద్‌పై టెలీ కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. బంద్‌కు సహకరించాలని అధికారులను ఆదేశించారు. శాంతియుతంగా జరిగేలా చూడాలని, అసాంఘిక శక్తులను అడ్డుకోవాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించాలని, వారిని ఇబ్బంది పెట్టొద్దని పోలీసులను ఆదేశించారు.

పద్దు భలే..ఖర్చే డల్!

(మొదటిపేజీ తరువాయి)

విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో, పారదర్శకంగా వ్యవహరిస్తున్నదా? లేదా? అనే దానికి ప్రగతి పద్దులో ఎంత వ్యయం చేశారన్నదే ప్రాతిపదిగ్గా ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇది కాకుండా నిర్వహణ పద్దు (గతంలో ప్రణాళికేతర వ్యయం) అనేది రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాలతో నిమిత్తం లేకుండా విధిగా ఖర్చు పెట్టాల్సిందే కదా? అని వారు ఈ సందర్భంగా ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం బడ్జెట్ కసరత్తులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రగతి పద్దు అంశం మరోసారి హాట్ టాపిగ్గా మారింది. వాస్తవాలను అంచనా వేసుకోకుండా.. అసలు వాటిని పరిగణనలోకే తీసుకోకుండా టీఆర్ఎస్ సర్కారు ప్రతియేటా బడ్జెట్‌ను పెంచి చూపుతున్నదనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. ఈ యేడాది కూడా ప్రభుత్వం అదే పద్ధతిని కొనసాగించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఆర్థికశాఖ వర్గాలు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డాయి. తొలి, మలి బడ్జెట్ల సమయంలో.. 'నూతన రాష్ట్రమైన తెలంగాణ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచేందుకే భారీ స్థాయిలో బడ్జెట్లను పెంచి చూపుతున్నాం...' అంటూ చెప్పుకొచ్చిన ప్రభుత్వాధినేతలు.. ఖర్చు విషయంలో మాత్రం అంతటి చిత్తశుద్ధిని ప్రదర్శించటం లేదని ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించటం ఈ సందర్భంగా గమనార్హం.

నాలుగు బడ్జెట్లలో ప్రగతి పద్దుకు కేటాయింపులు, ఖర్చు తీరుతెన్నులు (రూ.కోట్లలో)

	కేటాయింపు	ఖర్చు
2014-15	48,648	23,649
2015-16	52,383	39,914
2016-17	67,154	57,590
2017-18 (డిసెంబరు 2017 నాటికి)	30,929	16,468
మొత్తం	1,99,114	1,37,621

గ్రూప్- 1లో గందరగోళం!

(మొదటిపేజీ తరువాయి)

కీలో తప్పులు దొర్లాయని కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న కోర్టు ఏపీ, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్లు వేర్వేరుగా పరీక్షలు నిర్వహించాలని 2016, జూన్ 29న ఆదేశించింది. దీంతో 2016, సెప్టెంబర్ 14 నుంచి 24వ తేదీ వరకు గ్రూప్–1 మెయిన్స్ రాతపరీక్షలు తెలుగు రాష్ట్రాల్లో ఏకకాలంలో జరిగాయి. తెలంగాణలో 8,782 మంది అభ్యర్థులు అర్హులు కాగా, 1,792 మంది హాజరయ్యారు. ఆ తర్వాత 2017, జులై 24 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు 238 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరిగాయి. 2017, అక్టోబర్ 28న 127 గ్రూప్–1 పోస్టులకు 121 అభ్యర్థులను ఎంపిక చేసింది. టాప్‌టెన్‌లో 4,9వ ర్యాంకర్లకు ప్రాధాన్యం లేని ఎంపీడీవో పోస్టులకు ఎంపికయ్యారు. దీంతో టీఎస్‌పీఎస్సీలో తప్పులు దొర్లినట్టు వెల్లడైంది. ఆ వెంటనే గ్రూప్–1 ఫలితాలను నిలిపివేస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) వల్ల సాంకేతికంగా తప్పులు దొర్లాయని అంగీకరించింది. ఆ తర్వాత ప్రకటించిన ఫలితాల్లో 70 మంది అభ్యర్థుల భవితవ్యం తారుమారైంది. పాత జాబితాలో ఉద్యోగాలు పొందిన పది మంది పేర్లు కొత్త జాబితాలో గల్లంతయ్యాయి. ఇప్పటికీ గ్రూప్–1పై అభ్యర్థుల్లో అనుమానాలు తీరలేదు. గ్రూప్–1లో 128 పోస్టులకు 122 మంది అభ్యర్థులను ఎంపిక చేసింది. యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ తుది ఫలితాలు వెల్లడించిన తర్వాత అభ్యర్థుల మార్కులను పేపర్లు, ఇంటర్వ్యూ వారీగా విడుదల చేస్తుంది. కానీ టీఎస్‌పీఎస్సీ నియామకాల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని నిత్యం ప్రకటిస్తుంది. కానీ అభ్యర్థులు సాధించిన మార్కులను పేపర్లు, ఇంటర్వ్యూ వారీగా విడుదల చేయకపోవడం పట్ల అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మార్కులు వెల్లడించకపోవడమే పారదర్శకతా?అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. గ్రూప్–1లో సాధించిన మార్కులు వెల్లడించకపోవడం పట్ల వ్యతిరేకత రావడంతో ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు మొత్తం మార్కులను టీఎస్‌పీఎస్సీ ప్రకటించడం గమనార్హం. మెయిన్స్ పేపర్లు, ఇంటర్వ్యూ వారీగా మార్కులు విడుదల చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

నిబంధనల ప్రకారమే గ్రూప్–1 నియామకాలు : ఘంటా చక్రపాణి

నిబంధనల ప్రకారమే గ్రూప్–1 నియామకాలు చేపట్టామని టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి నవతెలంగాణతో చెప్పారు. నాగిరెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా జోన్–5కు చెందుతాడని అన్నారు. అనిల్‌కుమార్ వరంగల్ జిల్లా జోన్–6కు చెందుతారని వివరించారు. అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ (ఏఏవో)కు సంబంధించి జోన్–5లో ఎక్కువ పోస్టులున్నాయనీ, అందుకే ఆ జోన్‌కు చెందిన నాగిరెడ్డిని ఇంటర్వ్యూకు ఎంపిక చేశామని చెప్పారు. జోన్–6కు చెందిన అనిల్‌కుమార్‌కు మార్కులు ఎక్కువ వచ్చినా జోన్–5లో పోస్టులున్నందున ఇంటర్వ్యూకు ఎంపిక చేయలేదని అన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే టీఎస్‌పీఎస్సీ దృష్టికి తేవాలనీ, అయినా పరిష్కారం కాకపోతే కోర్టును ఆశ్రయించవచ్చని సూచించారు.

నాకు న్యాయం చేయాలి : అనిల్‌కుమార్

రాష్ట్ర ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ తనకు న్యాయం చేయాలని గ్రూప్–1 అభ్యర్థి అనిల్‌కుమార్ నవతెలంగాణతో చెప్పారు. గ్రూప్–1 రాష్ట్రస్థాయి పోస్టులకు సంబంధించింది అయినా, ఏఏవో పోస్టు జోన్‌కు చెందుతుందని అన్నారు. మెయిన్స్ రాతపరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చిన తనను ఇంటర్వ్యూకు ఎంపిక చేసి మెయిన్స్, ఇంటర్వ్యూలో మెరిట్ అభ్యర్థిని పోస్టుకు ఎంపిక చేస్తే బాగుండేదని సూచించారు. జోనల్ పోస్టుకైనా స్థానికులకు 70 శాతం, స్థానికేతరులకు 30 శాతం పోస్టులుంటాయని చెప్పారు. అలాంటప్పుడు జోన్–5కు అయినా తాను అర్హుడినే అవుతానని అన్నారు. మెయిన్స్‌లో ఎక్కువ మార్కులు వచ్చిన తనను ఇంటర్వ్యూకు ఎంపిక చేయకపోవడమే అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. ఇక్కడ న్యాయం జరగకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని అన్నారు.

విద్యాశాఖ డైరెక్టరేట్‌లో లొల్లి

- ఉద్యోగుల మధ్య పెరుగుతున్న వివాదాలు
- పనితీరుపైనా తీవ్రప్రభావం

నవతెలంగాణ బ్యూరో– హైదరాబాద్
తెలంగాణ పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో ఉద్యోగుల మధ్యలో గొడవలు తీవ్రస్థాయికి చేరాయి. ఏకంగా పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు వరకూ వెళ్లాయి. కార్యాలయంలో నిత్యం ఏదో ఒక గొడవ జరుగుతుండటంతో ఉద్యోగుల్లోనూ ఆందోళన మొదలైంది. దీని ప్రభావం వారి పనివిధానంపైనా పడుతుంది. సైఫాబాద్‌లో ఉన్న పాఠశాల డైరెక్టరేట్‌లో సుమారు 80 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం..వ్యక్తిగతంగా తనపై కామెంట్స్ చేశారని ఓ సీనియర్ అసిస్టెంట్‌ను..అక్కడ డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు చెప్పుతో కొట్టడంతో ఈ పంచాయితీలు ఒక్కొక్కటి బయటికొస్తున్నాయి. ఈ ఘటనలో కమిషనర్ జి కిషన్ స్పందించి..ఉపాధ్యాయురాలు డిప్యూటేషన్ రద్దు చేసి, నిజామాబాద్ డీఈఓకు సరెండర్ చేశారు. అయితే ఆమె బంధువు మాజీ ఉద్యోగ సంఘం నేత, ఓ ప్రజాప్రతినిధి జోక్యం చేసుకుని సీనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ సీనియర్ అసిస్టెంట్‌నూ ఓపెన్ స్కూల్ సొసైటీ విభాగానికి బదిలీ చేశారు. ఇంకా ఈ పంచాయితీ తెగలేదు. ఆయనపై సదరు ఉపాధ్యాయురాలు పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారు.

వారం రోజుల క్రితం కూడా డైరెక్టరేట్‌లోని సర్వీసెస్ విభాగంలో పనిచేసే ఓ యూనియన్ లీడర్, సీనియర్ అసిస్టెంట్‌పై, అడ్మిన్ విభాగానికి చెందిన ఓ మహిళా ఉద్యోగిని కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. తనను బెదిరించారనీ, బూతులు తిట్టారని పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసింది. యూనియన్ నేత కూడా పలువురు ఉద్యోగుల సంతకాలతో ఆ ఉద్యోగిని పనితీరుపై ఫిర్యాదుచేశారు. అయితే ఈ విషయంలో యూనియన్ రాష్ట్ర నేతలు జోక్యం చేసుకుని, డీఎస్ఈ యూనియన్ నాయకుడితో ఆమెకు క్షమాపణ చెప్పించినట్టు తెలిసింది. దీంతో ఆమె కేసు వెనక్కి తీసుకోనుందని సమాచారం. మరో ఘటనలో ఆర్ఎంఎస్ఏలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ సీనియర్ ఉద్యోగి తనను వేధిస్తున్నారనీ, అదే విభాగంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగిని కమిషనర్‌కు కొద్దిరోజుల క్రితం ఫిర్యాదు చేసింది. కమిషనర్ స్పందించక పోవడంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసిన[illegible]లోనూ ఉద్యోగుల మధ్య మనస్పర్ధలపై, పంచాయితీలపై కమిషనర్‌కు పలు ఫిర్యాదులు అందాయి. వారం రోజుల్లో విద్యాశాఖకు చెందిన మూడు పంచాయితీలు పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. దీని ప్రభావం మిగిలిన ఉద్యోగుల పనివిధానంపైనా పడుతుందని పలువురు చెబుతున్నారు. అయితే పంచాయితీలకు యూనియన్ సమస్యలూ ఓ ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి, ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

అన్ని ఘటనలపై విచారణ: జి కిషన్, కమిషనర్,పాఠశాల విద్యాశాఖ

పలువురు ఉద్యోగులు గొడవలపై నాకు ఫిర్యాదు చేశారు. ఓ ఘటనలో ఇప్పటికే ప్రాథమికంగా ఇద్దరు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నాం. ఈ ఘటనతో పాటు మిగిలిన వాటిపైనా విచారణ త్వరలో విచారణ చేయిస్తాం. తప్పనితేలితే చర్యలు తీసుకుంటాం.


ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా ఆర్ఎస్

హైదరాబాద్: రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆయన రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శిగా ఉన్నారు. ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా ఉన్న హన్మంతునాయక్ రిలీవ్ కావడంతో ఆ బాధ్యతల్ని ప్రవీణ్‌కుమార్‌కు అప్పగిస్తూ ఎస్సీ అభివ ద్ధి శాఖ కార్యదర్శి బుద్ధప్రకాశ్ జ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు.

పలువురు ఐఏఎస్ అధికారులకు పదోన్నతులు

హైదరాబాద్: రాష్ట్రంలో పనిచేస్తున్న పలువురు ఐఏఎస్ అధికారులకు ప్రభుత్వం పదోన్నతలు కల్పించింది. 1993 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు ఐఏఎస్ అధికారులకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. ఐఏఎస్‌లు వెంకటేశ్వరరావు, శివశంకర్, పార్థసారథి, విష్ణు, చంద్రవదన్‌లను ముఖ్యకార్యదర్శులుగా నియమించింది. కాగా వీరిని ప్రస్తుత పోస్టింగ్‌లోనే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. 2004, 2005 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులు కె. నిర్మల, గౌరవ్ ఉప్పల్, శరత్, ఇలంబర్తి, మాణిక్‌రాజ్, శర్మన్‌లను సెలక్షన్ గ్రేడ్ అధికారులుగా, 2008, 2009 బ్యాచ్‌కు చెందిన శ్రీదేవసేన, అహ్మద్, సత్యనారాయణ, అర్విందర్‌సింగ్, ఎం. ప్రశాంతిలను జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ అధికారులుగా పదోన్నతి కల్పిస్తూ నియామక ఉత్తర్వులను విడుదల చేసింది.

కోదండరామ్ పార్టీ ఎందుకు : చెరకు సుధాకర్



నవతెలంగాణబ్యూరో– హైదరాబాద్
కోదండరామ్ ఎవరి కోసం పార్టీ పెడుతున్నారో చెప్పాలని తెలంగాణ ఇంటిపార్టీ అధ్యక్షులు చెరకు సుధాకర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీపై కోదండరామ్ స్పష్టత ఇవ్వాలన్నారు. జగన్ సీఎం కావడం కోసమే పార్టీ పెడుతున్నారని చెప్పారనీ, కోదండరామ్ కూడా అందుకోసమే పెడుతున్నారా ...లేదా ఎవరికోసమో చెప్పాలని అన్నారు. అమరుల స్ఫూర్తి కోసమే పార్టీ పెడుతున్నామని చెప్పవద్దన్నారు. రాష్ట్రం కోసం టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఇప్పటివరకు కొట్లాడింది లేదన్నారు. యెన్నం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉద్యమం చేసిన వారిని కాకుండా...ఒకరో, ఇద్దరు, ముగ్గురు బఫూన్లను పక్కన పెట్టుకొని పార్టీ పెడుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ఆయన పార్టీ పెట్టేముందు ఉద్యమకారులతో చర్చించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, దొమ్మాట వెంకటేష్, నరసింహ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో కేటీఆర్ బిజీబిజీ

నవతెలంగాణ–న్యూఢిల్లీబ్యూరో
రాష్ట్ర పెండింగ్ అంశాలపై కేంద్రమంత్రులకు విన్నవించేందుకు ఢిల్లీ వచ్చిన పంచాయతీరాజ్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ గురువారం బిజీబిజీగా గడిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రక్షణరంగ ఉత్పత్తి కారిడార్‌ను ఏర్పాటు చేయాలని ఆ శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌ను కేటీఆర్ కోరారు. రక్షణ రంగానికి హైదరాబాద్ అనుబంధంగా ఉందని, పలు పరికరాల తయారీలో ముందు వరుసలో ఉందని వివరించారు. ఇక ఫిక్కీ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 19 వరకు హైటెక్స్‌లో జరిగే అంతర్జాతీయ సదస్సు, ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి రావాలని కేంద్రమంత్రులు నరేంద్రసింగ్ తోమర్, హర్షవర్ధన్‌లను ఆహ్వానించారు. అలాగే హైదరాబాద్ ఫార్మాసిటీకి సహకారం అందించాలని హర్షవర్ధన్‌ను కోరారు. అంతకముందు పార్లమెంట్‌లో పెట్రోలియం, మైనింగ్‌శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను కలిశారు. కాగా శుక్రవారం ఉదయం రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌ను కేటీఆర్ కలవనున్నారు.

తెలంగాణకు 17.9 ఏపీకి 17.9 టీఎంసీల నీరు

ఫిబ్రవరి అవసరాల కోసం కృష్ణా బోర్డు కేటాయింపు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి
ఫిబ్రవరి అవసరాల కోసం తెలంగాణకు 17.9, ఏపీకి 17.9 టీఎంసీల నీటిని కేటాయిస్తూ కృష్ణా బోర్డు గురువారం ఆదేశాలు జారీ చేసింది. జనవరి 10న జరిగిన బోర్డు త్రిసభ్య కమిటీ నిర్ణయం మేరకు ఈ కేటాయింపులు చేస్తున్నట్టు బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం తెలిపారు. తెలంగాణ లోని కల్వకుర్తికి 2.5 టీఎంసీలు, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు, జంటనగరాల తాగునీటి అవసరాల కోసం 4.4 టీఎంసీలు, నాగార్జునసాగర్ ఎడమకాల్వకు 11 టీఎంసీల నీరు బోర్డు కేటాయించింది. ఏపీలోని పోతిరెడ్డి పాడుకు 0.5 టీఎంసీ, హంద్రీనీవాకు 4.50 టీఎంసీలు, నాగార్జునసాగర్ కుడికాల్వకు 10.50 టీఎంసీలు, ఎడమకాల్వకు 2.09 టీఎంసీలు కేటాయించింది. గత నెలలో జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో ప్రస్తుత నీటి సంవత్సరంలో రెండు రాష్ట్రాలకూ నీటి కేటాయింపులు చేసింది. ఏపీకి 60 టీఎంసీలు, తెలంగాణకు 50 టీఎంసీలు కేటాయించగా ఏపీకి కేటాయించిన నీటిని ఇప్పటికే వినియోగించుకున్నట్టు బోర్డు తెలిపింది. అయినప్పటికీ తాజా ఇండెంట్‌ల ఆధారంగా మళ్లీ కేటాయింపులు చేస్తున్నట్టు పేర్కొన్నది. ఫిబ్రవరి నెల అవసరాల కోసం ఈ నెల 6న తెలంగాణ ఈఎన్‌సీ, ఈనెల 8న ఏపీ ఈఎన్‌సీ ఇండెంట్ పంపారు. తాజా కేటాయింపుల వల్ల శ్రీశైలం నుంచి 26 టీఎంసీల నీటిని పవర్ జనరేషన్ ద్వారా నాగార్జునసాగర్‌కు విడుదల చేయాలని బోర్డు ఆదేశించింది. నాగార్జునసాగర్‌లో నీటి మట్టం 520 అడుగులకు తగ్గకుండా చూడటానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు బోర్డు కార్యదర్శి తాజా ఉత్తర్వుల్లో వివరించారు. గోదావరి నుంచి కృష్ణా డెల్టాకు ఏపీ తరలిస్తున్న నీటితో పాటూ చిన్న నీటి వనరుల కింద లభ్యమయ్యే నీటిని పరిగణలోకి తీసుకోకుండా తాజా కేటాయింపులు చేసినట్టు బోర్డు తెలిపింది.

దళితుని భూమి కేంద్ర మంత్రి కబ్జా

(మొదటిపేజీ తరువాయి)

లాక్కునేందుకు మంత్రి ప్రయత్నించారని ఆ కేసు బుక్ చేశారు. పాట్నా జిల్లా, సెషన్స్ కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. సుమారు తన రెండు ఎకరాల పూర్వీకుల భూమిని మంత్రితో పాటు మరో 32 మంది కబ్జా చేసే ప్రయత్నం చేశారని దనాపూర్ వాసి రామ్ నారాయణ్ ప్రసాద్ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టులో ఫిర్యాదు చేశారు. ఐపీసీతో పాటు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద పోలీసులు కేసును బుక్ చేశారు. 1957, 1972లో తన భూమిని అక్రమంగా విక్రయించారనీ, 1992లో మరోసారి థర్డ్ పార్టీకి ఆ భూమిని బహుమతిగా ఇచ్చారని రామ్ నారాయణ్ ప్రసాద్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ అక్రమ విక్రయంలో ప్రస్తుత కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ హస్తముందని తెలిపారు. కాగా కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ పై కేసు నమోదు చేసిన విషయాన్ని పాట్నా ఎస్ఎస్పీ మను మహరాజ్ ధ్రువీకరించారు. ఐపీసీ సెక్షన్లు 419, 420, 423, 467, 468, 469 కింద వారిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్టు తెలిపారు. కాగా ఎఫ్ఐఆర్ నమోదైన నేపథ్యంలో గిరిరాజ్ సింగ్ రాజీనామా చేయాలని ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ డిమాండ్ చేశారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలకు బీసీ, ఎస్సీ కుటుంబాల నుండి ప్రతినిధుల హాజరు

నవతెలంగాణబ్యూరో– హైదరాబాద్
నల్లగొండలో జరిగిన సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలకు ప్రతినిధులుగా బీసీ, ఎస్సీ కుటుంబాలకు చెందిన పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. మహాసభలకు 508 ప్రతినిధులు, 98 పరిశీలకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్హతల కమిటీ నివేదికను ప్రవేశపెట్టింది. ప్రతినిధుల్లో 128 మంది ఎస్సీలు, 181 మంది బీసీలు, 43 మంది ఎస్టీలు, 43 మంది ఎంబీసీలు, 26 మంది మైనార్టీలు, 130 మంది ఇతరులు ఉన్నారు. 18 నుండి 25 సంవత్సరాల లోపు 15 మంది, 26 నుండి 40 సంవత్సరాల లోపు 142 మంది, 41 నుండి 60 సంవత్సరాల లోపు 305 మంది ఉన్నారు. 94 మంది మహిళా ప్రతినిధులు హాజరు కావడం విశేషం. 50 రోజుల పైన జైలు జీవితం గడిపిన వారు 39 మంది ఉండగా, 26 నుండి 50 రోజుల లోపు 35 మంది, 11 నుండి 25 రోజుల లోపు 37 మంది, ఆరు నుండి 10 రోజుల లోపు 53 మంది, ఐదు రోజుల లోపు 73 మంది ఉన్నారు. 1 నుండి 5 కేసులు ఉన్నవారు 204 మంది, ఆరు నుండి పది కేసులు ఉన్నవారు 50 మంది, పదిపైన కేసులు ఉన్నవారు 17 మంది ఉన్నారు.

సెన్సెక్స్ ▼ 330
34,413

నిఫ్టీ ▼ 100
10,576

స్మార్ట్‌ఫోన్ @ రూ.500!

- రూ.60-70 రీచార్జ్‌కే మేటి ఆఫర్లు
- 'ఫీచర్'ఫోన్ వాడకందారులే లక్ష్యం
- జియో పోటీ సంస్థల కొత్త ఎత్తుగడ
- చర్చల్లో ఎయిర్‌టెల్, ఐడియా. వొడా

నవతెలంగాణ, వాణిజ్య విభాగం: దేశీయ టెలికాం రంగంలో పోటీ రానురాను మరింత తీవ్రతరం అవుతోంది. మార్కెట్లో గట్టి పోటీదారే లేకుండా చేసుకోవాలన్న వ్యూహంతో రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ పావులు కదుపుతుంటే.. బరిలో నిలిచేందుకు పోటీ సంస్థలు కూడా శాయశక్తులా కృషి చేస్తున్నాయి. తమతమ వ్యూహాల్లో భాగంగా జియో సంస్థ ఇటీవల మార్కెట్‌లో తమ వాటాను పెంపొందించుకొనే వ్యూహంలో భాగంగా సబ్సిడీ ధరలకే 4జీ ఫీచర్ ఫోన్లను అందిస్తుండడం.. కేవలం రూ.49 నుంచి మొదలుకొని రూ.153ల స్వల్ప ధరల ప్లాన్‌లతో అపరిమిత కాలింగ్ సౌలభ్యం, 28 రోజుల పాటు రోజుకు 1 జీబీ డేటాను అందించే ఆకర్షణీయమైన పథకాలను తీసుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పోటీ సంస్థలైన ఎయిర్‌టెల్, ఐడియా, వొడాఫోన్ సంస్థలు కూడా మార్కెట్లో పట్టు నిలుపుకొనేందుకు గాను త్వరలోనే రూ.500ల కంటే తక్కువ ధరకే 4జీ స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసే వ్యూహంలో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఇందుకోసం ఆయా సంస్థలు మొబైల్ కంపెనీలతో చర్చిస్తున్నట్టు సమాచారం. అంతేగాక.. నెలకు రూ.60 నుంచి 70 రీఛార్జ్‌తోనే అధిక డేటా, వాయిస్ కాల్ ఆఫర్లను ఇవ్వాలని యోచిస్తున్నాయని తెలుస్తోంది.



ఎందుకంత తక్కువకంటే..

దేశంలో అత్యధిక జనాభా దిగువ మధ్య తరగతి, పేద కుటుంబాలలోనే ఉన్నారు. వీరు ఎక్కువగా మొబైల్ ఫోన్లను వాయిస్ కాల్స్ నిమిత్తమే వాడుతూ వస్తున్నారు. ఇందుకోసం 2జీ ఆధారితంగానే పని చేసే వాయిస్ సేవలను వీరు ఎక్కువగా వినియోగిస్తున్నారు. దాదాపు 100 కోట్లకు పైగా ఉన్న మొబైల్ వాడకందారుల్లో వీరి వాటా సుమారు 65 నుంచి 70 కోట్ల వరకు ఉంది. టెలికాం రంగానికి మొత్తం వస్తున్న ఆదాయంలో దాదాపు సగం రెవెన్యూ ఈ ఫీచర్‌ఫోన్ వినియోగదారుల నుంచే వస్తుండడం విశేషం. మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వారు సంపన్నులు ఇప్పటికే అత్యాధునిక టెలికాం సేవల నిమిత్తం స్మార్ట్‌ఫోన్లను వాడేస్తున్నారు. వేగవంతమైన డేటా నిమిత్తం వీరిలో చాలా మంది 4జీ సేవలకు అప్‌డేట్ అయిపోయారు కూడా. ఈ నేపథ్యంలో స్మార్‌ఫోన్ల వాడకందారుల మార్కెట్ గరిష్ట స్థాయికి విస్తరించింది. ఇకపై ఈ విభాగంలో చెప్పుకోదగ్గ వృద్ధి నమోదు కావడానికి అవకాశం లేదు. దీంతో తాజాగా టెలికాం సంస్థలన్నీ ఫీచర్ ఫోన్ల వాడకందారుల వైపు దృష్టి సారిస్తున్నాయి. తక్కువ ధరకు మేటి ఫ్రీ వాయిస్ సేవలతో పాటు డేటా ఫీచర్లను కూడా రుచి చూపించి తమ మార్కెట్‌ను విస్తృత పరుచుకోవాలని టెలికాం సంస్థలు పోటీ పడుతున్నాయి. ఇందులో భాగంగానే తక్కువ ధరకే ఇంటర్‌నెట్ సౌకర్యంతో కూడిన ఫీచర్ ఫోన్‌ను అందించేందుకు జియో సంస్థ ముందుకు రాగా.. తమ వినియోగదారులను కాపాడుకొనేందుకు ఇప్పుడు మిగతా టెలికాం సంస్థలు రూ.500ల కంటే తక్కువకే స్మార్ట్‌ఫోన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నాయి. తొలత జియో ఫోన్' పేరుతో రిలయన్స్ సంస్థ ఫీచర్ ఫోన్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. రూ.1500 సెక్యూరిటీ బాండ్‌తో పూర్తి ఉచితంగా ఈ ఫోన్‌ను అందిస్తున్నట్లు ప్రకటించింది. ఈ దెబ్బతో ఎయిర్‌టెల్, ఐడియా, వొడాఫోన్ లాంటి ప్రముఖ టెలికాం కంపెనీలు కూడా బడ్జెట్ ఫోన్లపై దృష్టి సారించాయి. మొబైల్ తయారీ సంస్థలతో కలిసి రూ. 1500 కంటే తక్కువ ధరలోనే ఎంట్రీ లెవల్ స్మార్ట్‌ఫోన్లను తీసుకొస్తున్నాయి. అయితే తాజాగా రూ. 500కే 4జీ స్మార్ట్‌ఫోన్లను తీసుకురావాలని ఈ కంపెనీలు భావిస్తున్నాయట. ఇందుకోసం మొబైల్ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలుస్తోంది.

గూగుల్‌కు 136 కోట్ల జరిమానా



న్యూఢిల్లీ: ఇంటర్‌నెట్ దిగ్గజం గూగుల్ సంస్థకు భారత్‌లో అనుకోని ఎదురుదెబ్బ తగిలింది. భారత మార్కెట్‌కు సంబంధించిన ఆన్‌లైన్ సెర్చ్ విషయంలో అక్రమ వ్యాపార విధానాలను అవలంభించి నందుకు గాను ఆ సంస్థకు 'కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా' (సీసీఐ) రూ.136 కోట్ల మేర జరిమానాను విధించింది. మ్యాట్రిమొని డాట్ కామ్, కన్జ్యూమర్ యూనిటీ అండ్ ట్రస్ట్ సొసైటీలు 2012లో గూగుల్ ఎల్‌ఎల్‌సీ, గూగుల్ ఇండియా, గూగుల్ ఐర్లాండ్ సంస్థలపై ఫిర్యాదు చేశాయి. ఈ ఫిర్యాదును విచారణకు తీసుకున్న సీసీఐ సంస్థ గూగుల్ నమ్మకానికి వ్యతిరేకంగా ప్రవర్తించడం అనే నిబంధనను ఉల్లంఘించినందుకు గాను జరిమానా విధించాలని నిర్ణయిస్తూ ఆదేశాలను జారీ చేసింది. ఆన్‌లైన్ సెర్చ్ అంశంలో మార్కెట్లో ఆధిపత్య స్థానంలో ఉన్న గూగుల్ సంస్థ వివిధ అంశాల సెర్చ్ ఫలితాలను ప్రకటించే విషయంలో వాస్తవాలకు దూరంగా.. కొన్ని సంస్థలకు కొమ్ముకాసే విధంగా ఫలితాలను అందించడం ద్వారా అక్రమాలకు పాల్పడినట్టు పేర్కొంది. ఇందుకు గాను ఆ సంస్థ 2013 నుంచి 2015 వరకు భారత్‌లోని కార్యకలాపాల ద్వారా గూగుల్ సంస్థ ఆర్జించిన సగటు మొత్తం ఆదాయంలో 5 శాతాన్ని జరిమానాగా విధించినట్టుగా సీసీఐ వెల్లడించింది.

వామాకు ఆకర్షణీయ లాభాలు

నవతెలంగాణ, వాణిజ్య విభాగం: హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఐటీ మౌలిక వసతుల కల్పన, ఐటీ ఆధారిత సేవల సంస్థ వామా ఇండస్ట్రీస్ లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి మెరుగైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు కాలంలో సంస్థ రూ.1.28 కోట్ల నికర లాభాలను ప్రకటించింది. అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో సంస్థ లాభం రూ.0.06 కోట్లుగా ఉందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఫలితాల సందర్భంగా సంస్థ చైర్మెన్, ఎండీ రామరాజు మాట్లాటుతూ తమ సంస్థ నిర్దేశించుకున్న మేరకు వృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. గత కొన్ని త్రైమాసికాలుగా సంస్థ మెరుగైన ఆర్థిక ఫలితాలను ప్రకటిస్తుండడమే ఇందుకు నిదర్శనమని ఆయన అన్నారు.

ఏసీసీ లాభాలు అదుర్స్

చెన్నై: సిమెంట్ తయారీ దిగ్గజం ఏసీసీ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి మేటి ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు మధ్య కాలంలో సంస్థ లాభం 126 శాతం వృద్ధి చెంది రూ.206 కోట్లకు చేరుకుంది. మార్కెట్ వర్గాల అంచనాలను మించి కంపెనీ మేటి ఆర్థిక ఫలితాలను ప్రకటించడం విశేషం. ఇదే కాలంలో సంస్థ నికర అమ్మకాలు 30 శాతం మేర పెరిగి రూ.3417 కోట్లకు చేరుకున్నాయి. ఫలితాల నేపథ్యంలో ఈ కంపెనీ షేర్లు మార్కెట్లో హల్‌చల్ చేశాయి. ఒక దశలో ఈ స్టాక్ దాదాపు 3 శాతం మేర వృద్ధిని నమోదు చేసింది. మేటి ఫలితాల నేపథ్యంలో కంపెనీ బోర్డు షేరు ఒక్కింటికి రూ.15 డివిడెండ్‌ను ప్రకటించింది.

హమ్మయ్య.. ఎట్టకేలకు లాభాలు..

ఏడు సెషన్ల వరుస నష్టాలకు బ్రేక్
- 330 పాయింట్లు పెరిగిన బీఎస్ఈ సెన్సెక్స్
- 10,500 ఎగువకు ఎన్ఎస్ఈ నిఫ్టీ



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు లాభాల బాట పట్టాయి. బడ్జెట్ ప్రకటనల ప్రభావంతో పాటు.. అంతర్జాతీయ ఒత్తిళ్ల కారణంగా వరుసగా గత ఏడు సెషన్ల నుంచి కుదేలవుతూ వస్తోన్న మార్కెట్లు గురువారం ఎట్టకేలకు కోలుకున్నాయి. దాదాపు అన్ని రంగాల్లో కొనుగోళ్ల ధోరణి కనిపించింది. ఔషధ రంగ కంపెనీల షేర్ల ర్యాలీతో నేడు స్టాక్ మార్కెట్లు కోలుకున్నాయి. దీంతో బడ్జెట్ సెషన్ నుంచి నష్టాలను నమోదు చేస్తున్న మార్కెట్లకు కొంచెం ఊరట లభించినట్టయింది. మార్కెట్ సూచీలు రోజంతా భారీ లాభాలలోనే కదిలాడాయి. సెన్సెక్స్ 330 పాయింట్లు లాభపడి 34,413 పాయింట్ల వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 100 పాయింట్లు లాభపడి 10,577 పాయింట్ల వద్ద ముగిసింది. ఫార్మా రంగం టాప్ విన్నర్‌గా నిలవగా.. పీఎస్‌యూ బ్యాంక్స్, రియల్టీ, మెటల్, ఐటీ, ఆటో రంగాల షేర్లు ఎక్కువగా లాభపడ్డాయి. సిప్లా షేర్లు 6 శాతానికి పైగా లాభపడగా.. సన్ ఫార్మా, అంబుజా సిమెంట్, డాక్టర్ రెడ్డీస్ షేర్లు మూడు శాతానికి పైగా రాణించాయి. మరో పక్క ఐటీ సంస్థలు కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్ 3 శాతం, టెక్‌మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్‌లు రెండు శాతం వరకు పెరిగాయి. షార్ట్ కవరింగ్‌లు జరగడంతో మార్కెట్లు లాభపడ్డాయని నిపుణులు చెబుతున్నారు. మరోపక్క ఆసియా మార్కెట్లు లాభాల్లో ట్రేడవగా.. యూరప్‌లోని ప్రధాన మార్కెట్లు నష్టాల్లో కదలాడాయి. అరబిందో ఫార్మా, ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ, ఆదానీ పోర్ట్స్, ఐటీసీ, టాటా మోటార్స్, హిందాల్కో, పవర్ గ్రిడ్, ఎన్‌టీపీసీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.

'క్రిప్టో' సంపన్నుడు క్రిస్ లార్సెన్



న్యూయార్క్: ప్రపంచ వ్యాప్తంగా క్రిప్టో కరెన్సీల విలువ అంతకంతకు క్షీణిస్తున్నాయి. దీంట్లో ముఖ్యంగా బిటకాయిన్ జెట్ స్పీడ్ వేగంతో విలువను కోల్పోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం క్రిప్టో కరెన్సీ అత్యంత సంపన్నుల జాబితాను ప్రముఖ పత్రిక పోర్బ్స్ వెల్లడించింది. ఈ జాబితాలో రైపిల్ సహ-వ్యవస్థాపకులు క్రిస్ లార్సెన్ 7.5-8 బిలియన్ డాలర్ల (రూ.53,222కోట్లు) విలువైన క్రిప్టో కరెన్సీతో అగ్రస్థానంలో నిలిచినట్టు పోర్బ్స్ వెల్లడించింది. మరోవైపు ఈ చట్ట సమ్మతం కానీ ఈ కర్సెనీల విలువ మాత్రం అంతకంతకు పెరుగుతుండటం విశేషం. పోర్బ్స్ అంచనా ప్రకారం..2017లో బిట్‌కాయిన్, ఇథెరియమ్, ఎక్స్‌ఆర్‌పీ వంటి మూడు సాధారణ క్రిప్టో కరెన్సీలు సగటున 14,409శాతం చొప్పున పెరిగాయని పేర్కొంది. ప్రస్తుతం దాదాపు 1500 క్రిప్టోఅసెట్స్ ఉనికిలో ఉన్నాయని పోర్బ్స్ పత్రిక విశ్లేషించింది. ఇక ఈ జాబితాలో జోసెఫ్ లుబిన్ క్రిప్టో నికర విలువ (1-5 బిలియన్ డాలర్లు), చాంగ్‌పెంగ్ జాహో (1.1-2 బిలియన్ డాలర్లు), కెమెరాన్ అండ్ టెలర్ వింక్లేస్స్ (900 మిలియన్- 1.1బిలియన్ డాలర్లు), మాథ్యు మెల్లన్ (900 మిలియన్- 1.1బిలియన్ డాలర్లు) సంపదతో ఉన్నారు. కాగా ఈ జాబితాలో మరికొంత మంది కూడా ఉన్నట్టు పోర్బ్స్ తెలిపింది.

ఎయిరిండియాకు లాభాలు..

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా (ఏఐ) సంస్థ క్రమంగా తన పనితీరును మెరుగుపరచుకుంటూ లాభాల బాటలోకి వస్తోంది. గత ఆర్థిక సంవత్సరం ఏఐ నిర్వహణ లాభం రెండింతలు పెరిగి రూ.298 కోట్లకు చేరిందని ప్రభుత్వం వెల్లడించింది. 2015-16లో ఏఐ ఆపరేటింగ్ ప్రాఫిట్ రూ.105 కోట్లుగా ఉందని తెలిపింది. అయితే గతేడాది ఏఐ నికర నష్టాలు మాత్రం భారీగా పెరిగి రూ.5,765 కోట్లకు చేరుకున్నాయి. ఇక అంతకు ముందు ఏడాది సంస్థ నికర నష్టం రూ.3,836 కోట్లుగా నమోదైంది. ప్రభుత్వ టౌర్నరౌండ్ ప్రణాళికలో భాగంగా ఎయిరిండియా ఆర్థిక, నిర్వహణ పనితీరు క్రమంగా వృద్ధి చెందుతోందని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా గురువారం లోక్ సభలో ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానంగా తెలిపారు.

మేధో సంపత్తిలో భారత్ వెనక్కి

వాషింగ్టన్: ప్రపంచ మేధో సంపత్తి(ఐపీ) సూచీలో భారత్ ర్యాంకు దిగజారింది. మొత్తం 50 దేశాలకు గానూ భారత్ 44వ ర్యాంక్‌తో అట్టడుగున నిలిచిందని అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ గురువారం ప్రకటించింది. అయితే గతేడాది నమోదైన ర్యాంక్‌తో పోల్చి చూస్తే మాత్రం కాస్తా మెరుగుపడింది. గతేడాది ఈ జాబితాను 45 దేశాలతో రూపొందించగా ఇందులో భారత్ 43వ ర్యాంకుతో సరిపెట్టుకుంది. అయితే ప్రస్తుతం జాబితాలో ఇండియా ర్యాంకు మెరుగైనప్పటికీ.. సూచీలో మాత్రం కిందిస్థాయి లోనే కొనసాగడం గమనార్హం. ఇక ఈ జాబితాలో 37.98 పాయిం ట్లతో అమెరికా అగ్రస్థానంలో నిలువగా, తర్వాతి స్థానంలో 37.97 పాయింట్లతో యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), అ తర్వాత స్థానంలో 37.03 పాయింట్లతో స్వీడన్ నిలిచింది.

పత్తి మార్కెట్‌లో దారుణం

- నిద్రిస్తున్న రైతుపై నుంచి వెళ్లిన డీసీఎం
- రైతు మృతి .. మార్కెట్‌లో ఉద్రిక్తత
- రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చిన ఎమ్మెల్యే ఎర్రబెల్లి



నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం ఘోరం జరిగింది. నిద్రిస్తున్న రైతుపై నుంచి డీసీఎం వెళ్లడంతో తీవ్ర గాయాలై ప్రాణం కోల్పోయాడు. దీంతో రైతులు ఆందోళనకు దిగడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది. ఆస్పత్రిలో రైతు మృతదేహాన్ని ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు సందర్శించి, కుటుంబీకులకు రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేశారు.

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మాదాపూర్ శివారులోని దేవునిగుట్ట తండాకు చెందిన బానోతు రవి(35) బుధవారం ఎనుమాముల మార్కెట్‌కు పత్తి తీసుకొచ్చాడు. తేమశాతం ఎక్కువగా ఉన్నదని వ్యాపారులు పత్తిని కొనడానికి నిరాకరించారు. చేసేదేమీ లేక రాత్రి మార్కెట్ ఆవరణలో పత్తిని ఆరబెట్టాడు. పంట వద్ద కాపలాగా పడుకున్నాడు. చలి తీవ్రత ఉండటంతో పత్తితో పాటు తనపై పరదా కప్పుకున్నాడు. గురువారం తెల్లవారుజామున మిర్చి బస్తాల లోడుతో వచ్చిన డీసీఎం రవి పై నుంచి వెళ్లింది. దీంతో రవికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమాధ్యలోనే చనిపోయాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అఖిలపక్ష నాయకుల ధర్నా

రైతు కుటుంబానికి 30 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం), కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, బీజేపీ, రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం మార్కెట్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యదర్శి పోలెపాక నిర్మలతో సమావేశమయ్యారు. ఈ ధర్నాలో బీజేపీ అర్బన్, రూరల్ జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్‌రెడ్డి, రావు పద్మ, టీడీపీ అర్బన్ జిల్లా అధ్యక్షులు ఈగ మల్లేషం, కాంగ్రెస్ నాయకులు ఎర్రబెల్లి స్వర్ణ, మంద వినోద్‌కుమార్, సీపీఐ(ఎం) నాయకులు రమేష్, శ్రీకాంత్, రైతు సంఘం నాయకులు మార్తాల చందర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వరంగల్, హన్మకొండ, మామునూరు ఏసీపీలు, పలువురు సీఐలు, ఎస్సైలతో పాటు సుమారు 300 మంది పోలీసులు మార్కెట్‌కు చేరుకొని బందోబస్తు నిర్వహించారు.

రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా

బానోతు రవి మృతి విషయం తెలియగానే పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎంజీఎం ఆస్పత్రిలో మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి ప్రభుత్వం తరపున రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియాను కుటుంబ సభ్యులకు అందజేశారు.

మిర్చి ధర ధమాల్

ఖమ్మం మార్కెట్‌లో మిర్చి ధర భారీగా పతనమైంది. నాలుగురోజుల వ్యవధిలోనే సుమారు రూ.13.80కోట్ల మేర రైతులు నష్టపోయారు. వరుస్ ౼ తివులకు ముందు క్వింటా రూ.11,275 ఉన్న ధర సెలవుల అనంతరం మార్కెట్‌కు సరుకు భారీగా రావడంతో వ్యాపారులు ధర తగ్గించేశారు. ఈ నెల 5నుంచి రోజుకు సగటున 45వేల బస్తాల చొప్పున మార్కెట్‌కు వస్తోంది. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు సిండికేట్‌గామారి ధర తగ్గించారు. ఇదేమని ప్రశ్నిస్తే పొరుగు రాష్ట్రాల్లో మిర్చికి డిమాండ్ లేదని సాకు చెబుతూ రైతును నిలువునా ముంచేస్తున్నారు. ఖమ్మం మార్కెట్‌లో మరోమారు రైతు దోపిడీకి గురవుతున్న వైనంపై

ఖమ్మం మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలం

- నాలుగు రోజుల్లో రూ.13.80కోట్ల నష్టం
- అదును చూసి ధర తగ్గిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

జనవరి 24న ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సుమారు 3200 బస్తాల మిర్చి అమ్మకానికి రాగా క్వింటా ధర రూ.11,275 పలికింది. సగటున రూ.10,700, కనిష్ట ధర రూ.8500 పలికింది. ధర ఎక్కువుందని మరుసటి రోజు రైతులు నాలుగువేల బస్తాల పంట తెచ్చారు. వ్యాపారులు, దళారులు పథకం పన్ని క్వింటాకు రూ.175 తగ్గించారు. పదిరోజుల తర్వాత మార్కెట్‌కు సుమారు 45వేల బస్తాలు ఒకేసారి అమ్మకానికి రావడంతో ఇదే అదునుగా భావించి క్వింటాకు రూ.2300 వరకు తగ్గించారు. ఫిబ్రవరి 8వ తేదీన మిర్చి క్వింటా అత్యధిక ధర రూ.9900 కాగా సగటు రూ.9400, కనిష్టం రూ.7400లే ఉంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సరుకు ఎక్కువగా వచ్చినప్పుడల్లా వ్యాపారులు సిండికేట్‌గా మారి దోచుకోవడం నిత్యకత్యమైంది. ప్రస్తుతం ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఏపీ రాష్ట్రంలోని కష్ణా జిల్లాల నుంచి సుమారు 60వేల బస్తాలు విక్రయానికి వస్తోంది. యార్డులో స్థలం సరిపోక మరోయార్డుకు తరలిస్తున్నారు.

డిమాండ్ లేకనే ధర తగ్గింది



నాలుగు రోజులుగా రోజుకు 45వేల బస్తాల పైచిలుకు బస్తాల మిర్చి మార్కెట్‌కు వస్తోంది. దీనికి తోడు బయట రాష్ట్రాలు, దేశాల్లో మిర్చికి డిమాండ్ తగ్గింది. అందుకే ధర అమాంతం పడిపోయింది. బయట డిమాండ్ ఉంటేనే మిర్చికి ధర అధికంగా ఉంటుంది.

- ఆర్.సంతోష్‌కుమార్-జిల్లా మార్కెటింగ్ అధికారి

మిర్చి ధర రోజురోజుకూ పతనం అయిన తీరు ఇలా ఉంది...

తేదీ	అత్యధిక ధర	సగటు ధర	కనిష్టధర
24 జనవరి	11,275	10,700	8500
25	11,100	9,700	8200
29	11,000	10,100	8,200
30	10,800	10,000	8,400
31	10,600	10,000	8,000
05ఫిబ్రవరి	10,125	9,700	8,000
06	9,900	9,500	7,300
07	9,900	9,500	7,200
08	9,900	9,400	7,400

అన్ని సమస్యలూ అన్నదాత నెత్తినే..

చేయి తడపనిదే పని చేయడం లేదు..
- ప్రజాధనంతోనే ఉచిత కరెంట్
- టీఎస్ఎన్‌పీడీసీఎల్ బహిరంగ విచారణలో రైతుల ఆగ్రహం

నవతెలంగాణ-కామారెడ్డి

"అన్ని సమస్యలను రైతు నెత్తినే పెడుతున్నారు.. చేయి తడపనిదే పని చేయడం లేదు.. ప్రజాధనంతోనే ఉచిత కరెంటిస్తూ.. ప్రగల్బాలు పలుకుతున్నారు" అని ఉమ్మడి ఐదు జిల్లాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం కామారెడ్డి మండలం దేవునిపల్లి గ్రామం లక్ష్మీదేవి గార్డెన్‌లో బహిరంగ విచారణ నిర్వహించారు. నార్తర్న్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ 2018-19 ఆర్థిక సంవత్సరానికిగానూ ప్రతిపాదించిన వార్షిక ఆదాయ ఆవశ్యకతపై రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ చార్జి, అదనపు సర్‌ఛార్జీలపై చర్చించారు. ఉమ్మడి జిల్లాలైన నిజామాబాద్, వరంగల్, ఆది లాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాలకు చెందిన టీఎస్ ఎన్‌పీ డీసీఎల్ ఉద్యోగులు, టీఎస్ఈఆర్‌సీ చైర్మన్ ఇస్మాయిల్ అలీఖాన్, సభ్యులు శ్రీనివాసుల ఆధ్వర్యంలో ఈ విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయ కులు మాట్లా డుతూ.. విద్యుత్ శాఖలో పనిచేసే ఉద్యోగుల జీతం లక్షల్లో ఉంటోం దని, రైతు పదెకరాలను ఏడాది పొడవునా సాగుచేస్తే మిగిలేది రూ.2 లక్షలు కూడా ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు.



ట్రాన్స్‌ఫా ర్మర్ల కోసం అర్జీ మొదలు స్థాపించే వరకు రైతు బాధ్యతగానే ఉందని, కనెక్షన్ ఇచ్చే సమయంలోనూ డబ్బులు తీసుకోనిదే ఉద్యోగులు పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నామని టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని, ఆ బిల్లులు కడుతున్నది ప్రజాధనం తోనేనని మర్చిపోతోందని అన్నారు. ప్రమాద వశాత్తు రైతు మృతిచెం దినా పరిహారం అందకుండా బాధిత కుటుంబాలకు అన్యాయం జరుగుతో ందన్నారు. సిరిసిల్ల సెస్ సభ్యుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్‌రావు మాట్లాడుతూ... రైతులు డీడీ చెల్లించినా కనెక్షన్లు ఇవ్వడం లేదని, మరికొన్నిచోట్ల డీడీ డబ్బులను పాలక సభ్యులే తీసుకుని కనెక్షన్లు ఇచ్చి నడుపుకుంటున్నారని విమర్శిం చారు. 'ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంట్ ఇస్తే చాలు. భూగర్భ జలాలు పడిపోతున్నాయి. మా గ్రామంలో 20 ఏండ్లుగా ఒకే ట్రాన్స్‌ఫార్మ ర్‌తో సరఫరా చేస్తున్నారు' అంటూ నిజామాబాద్‌కు చెందిన రైతు పచ్చపల్లి నారాయణరెడ్డి వాపోయా డు. అనంతరం టీఎస్ఈఆర్‌సీ చైర్మెన్ ఇస్మాయిల్ అలీఖాన్ మాట్లాడుతూ... సేవలు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం మీ సేవాలో దరఖాస్తు చేసుకోవాలని, అర్జీ రిజిస్ట్రేషన్ నుంచి అన్ని దశల సమాచారం అందిస్తున్నామని తెలిపారు. టోల్‌ఫ్రీ నెంబరు 18004250028, 1992 ద్వారా ఫిర్యాదు చేయొచ్చునన్నారు.

తీసుకునే ఆహారం సక్రమంగా జీర్ణమై.. శక్తిగా మారినప్పుడే మన బతుకుబండి సాఫీగా నడుస్తుంది. లేదంటే స్పీడ్‌బ్రేకర్లమాదిరిగా అనేక అనారోగ్య సమస్యలు అడుగడుగునా అవాంతరాలను కలిగిస్తాయి. ఆహారం శక్తిగా మారడానికి మన శరీరంలో ప్రధానపాత్రను పోషించే జీర్ణవ్యవస్థలో లోపాలు రాకుండా ముందుగా జాగ్రత్తలు తీసుకుంటే చాలావరకు అనారోగ్యసమస్యల నుంచి తప్పించుకోవచ్చు. జీర్ణ వ్యవస్థ మన శరీరంలో ప్రధాన పాత్రను పోషిస్తుంది, ఇది లేకపోతే మన శరీరం సరిగా పనిచేయదు. జీర్ణ వ్యవస్థకు సంబంధించిన ఎటువంటి సమస్య అయినా అంతర్గతంగా, బహిర్గతంగా రెండు విధాలా ఎంతో అసౌకర్యాన్ని కలిగిస్తుంది. కారణంగా శరీరం రోగాలకు నిలయంగా మారుతుంది.



మనం తీసుకునే ఆహారం నుండి శరీర కణాలకు కావల్సిన పోషకాలను తీసుకుని.. శరీరం నుండి వ్యర్థాలను బయటకు పంపించడమే జీర్ణవ్యవస్థ ప్రధాన విధి. ఇందులో మార్పులు వస్తే.. అవి శరీరంలోని అన్ని కణాలపై ప్రభావం చూపిస్తాయి.

అజీర్తి, గుండెల్లో మంట, మలబద్ధకం లాంటివి సాధారణంగా కనిపించే సమస్యలు. వీటిని నిర్లక్ష్యం చేస్తే.. కడుపులో పూత, పేగువాపు వ్యాధి, లాక్టోజ్ పడకపోవడం, బోవెల్ సిండ్రోమ్ వంటివి జీర్ణవ్యవస్థకు సంబంధించిన లోపాలు తలెత్తుతాయి. వీటికి అనుబంధంగా మరిన్ని అనారోగ్య సమస్యలు శరీరంపై దాడి చేస్తాయి.

జీర్ణక్రియ అందరిలో ఒకేమాదిరిగా ఉండదు. అందేవిధంగా ఒకవ్యక్తి లోనిజీర్ణ లోపాలకు కారణాలకు మరో వ్యక్తిలోనిజీర్ణ లోపాలకు కార ణాలకు వ్యత్యాసాలు ఉంటాయి. మనిషిమనిషికీ ఇవి మారుతుం టాయి. అయితే, ఆహారం సరిగా తీసుకోకపోవడం(పోషకాహార లోపం), సరైన పరిశు భ్రత లేకపోవడం(వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రత) వ్యాయామం చేయకపోవడం, వ్యసనాలు (ధూమపానం, ఆల్కాహాల్ తాగడం), మానసిక వత్తిడి, నిద్రలేమి వంటి కారణాలతో జీర్ణక్రియలో అనేక లోపాలు వస్తాయి. ఇవి ఇతర అనారోగ్య సమస్యలకు కారణమవుతాయి.

చాలామంది జీర్ణక్రియకు సంబంధించిన సమస్యలు రాగానే ఆసుపత్రుల చుట్టూ తిరిగి.. చిన్న సమస్యలకు కూడా హైడోస్ మందులు వేసుకుని సమస్యను మరింత పెద్దది చేస్తారు. ఎక్కువగా మందులు వేసుకోవడంతో జీర్ణప్రక్రియతో పాటు కిడ్నీల పనితీరుపై ప్రభావం చూపిస్తాయి.

జీర్ణ వ్యవస్థలోని చిన్నచిన్న లోపాలకు ఇంట్లో లభించే వాటితో తేలికగా చికిత్స చేసుకోవచ్చు. వీటితో సైడ్‌ఎఫెక్ట్స్ ఉండవు.

మెరుగైన జీర్ణక్రియకోసం..!



అల్లం : జీర్ణవ్యవస్థను మెరుగుపర చడం లో అల్లం ఎంతో ఉపయోగపడుతుంది. జీర్ణక్రియకు సంబంధించిన లోపాలను నిరోధిస్తుంది. మనం తీసుకునే ఆహారం లో చిన్న అల్లం ముక్క, కొద్దిగా అల్లం రసం చేర్చితే చాలు. ఇది జీర్ణ రసాలకు ప్రేరణ కలిగించి తీసు కున్న ఆహారం తేలికగా జీర్ణం కావడా నికి అవసరమైన ఎంజైమ్‌లు ఉత్పత్తి చేయడంలో దోహదపడుతుంది.

పుదీనా : చిన్నకుండీల్లోనూ ఏపుగా పెరిగే పుదీనా మనందరికీ తెలుసు. జీర్ణ ప్రక్రియను ఎంతో ప్రభావితం చేసే గుణాలు పుదీనాలో పుష్కలంగా ఉన్నాయి. జీర్ణ వ్యవస్థకు సంబం ధించిన సమస్యల చికిత్సలో కూడా పుదీనా బాగా పనిచేస్తుంది. ఇందులో ఉండే యాంటీ-ఇన్ఫమేటరీ లక్షణాలు పొట్ట ఉబ్బరం తగ్గిస్తాయి. వాంతులు, కడుపులో వికారం వంటి సమస్యలను నివారించడానికి పుదీనా ఎంతో ఉపయోగ పడుతుంది.

సోంపు : ప్రతి ఇంట్లోని వంటగది లో సోంపు ఉంటుంది. సోంపు గింజలు ఆహారం త్వరగా జీర్ణం కావడానికి అవ సరమైన ఎంజైమ్స్ ను ప్రేరే పిస్తాయి. గుండెల్లో మంట, అజీర్తి, అసిడిటీ వంటి సమస్యతో బాధపడేవారు భోజనం తర్వాత అర స్పూన్ సోంపు తింటే మంచి ఫలితం ఉంటుంది.

కలబంద: మలబద్ధకాన్ని నివారించే లక్షణం ఉన్న కలబంద జీర్ణ వ్యవస్థ పనితీ రును మెరుగు పరచడానికి సహాయపడుతుంది. కలబందలో ఉండే రసాయనాలు అల్సర్ తోసహా అనేక జీర్ణ సమస్యల చికిత్సలో ఎంతో ఉపయోగ పడుతాయి. రోజూ ఉదయం ఒక స్పూన్ కలబంద గుజ్జును తింటే జీర్ణక్రియకు సంబంధించిన అనేక సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.

ఇంగువ : తెలుగువారి వంటింటి పోపుడబ్బలో తప్పక ఉండే ఇంగువ వంటకాలకు మంచి వాసనతో పాటు ఆహారం జీర్ణం కావడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే యాంటీ-ఇన్ఫమేటరీ, యాంటీ-ఆక్సిడెంట్, యాంటీ-ఫ్లాటులెంట్ లక్షణాలు కడుపు నొప్పి, కలుషిత ఆహారం తీసుకోవడంతో వచ్చే ఇబ్బందులను నివారిస్తాయి.

యాలకులు(ఇలాచీ) : మారిన జీవనవిధానంతో ఇంట్లో కన్నా బయట స్పైసీ ఫుడ్స్, జంక్ ఫుడ్స్ తినడం పెరిగింది. వీటి వల్ల జీర్ణకోశంలో ఆమ్లాల గాఢత పెరుగుతుంది. ఈ కారణంగా గ్యాస్ , ఎసిడిటి వంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయి. వీటిని నివారించే లక్షణాలు యాల కులలో ఎక్కువగా ఉన్నాయి. భోజనం చేసిన తర్వాత యాలకులతో తయారు చేసిన టీ తాగడం వల్ల జీర్ణశక్తి మెరుగు పడుతుంది, పొట్టలో యాసిడ్స్ క్రమబద్ధం అవుతాయి.

వీటితో పాటు ధనియాలు, జీల్లకర, వాము వంటి ఆహారపదార్థాలు జీర్ణక్రియను మెరుగుపరచడంతో ఎంతో ఉపయోగపడుతాయి.

* *

వండర్ చాయ్..

పాయసం, లడ్డు వంటి స్వీట్స్ చేయాలన్నా, పులావ్, బిర్యానీ వంటి స్పైసీ ఫుడ్ వండాలన్నా యాలకులను తప్పనిసరిగా వాడుతారు. యాలకుల్లో ఉండే అద్భుతమైన ఆరోమా వాసన వల్లే దినుసులన్నింటిలోకి దీన్ని 'క్వీన్ ఆఫ్ స్పైసెస్ ' అని పిలుస్తారు. అమోఘమైన రుచితో పాటు స్వీట్ ఫ్లేవర్ ను కలిగి ఉండే యాలకులతో చేసే టీని వండర్ చాయ్ అంటారు.

యాలకులలోని విత్తనాలు పొడి చేసి నీళ్ళలో వేసి మరిగిస్తే అద్భుతమైన ఫ్లేవర్ వస్తుంది. దీనితో తయారుచేసిన టీ మన దేశంలో చాలా ఫేమస్, ప్రపంచంలో మిలియన్ల మంది ఇలాచీ చాయ్ కి దాసోహం అవుతున్నారు. హైబ్లడ్ ప్రెజర్, వ్యాధినిరోధకత బలహీనంగా ఉన్నవారు, శ్వాసనాళ ఇన్ఫెక్షన్స్ తో బాధపడే వారు, ఐరన్ లోపం ఉన్నవారు, అధిక బరువుతో బాధపడేవారు, అజీర్తి సమస్య ఉన్నవారు యాలకులతో తయారుచేసిన టీ తాగితే ఆరోగ్యం పరంగా ఎంతో మేలు చేస్తుంది. ఇందులో వివిధ రకాల విటమిన్లు, మెటబాలిజం పెంచి శరీరాన్ని మరింత ఎఫెక్టివ్ గా ఉంచుతుంది. ఈ వండర్ చాయ్ ఆరోగ్య ప్రయోజనాలు.

దంతాలకు రక్షణ..

ఇలాచీలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఎక్కువ. ఇవి డెంటల్ బ్యాక్టీరియాను న్యూట్రలైజ్ చేస్తుంది. భోజనం చేసిన వెంటనే ఒక కప్పు యాలకల టీ తాగడం వల్ల బ్యాడ్ బ్రీత్ తగ్గుతుంది, గొంతు తడి ఆరిపోవడం వంటి సమస్యలుండవు. దంతాలకు యాలకుల టీ రక్షణనిస్తుంది. పవర్ ఫుల్ ఫ్యాగ్రెన్స్ వల్ల నోట్లో ఒక పూతలాగే కొన్ని గంటల పాటు ఉంటుంది. ఇది దంతాలను తెల్లగా మార్చుతుంది.

గొంతు నొప్పి..

దగ్గు, జలుబు వంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఒక కప్పు ఇలాచీ చాయ్ తాగడం వల్ల గొంతు నొప్పి, దగ్గు, ముక్కు దిబ్బడ నుండి ఉపశమనం కలుగుతుంది. ముక్కులో మ్యూకస్ తొలగించి శ్వాసనాళం క్లియర్ చేస్తుంది. శ్వాస తీసుకోవడంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయి.

కాలిన గాయాలను..

ఇలాచీటీలో అనేక యాంటీబ్యాక్టీరియల్ గుణాలున్నాయి. ఇది గ్రేట్ ఆస్ట్రిజెంట్, అంతర్గతంగానే కాదు, బహిర్గతంగా కూడా ఇది గాయాలను మాన్పుతుంది. కాలిన గాయలను మాన్పుతుంది. యాలకల టీ తాగడం వల్ల చిన్న చిన్న గాయాలు త్వరగా మానుతాయి. డ్యామేజ్ అయిన సెల్స్ ను తొలగిస్తుంది. యాలకల టీలో ఉన్న అనేక యాంటీఆక్సిడెంట్ శరీరంలో ఫ్రీరాడికల్స్ ను తొలగించడానికి సహాయపడుతుంది.



చర్మకాంతికి..

రోజుకు ఒకటి , రెండు కప్పుల యాలకుల టీ తాగడం వల్ల శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడుతుంది. చర్మ కాంతి పెరుగుతుంది. శరీరంలోని ఇతర ఆర్గాన్స్ సక్రమంగా పనిచేయడానికి, వాటి పనితీరును మెయింటైన్ చేయడానికి సహాయపడుతుంది. యాలకుల్లో ఉండే ఐరన్ కంటెంట్ ఎర్రరక్త కణాలను పెంచి, మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రక్తప్రసరణ సాఫీగా సాగడం వల్ల గుండె సంబంధమైన సమస్యలు తక్కువగా వస్తాయి. రక్తనాళాల్లో అడ్డంకులు తొలగించి హార్ట్ అటాక్ నుండి ఉపశమనం కలిగిస్తుంది.

టెన్షన్ తగ్గుతుంది..

యాలకులతో తయారుచేసిన టీ తాగడం వల్ల హైపర్ టెన్షన్ తగ్గుతుంది. యాలకుల్లో ఉండే హైలెవల్ పొటాషియం హైబ్లడ్ ప్రెజర్‌తో బాధపడే పేషంట్స్‌కు ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. స్ట్రెయిన్ తగ్గించే గుణం పొటాషియంకు ఉంది. తలనొప్పి ఎక్కువగా బాధిస్తుంటే, ఒక కప్పు ఇలాచీ టీ తాగితే చాలు. మెడ కండరాలను రిలాక్స్ చేసి తలనొప్పి నుండి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది.

వ్యర్థాలను తొలగించేలా..

వ్యాధినిరోధకత పెంచే గుణాలు ఇలాచీలో ఎన్నో ఉన్నాయి. వ్యాధులకు దూరంగా ఉండాలంటే ముందుగా శరీరం శుభ్రంగా ఉండాలి. శరీరంలో వ్యర్థాలను పూర్తిగా తొలగించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. శరీరాన్ని శుభ్రపరచడంలో ఇలాచీ చాయ్ చాలా బాగా పనిచేస్తుంది. ఇందులో ఉండే డిటాక్సిఫైయింగ్ ఏజెంట్ కాలేయం పనితీరును క్రమబద్ధం చేస్తుంది. టాక్సిన్స్ ను తొలగిస్తుంది.

రక్తపోటు ఇంట్లోనే చెక్‌చేసుకోండి



రోజంతా మన శరీరంలో రక్తపోటు వివిధ రకాలుగా మారుతూ ఉంటుంది. నెలకో, ఆరునెలలకో ఒకసారి బీపీ చూపించుకుని మన రక్తపోటు ఎప్పుడూ అలానే స్థిరంగా ఉంటుందని అనుకుంటాం. అయితే మనం ఆసుపత్రికి వెళ్లి , డాక్టర్ దగ్గరకు వెళ్లి బీపీ చూపించుకుని, అప్పుడు చూపించి రక్తపోటును చూసి అదే మన బీపీ అనుకోటానికి లేదు. ఎంతో దూరం ప్రయాణం చేసి ఆదరాబాదరా.. ఎంతో ఒత్తిడితో డాక్టర్ దగ్గరకు వెళ్తే ఆ ప్రభావం కూడా మన బీపీపై పడుతుంది. బీపీ గంటగంటకు, ఆ మాటకొస్తే నిమిష నిమిషానికి మార్పులకు లోనవుతూ ఉంటుంది. అలాగే మనం బీపీ నమోదు చేసుకునే సమయంలో ఉండే పరిస్థితులు కూడా బీపీ నమోదుల్లో తేడా చూపిస్తాయి అంటున్నారు వైద్యనిపుణులు.

కొందరికి వైద్యుల వద్దకు వెళ్లినప్పుడు కొంత మానసిక ఆందోళన ఉంటుంది. దీనివల్లా బీపీ పెరుగుతుంది. దీన్నే 'వైట్‌కోట్ హైపర్‌టెన్షన్' అంటారు. దీనివల్ల వాస్తవంగా బీపీ లేకపోయినా ఉందని ఆందోళన చెందేవారు 20శాతం వరకూ ఉంటున్నారని గుర్తించారు. అందుకని ఎవరికి వారు బీపీ చూడటం నేర్చు కుంటే.. రోజులో పలుమార్లు, వివిధ సందరాల్లో ఇంటివద్దనే ప్రశాంతంగా బీపీ చూసుకుని దాని స్థాయులను కచ్చితంగా నిర్ధారించుకునే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు నిపుణులు!

'సామర్థ్యం' పెంచే సైక్లింగ్..

లైంగిక సమస్యలతో బాధపడుతున్నవారికి శాన్‌ఫ్రాన్సిస్కోలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు మంచి వార్త చెపుతున్నారు. జీవనవిధానంలో మార్పుల కారణంగా లైంగిక సమస్యలతో బాధపడుతున్న వారు ఇకపై బెంగపడాల్సిన పనిలేదంటున్నారు . ఎంతో మంది జీవనశైలిలో వస్తున్న మార్పులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలు సైకిల్ తొక్కడం వల్ల సెక్స్ సామర్థ్యం మెరుగుపడు తుందని సూచిస్తున్నారు. సైకిల్ తొక్కే అలవాటు ఉన్న వారికి లైంగిక సమస్యలు వస్తాయనేది అపోహేనని వారంటున్నారు. స్విమ్మింగ్, రన్నింగ్ చేసే వారితో పోలిస్తే సైక్లింగ్ చేసేవారికి లైంగిక పటుత్వం ఎక్కువగా ఉంటున్నట్టు వెల్లడించారు. కార్డియోవాస్క్యులర్ లాభాలతోపాటు కీళ్ల సమస్యలు కూడా సైక్లింగ్ ద్వారా తగ్గుతాయని, కండరాల పటుత్వానికి సైక్లింగ్ ఎంతో మేలు చేస్తుందని పరిశోధకులు సూచిస్తున్నారు.

పిల్లలు పక్క తడిపితే..!

కాస్త వయసు వచ్చేసరికి పిల్లలకు మల,మూత్రవిసర్జన గురించి కాస్త అవగాహన వస్తుంది. పక్క తడిస్తే ఏడుస్తారు. మరి కొంతమంది పిల్లలు పెద్దయ్యాక కూడా పక్క తడుపుతుంటారు. ఊహ తెలిసిన తర్వాత కూడా నిద్రల్లో పక్క తడిపేవారు ఉదయం నిద్రలేవగానే సిగ్గుతో మూలన దాక్కుంటారు. ఈ చిన్నారులను దారిలోకి తేవాలని చాలా మంది పెద్దవారు క్రమశిక్షణ పేరుతో కఠిన చర్యలు తీసుకుంటారు. దీంతో సమస్య పెరుగుతుంది. ఎంత చెప్పినా అర్థం కాదా.. పక్క తడుపుతావా అంటూ దండించే ప్రయత్నాలు చేస్తారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. కొంతమంది పక్క తడుపుతూనే ఉంటారు. వారి ప్రమేయం లేకుండా జరుగుతున్న ఈ అలవాటు కారణంగా.. మానసిక ఒత్తిడికి లోనవుతారు. పిల్లల్లో పక్క తడిపే అలవాటుకు కారణాలు తెలుసుకుంటే చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను తిట్టడం, దండించడం మానేస్తారేమో..!

సాధారణంగా ఏడాది లోపు చిన్నారులకు మూత్రం ఆపుకోవటం తెలియదు. ఎప్పు డంటే అప్పుడు మూత్రం పోసేస్తుం టారు. వయసు పెరుగుతున్న కొద్దీ మూత్రాశయాన్ని నియంత్రించే నాడుల వ్యవస్థ పరిపక్వం చెందుతుంది. మూత్రం బట్టల్లో పోసుకోవద్దని, బాత్‌రూమ్‌లోకి వెళ్లాలని తెలుస్తుంది. సాధారణంగా ఐదేండ్లు వచ్చేసరికి పక్క తడపటమనేది దాదాపుగా తగ్గి పోతుంది. రాత్రిపూట పక్క తడపటం పూర్తిగా మానేస్తారు. కానీ కొంతమంది పిల్లలు మాత్రం వయసు పెరుగతున్నా.. పక్క తడిపే అలవాటు మాత్రం మానలేకపోతారు. ఇందుకు అనేక కారణాలున్నాయి.

- పిల్లలు రాత్రంతా మూత్రం ఆపుకోలేకపోవటం
- మూత్రాశయం నిండినా మెలకువ రాకపోవటం,
- రాత్రివేళ మూత్రం ఎక్కువగా తయారు కావడం.
- పగలంతా ఆటల్లో పడి మూత్ర విసర్జన చేయడక పోవడం.

ఇవి చాలా సాధారణ అంశాలు. ఇవి కాకుండా మరిన్ని అంశాలు కూడా పిల్లలు పక్క తడపడానికి కారణం అవుతాయి.



- అధిక బరువు
- మూత్రనాళ ఇన్‌ఫెక్షన్
- మలబద్ధకం
- నిద్రించే సమయంలో శ్వాస తీసుకోవడం ఇబ్బందులు
- మధుమేహం,
- నాడీవ్యవస్థలో లోపాలు

ఇలాంటి కారణాలు కూడా ఉండవచ్చు. ఐదు నుంచి ఏడేండ్లు నిండిన తర్వాత కూడా మీ పిల్లలు పక్క తడుపుతుంటే వారిని చిన్నబుచ్చకండి. సమస్య ఏంటో తెలుసుకుని పిల్లలను అర్థం చేసుకోండి.

చేతులు కడిగితే..జబ్బులు దూరం!

చేతులు శుభ్రంగా కడుక్కోవటం ద్వారా ఏడాదికి యాభై లక్షల మరణాలను నివారించ వచ్చని ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇటీవల ఒక నివేదికను విడుదల చేసింది. చేతులు శుభ్రంగా ఉంచుకోకపోతే చనిపోతారా అన్న అనుమానం వస్తుంది కదూ! నిజమే.. మన చేతులు శుభ్రంగా ఉంచుకుంటే ఎన్నో రకాల రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. ఎందుకంటే మన చుట్టూ ఉండే రకరకాల సూక్ష్మక్రిములు చేతుల ద్వారానే మన శరీరంలోకి ప్రవేశిస్తాయి. రోజు ఇంట్లో.. బయట ఎక్కడెక్కడో మనం చేతులు పెట్టి.. ఆ తర్వాత ఆ చేతులతో తినడం, ఇంట్లో వస్తువులను ముట్టుకోవడం వంటివి చేస్తాం. దీంతో సూక్ష్మజీవులు మనపై దాడి చేసి అనేక రకాల వ్యాధులను.. క్షయ వంటి ప్రాణాంతక వ్యాధులు రావడానికి కారణం అవుతాయి. కేవలం భోజనం చేసే ముందు మాత్రమే చేతులు శుభ్రంగా కడుక్కుంటాం. అలా కాకుండా తరచుగా చేతులు కడుక్కుంటే అనేక అనారోగ్య సమస్యలు దూరం అవుతాయి.

వ్యాధి కారక క్రిములు ఒకరి నుంచి మరొకరికి వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.

ముగ్గురిలో ఒకరు మాత్రమే..

చేతులను శుభ్రంగా ఉంచుకోవాలన్న అవగాహన చాలా మందికి లేదు. నిరక్షరాస్యులే కాదు.. బాగా చదువుకున్న వారు సైతం చేతుల పరిశుభ్రత గురించి పట్టించుకోవడం లేదు. కేవలం ముగ్గురిలో ఒకరు మాత్రమే తుమ్మిన, దగ్గిన ప్రతిసారీ చేతులను కడుక్కుంటున్నారు. అంతేకాదు చేతులు కడుక్కునే ప్రతి ఐదుగురి వ్యక్తుల్లో ముగ్గురు సబ్బు, హ్యాండ్ వాష్ వంటివి వాడకుండానే.. కేవలం నీళ్లతో చేతులు కడుక్కుంటున్నారు. హ్యాండ్ వాష్ వాడితేనే చేతులపై ఉన్న సూక్ష్మజీవులను చాలావరకు నియంత్రించవచ్చు.



కరెన్సీని ముట్టుకున్న తర్వాత చేతులను కడుక్కునేవారు పాతిక శాతం మందే. ఈ 25శాతం మందిలోనూ 95శాతం మంది చేతులను శుభ్రం చేసుకోవటం లేదని అధ్యయనాలు పేర్కొంటున్నాయి.

ఏటా 18 లక్షల చిన్నారులు..

ఐదేండ్ల లోపు చిన్నారుల్లో వచ్చే విరేచనాలు, న్యుమోనియా జబ్బుల కారణంగా ఏటా సుమారు 18 లక్షల మంది చనిపోతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. కేవలం సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవడమే అవగాహన వారిలో పెంచి.. చేతులు కడుక్కోవడం అలవాటు చేస్తే ప్రతి ముగ్గురు పిల్లల్లో ఒకరిని విరేచనాల నుంచి.. ప్రతి ఐదుగురు పిల్లల్లో ఒకరిని న్యుమోనియా వంటి శ్వాసకోశ ఇన్‌పెక్షన్ల బారి నుంచి కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు.

చేతుల శుభ్రంగా కడుక్కోవడంతో విరేచనాల సమస్యలో బాధపడేవారి సంఖ్య 50శాతం తగ్గుతుంది.

అంతేకాదు..న్యుమోనియా, జలుబు వంటి శ్వాసకోశ వ్యాధుల బారిన పడే చిన్నారుల సంఖ్యను 20శాతం వరకు తగ్గించవచ్చు.

తుమ్మినా.. దగ్గినా..

భోజనం చేసే ముందు, మలమూత్ర విసర్జన తర్వాత చేతులు శుభ్రం చేసుకుంటే సరిపోతుంది అనుకుంటారు చాలా మంది. ఇది తప్పు.. అనేక అంటువ్యాధులకు కారణమయ్యే సూక్ష్మజీవుల వ్యాప్తిని అరికట్టాలంటే తరచుగా చేతులు కడుక్కోవాలి. అయితే ఎప్పుడు..ఏ పనులకు ముందు తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలని అన్న విషయంపై అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా పిల్లలకు హ్యాండ్ వాష్‌పై అవగాహన పెంచాలి. శుభ్రతను పాటించడంతో చాలా అనారోగ్య సమస్యలు నివారించవచ్చు.

- వంట చేసే ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడుక్కోవాలి.
- దగ్గినపుడు, తుమ్మినా నోటికి చేతులు అడ్డం పెట్టుకుంటారు. ఆ తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.
- అనారోగ్య సమస్యలతో, అంటురోగాలతో బాధపడుతున్నవారికి సేవ చేసే ముందు, ఆహారం ఇచ్చే ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడుక్కోవాలి.
- ఇంట్లో చిన్నపిల్లలు, ముసలివారు ఉంటే మరింత జాగ్రత్తగా ఉండాలి. వారికి డైపర్లను మార్చిన తర్వాత, వారి మలమూత్రాలు శుభ్రం చేసిన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి.
- పెంపుడు జంతువులకు ఆహారం పెట్టేముందు.. వాటిని ముట్టుకున్న తర్వాత కూడా తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలి.
- గార్డెనింగ్ చేసిన తర్వాత, ఇల్లు ఊడ్చిన తర్వాత కూడా చేతులు శుభ్రం చేసుకోవాలి. తరుచుగా చేతులు శుభ్రం చేసుకోవడం వల్ల పరిశుభ్రమైన వాతావరణం ఇంట్లో ఏర్పచ్చుకోవాలి.

హైదరాబాద్ ఓటమి

- 237 పరుగుల భారీ తేడాతో విదర్భ విజయం
- విజయ్ హజారే ట్రోఫీ

హైదరబాద్ : అంబటి రాయుడు సేన విఫలమైంది. విజయ్ హజారే ట్రోఫ తొలి రెండు మ్యాచుల్లో సమిష్టిగా రాణించిన హైదరాబాద్ జట్టు గురువారం విదర్భతో జరిగిన మ్యాచ్‌లో సమిష్టి చెత్త ప్రదర్శనతో తొలి ఓటమి మూటగట్టుకున్నది. రోహిత్ రాయుడు (3), అంబటి రాయుడు (21) సహా మిగిలిన బ్యాట్స్‌మెన్ అంతా స్వల్ప స్కోరుకే వెనుదిరగటంతో 113 పరుగులకే ఛేదనలో ఆలౌట్ అయింది. తొలుత బ్యాటింగ్ చేసిన విదర్భ జట్టు నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 350 పరుగులు చేసింది. ఫైజ్ ఫజల్ (103) సెంచరీకి మిగతా బ్యాట్స్‌మెన్ చక్కటి సహకారం అందించగా.. హైదరాబాద్ బౌలర్లు వికెట్లు కూల్చడానికి చెమటోడ్చారు.

క్వార్టర్స్‌లో భారత్

- ఆఖరు గ్రూప్ పోరుల్లో ఓటమి
- ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్


సింధు

న్యూఢిల్లీ : ఆఖరు గ్రూప్ పోరుల్లో భారత పురుష, మహిళా షట్లర్ల జట్లు ఓటమి పాలయ్యాయి. అయినా తమ తమ గ్రూప్‌లలో రెండో స్థానంలో నిలిచిన కిదాంబి, సింధుల సేనలు క్వార్టర్స్‌కు అర్హత సాధించాయి. ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో సెమీస్ బెర్త్ కోసం సింధు నేతృత్వంలోని భారత మహిళా షట్లర్ల బృందం.. నేడు ఇండోనేషియాతో తలపడనున్నది.

గురువారం జరిగిన గ్రూప్ డబ్ల్యూ తొలి మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో తెలుగుతేజం పి.వి సింధు.. ప్రియ ప్రత్యర్థి అకానె యమగూచిపై వరుస సెట్లలో గెలుపొందింది. 21-19, 21-15తో ప్రపంచ నెంబర్ 2 క్రీడాకారిణి యమగూచిని ఓడించింది. భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించింది. అనంతరం జరిగిన మరో సింగిల్స్‌లో కుదరవల్లి శ్రీ కృష్ణ ప్రియ 12-21, 10-21తో సయాక సటో చేతిలో ఓడిపోయింది. డబుల్స్ స్టార్ అశ్విని పొన్నప్ప సైతం ఆఖరు సింగిల్స్ మ్యాచ్‌లో అయా ఓహోరి చేతిలో 14-21, 12-21తో పరాజయం పాలైంది. సంయోగిత, ప్రజక్తా సావంత్‌ల జోడీ సహా పొన్నప్ప, సిక్కి రెడ్డిల జోడీ డబుల్స్ పోరుల్లో గెలవలేదు. దీంతో భారత్‌పై 4-1తో జపాన్ పైచేయి సాధించింది.

అపజయమన్నదే ఎరుగకుండా తొలి రెండు టై మ్యాచులు నెగ్గిన కిదాంబి సేన.. ఆఖరు పోరులో తడబడింది. సూపర్ టైటిళ్ల వేటగాడు కిదాంబి నిరాశపరచటంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. గ్రూప్ డి తొలి సింగిల్స్ మ్యాచ్‌లో జోనాథన్ క్రిస్టీ 21-17, 21-17తో కిదాంబిని ఓడించాడు. అయితే భారత డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టిలు 18-21, 21-18, 24-22తో హోరాహోరీ మ్యాచ్‌లో ఇండోనేషియా జంటపై గెల్చి 1-1తో భారత్‌ను నిలిపారు. బి. సాయి ప్రణీత్ మరో సింగిల్స్‌లో 21-18, 21-19తో సంజయ సుకాముల్జోపై నెగ్గి భారత్‌కు 2-1 ఆధిక్యాన్నిచ్చాడు. అర్జున్, రామచంద్రన్‌ల రెండో డబుల్స్ జోడీ ఓటమితో బి సుమిత్ రెడ్డి మూడో సింగిల్స్ మ్యాచ్ నిర్ణాయకమైంది. కానీ సుమీత్ 12-21, 7-21తో ప్రత్యర్థికి మ్యాచ్ కోల్పోవటంతో భారత్ 2-3తో ఇండోనేషియా చేతిలో ఓడింది. గ్రూప్‌లో రెండో స్థానంలో ఉన్న భారత్ సెమీస్‌లో చోటు కోసం గ్రూప్ టాప్ జట్టు ఇండోనేషియాతో క్వార్టర్స్‌లో మరోసారి తలపడనున్నది.

మళ్లీ అదే కథ

- కజకిస్థాన్ చేతిలో 1-2తో భారత్ ఓటమి
- ఈసారి కూడా వరల్డ్ గ్రూప్ ఆశలు ఆవిరి


అంకిత

న్యూఢిల్లీ : స్టార్ టెన్నిస్ ప్లేయర్ అంకిత రైనా మొక్కవోని పట్టుదలతో గెలుపొందినా.. భారత్‌కు పరాజయం తప్పలేదు. ఫెడ్ కప్, ఆసియా/ఓసియానా గ్రూప్ 1 టైలో టీమ్ భారత్ 1-2తో కజకిస్థాన్ చేతిలో ఓడింది. గురువారం జరిగిన మూడు సెట్ల పోరులో 6-3, 1-6, 6-4తో అంకిత.. యులియా పుటింట్సెవాపై గెలుపొందింది. రెండు గంటల 25 నిమిషాలు సాగిన మ్యాచ్‌లో టాప్ 10 టెన్నిస్ క్రీడాకారిణీలను చిత్తు చేసిన యులియాను అంకిత మట్టి కరిపించింది. ఆరంభ సింగిల్స్ పోరులో కర్మన్ కౌర్ తాండి సైతం రాణించినా.. నిలకడ లేమితో ప్రపంచ 55వ ర్యాంకర్ జరీనా డియాస్ చేతిలో ఓటమి చవి చూసింది. డబుల్స్‌లో భారత్ మరోసారి పేలవ ప్రదర్శన చేసింది. అనిత, ప్రార్థన తొంబరేల జంట 0-6, 4-6తో డియాస్, పుటింట్సెవాల చేతిలో ఓడారు. గత కొద్ది రోజులుగా ప్రార్థన డబుల్స్‌లో రాణిస్తోన్నా.. ఫెడకప్ బరిలో మాత్రం ప్రభావశీల ఆటతీరు కనబరచలేదు. ఇక తాజా ఓటమితో ప్రపంచ గ్రూప్ ప్లే ఆఫ్‌కు భారత్ ఆశలు ఆవిరి అయ్యాయి. భారత్ పోటీలో లేకపోవటంతో పూల్ ఏ నుంచి చైనా, కజకిస్థాన్‌లలో ఏదేని ఒక జట్టు పూల్‌బి అగ్ర జట్టుతో ఏప్రిల్‌లో జరుగనున్న ప్లే ఆఫ్స్‌లో తలపడటానికి అర్హత సాధిస్తుంది.

తీక్షణతే సక్సెస్ మంత్ర

టీమ్ ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి

నవతెలంగాణ-కేప్‌టౌన్

అతడి బ్యాటింగ్ శైలి విలక్షణం. అతడి చూపు తీక్షణం. మైదానంలో దూకుడు, బ్యాట్ పడితే బాదుడు. అతడే పరుగుల యంత్రం, భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లి. గతేడాది అద్భుత ఫామ్‌తో ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచిన విరాట్.. తాజాగా దక్షిణాఫ్రికా పర్యటనలోనూ అదే ఫామ్ కొనసాగిస్తున్నాడు. మూడు మ్యాచుల్లో వరుసగా రెండు సెంచరీలు నమోదు చేశాడు. కేప్‌టౌన్‌లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో కెరీర్‌లో 34వ శతకం సాధించి, భారత్ విజయంలో ముఖ్య భూమిక వహించాడు. కేవలం సింగిల్స్, డబుల్స్ ద్వారానే తన 160 పరుగుల్లో 100 సాధించాడు. తన శారీరక దారుఢ్యం ఎంత బాగుందో చెప్పకనే చెప్పాడు. సఫారీలపై మూడో వన్డేలో విజయం సాధించిన తర్వాత మీడియాతో మాట్లాడిన కోహ్లి తీక్షణతే మైదానంలో తన మనుగడకు కారణమని తెలిపాడు. అదే లేకుంటే ఏమయ్యేవాడినో తనకూ తెలియదన్నాడు. కోహ్లి అంతరంగం అతని మాటల్లోనే..


కోహ్లి

'ఈ ఏడాది నాకు 30 ఏండ్లు నిండుతాయి. ఇప్పుడు ఆడినట్టే మరో నాలుగైదేండ్లు ఆడాలనుకుంటున్నా. అందుకే చాలా తీవ్రంగా కసరత్తులు చేస్తున్నా. తీక్షణతో ఆడటాన్ని ఇష్టపడే వ్యక్తిని నేను. ఆ తీక్షణత నా నుంచి పోతే మైదానంలో ఏం చేస్తానో నాకే తెలియదు. అందుకే నేనెప్పుడూ కసరత్తులు చేస్తూనే ఉంటా. ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తాను. ఇప్పుడు నా కసరత్తులే నాకు ఫలితాలను ఇస్తున్నాయి. జట్టుకు అవసరమైనప్పుడు మనం నిలబడాలి. ఒక ఆటగాడిగా ఇలాంటి రోజుల కోసం ఎదురుచూడాలి

అంతర్జాతీయ క్రికెట్‌లో పరుగులు చేయడం సులభమేమీ కాదు. ఎంతో కష్టపడితే గానీ పరుగుల చేయలేం. బ్యాటింగ్, ఫ్లాట్ పిచ్‌లపై సులభంగా పరుగులు చేయొచ్చేమో గానీ బౌన్స్, స్వింగ్ లభించే పిచ్‌లపై అదంత తేలిక కాదు. అలాంటి సందర్భాల్లో ముందుగా పరిస్థితులకు అలవాటు పడాలి. ఆపై పరుగులు సాధించటం సులభం అయ్యే అవకాశం ఉంటుంది. దక్షిణాఫ్రికాతో మూడో వన్డేలో 30వ ఓవర్ తర్వాత పిచ్ స్వభావం మారింది. అలాంటప్పుడు దానికి తగ్గట్టు శైలి మార్చుకోవాల్సి వచ్చింది. వరుసగా వికెట్లు కూలుతుంటే ఇన్నింగ్స్ నిలబెట్టగలిగా, దానికి కారణం ఆ పరిస్థితికి నేను త్వరగా అలవాటు పడటమే. నేను 90 పరుగుల వద్ద ఉన్నప్పుడు పిక్కలు పట్టుకున్నాయి. మరో పక్క వికెట్లు పడుతుండటం కలవరానికి గురి చేసింది. బలం లేకున్నా ఓపిక తెచ్చుకుని నిలకడగా ఆడాలని నిర్ణయించుకున్నా. మన గురించి కాకుండా జట్టు గురించి ఆలోచించినపుడే అద్భుతాలు జరుగుతాయి. పరిధికి మించి ఆడటానికి వీలవుతుంది. శరీరం ఆటోమేటిగ్గా సహకారం అందిస్తుంది. మ్యాచ్ సమయంలో నాకిది అనుభవమైంది. చెప్పాలంటే అదొక గొప్ప అనుభూతి.

బ్యాటింగ్‌కు దిగినపుడు.. పిచ్‌లో ఒకరు దూకుడుగా ఆడుతుంటే మరొకరు స్ట్రైక్ ఇవ్వాలి. తీవ్రంగా ఆడే బ్యాట్స్‌మెన్ ఔట్ అయితే ఆ స్థానం మనం తీసుకోవాలి మరొకరు స్ట్రైక్ బాధ్యత తీసుకుంటారు. అది ఉత్తమం. నేనలాగే చేశాను. ధావన్ దాటిగా ఆడుతుంటే నేను సింగిల్స్‌కు పరిమితమయ్యాను. స్ట్రైక్ రొటేట్ చేశాను. దాంతో పరుగుల సాధన కష్ట కాలేదు. ఛేదనలో బ్యాటింగ్ చేయడం చాలా కష్టం. ఎప్పుడు సింగిల్స్ తీయాలి, ఎప్పుడు దూకుడుగా ఆడాలని నిర్ణయించుకోవడం చాలా కష్టం. తొలుత బ్యాటింగ్ చేయాల్సి వస్తే వీలైనన్ని ఎక్కువ పరుగులు చేయాల్సి ఉంటుంది. కానీ అన్ని సార్లు పరిస్థితులు అనుకూలించవు.

వచ్చే ఏడాది యుజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్‌లు జట్టుకు మరింత బలాన్నిస్తారు. ఇద్దరు మణికట్టు స్పిన్నర్లు ప్రత్యర్థిని వణికించటం నిజంగా గొప్పే. వాళ్ల ప్రతిభ నమ్మశక్యంగా లేదు, అమోఘం. కొన్ని సార్లు పరుగులు సమర్పించుకున్నా. వికెట్లు పడగొట్టటంలో ఎలాంటి తేడా ఉండదు. ప్రస్తుత జట్టుకి స్పిన్నర్లిద్దరూ ప్రత్యేక ఆకర్షణ. వర్ణించాలంటే మాటలు దొరకటం లేదు. కానీ ఈ గెలుపు క్రెడిట్ వాళ్లకే దక్కుతుంది. ఇద్దరూ కష్టపడుతున్నారు. ఫలితం అందరం చూస్తున్నాం. దూకుడుగా బౌలింగ్ చేయటం కన్నా పరుగులిచ్చి పడగొట్టటమే మిన్న అని నేను అనుకుంటాను. ఎంచేతనంటే కొన్నిసార్లు దూకుడులో బౌలింగ్ టెక్నిక్ కోల్పోతాం. ఆట అలాగే కొనసాగితే పరాభవం తప్పదు. దక్షిణాఫ్రికాపై వరుసగా నాల్గు విజయాలు దక్కటం సంతోషం. ఇలాగే రక్షణాత్మక ఆటతీరునే కొనసాగిస్తాం. సఫారీ పర్యటన నిజంగానే కష్టమైనది. మేమేంటో నిరూపించుకున్నాం. మేం సిరీస్‌లో 3-0తో ఆధిక్యంలో ఉన్నందుకు సంతోషంగా ఉంది. ఇప్పుడు మేం సిరీస్ చేజార్చుకునే అవకాశమే లేదు. అయినప్పటికీ నాలుగో మ్యాచులో మేం మరింత తీక్షణతతో, పట్టుదలతో ఆడతాం.

తెలంగాణకు ఐదు పతకాలు

డబుల్స్ బ్యాడ్మింటన్‌లో బంగారు పతకం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఢిల్లీలో జరుగుతున్న 'ఖేలో ఇండియా' నేషనల్ స్కూల్ గేమ్స్-2018 పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు తమ సత్తాను చాటారు. వివిధ విభాగాల్లో మొత్తం ఐదు పతకాలు సాధించారు.

ఖేలో ఇండియా

జనవరి 31 నుంచి గురువారం వరకూ ఇందిరాగాంధీ స్టేడియంలో సాగిన ఈపోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి 11క్రీడా విభాగాల్లో 80 మంది ఎంపికైన క్రీడాకారులు పాల్గొన్నారు. గురువారం జరిగిన డబుల్స్ బాడ్మింటన్ పోటీల్లో విష్ణువర్ధన్‌గౌడ్, నవనీత్‌ల జోడీ 23-21, 21-16 స్కోర్‌తో కేరళ టీమ్‌పై విజయం సాధించి బంగారు పతకం కైవసం చేసుకున్నది. సింగిల్స్ బాడ్మింటన్ విభాగంలో సాయిచంద్ కాంస్య పతకం సాధించారు. 400 మీటర్ల పరుగు విభాగంలో శ్రీకాంత్ ద్వితీయస్థానంలో నిలిచి వెండి పతకం సొంతం చేసుకున్నారు. ఇప్పటికే వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో కార్తీక్, శివలింగేశ్వర్ రెండు బంగారు పతకాలు సాధించిన విషయం తెలిసిందే. కాగా పతకాలు సాధించిన క్రీడాకారులను సాట్స్ చైర్మెన్ వెంకటేశ్వర్‌రెడ్డి, సాట్స్ ఎండీ దినకర్‌బాబు అభినందించారు.



త్వరలో రిటైరవుతా

- శ్రీలంక పేసర్ లసిత్ మలింగ


మలింగ

న్యూఢిల్లీ : శ్రీలంక పేసర్ లసిత్ మలింగ త్వరలోనే రిటైర్‌మెంట్ నిర్ణయం ప్రకటించనున్నాడు. ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా బుధవారం మలింగ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'క్రికెట్‌కు ఆటకు మానసికంగా దూరమయ్యా. ఇక అంతర్జాతీయ క్రికెట్ ఆడతానని అనుకోవట్లేదు. అతి త్వరలో రిటైర్‌మెంట్ ప్రకటన చేయదలిచాను' అన్నాడు. ముంబయి ఇండియన్స్ విజయ ప్రస్థానంలో మలింగది ప్రత్యేక స్థానం. ఆ జట్టు ఆడిన 157 మ్యాచుల్లో 110 సార్లు మలింగ బరిలో దిగాడు.

'శ్రీలంక క్రికెట్ బోర్డుతో ఈ విషయం ఇంకా చర్చించలేదు. దేశవాళీ క్రికెట్ ఆడేందుకు నా శరీరం స్పందిస్తుందో లేదో చూడాలి. ఐపీఎల్‌లోనూ ఆటగాడిగా నా కెరీర్ ముగిసింది. ముంబయి ఇండియన్స్‌తో నూతన అధ్యాయానికి తెరతీయబోతున్నాను. ఇకపై నేను క్రికెట్ ఆడకపోవచ్చు. ప్రతి ఒక్కరికీ తాము రిటైర్‌మెంట్ ఎప్పుడు తీసుకోవాలో తెలిసిపోతుంది. ఎల్లకాలం ఆడలేం కదా. దిగ్గజాలు సైతం ఒకానొక సమయంలో విరమణ కోరిన వారే. ముంబయి ఇండియన్స్ నన్ను అట్టిపెట్టుకోకపోవటం ఆశ్చర్యం కలిగించలేదు. ఆ జట్టుతో పదేండ్ల సుదీర్ఘ ప్రయాణం నాది. రిటైర్‌మెంట్ యోచనలో ఉన్న నాకు బౌలింగ్ కోచ్‌గా ఎంపికవడం సంతోషంగా ఉంది. నాకిప్పుడు 34 ఏండ్లు. కుర్రాడిని కాదు కదా. కుర్రాళ్లను తీర్చి దిద్దేందుకు నా వంతు కృషి చేస్తాను.' అని మలింగ తెలిపాడు.

ఇంగ్లాండ్‌లో ఇరగదీస్తారు

- టీమ్ ఇండియా పేసర్లపై వసీం అక్రం


అక్రమ్

న్యూఢిల్లీ : భారత పేసర్ల తాజా ప్రదర్శనపై పాకిస్థాన్ దిగ్గజ పేసర్ వసీం అక్రమ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ ఏడాది ఇంగ్లాండ్ పర్యటనలో భారత పేస్ బృందం రాణిస్తుందన్న అక్రమ్.. మహమ్మద్ షమి రన్ అప్‌ను సరిచేసుకోవాలి, బుమ్రా కౌంటీ క్రికెట్ ఆడాలని సూచించాడు. ఒకప్పటి పేసర్లతో పోలిస్తే తాజా తరం పేస్ బౌలింగ్ మెరుగ్గా ఉందని ప్రశంసించాడు. 'షమి మంచి బౌలర్, కానీ కొన్ని సార్లు అతను పరుగెత్తడంలో వెనుకబడినట్టు అనిపిస్తాడు. ఒక ఫాస్ట్ బౌలర్‌గా మ్యాచ్ పరిస్థితులతో సంబంధం లేకుండా పరుగెత్తాలి. బ్యాట్స్‌మెన్ ముందడుగు (ఫ్రంట్ ఫుట్) వేయకుండా చూసుకోవాలి. బంతి విసిరేటపుడు సైతం షమి వేగం తగ్గించేస్తుంటాడు. సమమైన వేగంతో కచ్చితమైన అడుగులు వేస్తూ బౌలింగ్ చేస్తే.. అతడీ సమస్యని అధిగమించవచ్చు. మరో పదేండ్లు షమి బౌలింగ్ ఢోకా ఉండదు.' అని వివరించాడు. జశ్‌ప్రీత్ బుమ్రా కౌంటీ క్రికెట్ ఆడితే మెరుగవుతాడన్న మాజీ క్రికెటర్ మైకేల్ హోల్డింగ్స్ మాటలతో తాను ఏకీభవిస్తానని అక్రమ్ అన్నాడు. 'ఇంగ్లాండ్ పిచ్‌లపై బలంగా బంతిని వేయాలంటై ఆ గడ్డపై అనుభవం అవసరం అని మైక్ అన్నది నిజమే. బుమ్రాకు కౌంటీ క్రికెట్ ఆడితే ఆ అనుభవం ఉపకరిస్తుంది. టీ20 స్పెషలిస్టుగా క్రికెట్లో అడుగుపెట్టిన అతను టెస్టు ఫార్మాట్‌కు అలవాటు పడటానికి కొంత సమయం పడుతుంది' అని తెలిపాడు. భువనేశ్వర్ తన దృష్టిలో అత్యుత్తమ బౌలర్ అని తెలిపిన అక్రమ్.. దక్షిణాఫ్రికాలో అతని ఆట అమోఘమని కొనియాడాడు.

త్రీఆర్స్‌లో తిరోగమనమే..!

60రోజులు నిర్వహించినా ఫలితం అంతంతే!

- సర్కారు బడుల్లో మెరుగుపడిన టీచర్ల హాజరు
- బ్యాగు బరువుపై అవగాహన లేని ఉపాధ్యాయులు
- సీసీఈ విధానంపై భిన్నాభిప్రాయాలు : రాష్ట్ర పర్యవేక్షణ బృందాల పరిశీలనలో బహిర్గతం


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఎంతో ప్రతిష్టాత్మకంగా చదవులో వెనుకబడిన విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని నిర్వహించిన 'చదవడం, రాయడం, గుణించడం(త్రీఆర్స్)' నిర్వహణతో నామమాత్రపు ఫలితాలే వచ్చాయి. 60 రోజుల పాటు నిర్వహించినా, అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరలేదు. కార్యక్రమ ప్రారంభంలో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు దీనికి కొంత ప్రాధాన్యత ఇచ్చినా, దసరా సెలవుల తర్వాత పెద్దగా దృష్టిసారించలేదు. పాఠశాలల్లో అంత్యపరీక్షను నిర్వహించినా విద్యార్థుల తెలుగు, ఆంగ్లం, గణితాల సామర్థ్యాన్ని మాత్రం పూర్తిస్థాయిలో అంచనా వేయలేకపోయారు. తెలంగాణ రాష్ట్రంలో జనవరి 3నుంచి 9వరకు రాష్ట్ర స్థాయి పది పర్యవేక్షణ బృందాలు బడుల్లో తనిఖీలు నిర్వహించాయి. 31 జిల్లాల్లో 1226 పాఠశాలలను ఈ బృందాలు పరిశీలించాయి. వీటిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 510, హైస్కూల్స్ 426, కేజీబీవీలు 201, మోడల్ స్కూల్స్ 89 ఉన్నాయి. ఈ కమిటీ ఇటీవల పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్‌కు పూర్తిస్థాయి నివేదికను అందజేసింది. కమిటీ సభ్యులు పాఠశాలల తనిఖీల సందర్భంగా సీసీఈ విధానం, త్రీఆర్ నిర్వహణ, పుస్తకాల సంచి బరువు, టీచర్లు, విద్యార్థుల హాజరు తదితర అంశాలపై పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు ఆసక్తి కరమైన విషయాలు వెలుగుచూశాయి.

ఉపాధ్యాయుల హాజరుపై...

ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు రాష్ట్రస్థాయి సగటు 83శాతం ఉంటే, ఉన్నత పాఠశాలల్లో 84 శాతంగా ఉంది. గతంలో పోలిస్తే ఉపాధ్యాయుల హాజరు మెరుగుపడింది. కేజీబీవీల్లో ఉపాధ్యాయ హాజరుశాతం 88శాతం, ఆదర్శపాఠశాలల్లో 89శాతం ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో తక్కువ హాజరుశాతం గద్వాల(65శాతం), కామారెడ్డి (67శాతం) జిల్లాల్లో, సిరిసిల్లా(89శాతం), సంగారెడ్డి, మెదక్ (95శాతం) జిల్లాల్లో ఎక్కువ హాజరు ఉంది. హైస్కూల్స్‌లో రంగారెడ్డి (62శాతం) చివరి స్థానంలో ఉండగా, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్(95శాతం)తో ఎక్కువ హాజరుశాతం నమోదైంది. ప్రాథమిక స్థాయిలో సగటు హాజరు కంటే 9 జిల్లాల్లో తక్కువగా ఉండగా, ఉన్నత పాఠశాలల్లోనూ 9 జిల్లాల్లో తక్కువగా ఉంది. విద్యార్థుల హాజరు సగటు రాష్ట్రస్థాయిలో ప్రాథమిక పాఠశాలల్లో 80శాతం ఉండగా, హైస్కూల్స్‌లో 79శాతం ఉంది. ప్రాథమిక స్థాయిలో రాష్ట్ర సగటు కంటే హైదరాబాద్, రంగారెడ్డితో పాటు మరో 13 జిల్లాల్లో హాజరు తక్కువగా ఉంది. ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర సగటు కంటే పదిజిల్లాల్లో తక్కువగా హాజరుశాతం నమోదవుతుంది.

బ్యాగు బరువుపై అవగాహన కరువు

పాఠశాల స్థాయి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన బ్యాగు బరువు ఉత్తర్వులపై ఇప్పటికీ కిందిస్థాయిలో టీచర్లకు అవగాహలన లేదని పర్యవేక్షణ బృందం గుర్తించింది. కేజీబీవీల్లో 5 నుంచి పది కిలోల వరకూ బ్యాగులు ఉండగా, వీటిలో అవసరానికి మించి పుస్తకాలు ఎక్కువగా ఉన్నాయి. ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పది కిలోల బ్యాగులున్నాయి. ప్రైమరీ స్కూళ్లలో మూడు నుంచి ఆరు కిలోల వరకూ ఉంది. మేడ్చెల్ లాంటి జిల్లాల్లో కార్పొరేట్ సంస్థలు ఇచ్చిన నిఘంటువులు, జీకే పుస్తకాలు, నోటుబుక్కులు తదితర ఇతర వస్తువులు ఉన్నాయి. పెద్ద తరగతుల విద్యార్థులు వాళ్ల తమ్ముళ్లు, చెల్లెళ్ల స్కూల్ బ్యాగుల్లో వీరి పుస్తకాలు పెట్టడంతో చిన్నపిల్లలకు బ్యాగు బరువు ఎక్కువవుతున్నట్టు నల్లగొండ, యాదాద్రి, మేడ్చెల్ లాంటి జిల్లాల పరిశీలనలో వెలుగుచూసింది.

సీసీఈపై భిన్నాభిప్రాయాలు..

నిరంతర సమగ్ర మూల్యాంకనం(సీసీఈ) విధానంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సీసీఈ విధానంలో రికార్డు పని ఎక్కువైందనీ, పిల్లలు సొంతంగా రాయలేక పోతున్నారనీ ఉపాధ్యాయులు చెప్పారు. పిల్లల అనుపస్థితికి కూడా సీసీఈ అడ్డంకిగా మారిందని, ఇది కేవలం ప్రతిభావంతులకు మాత్రమే ఉపయోగపడుతుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. టీచర్లకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు కల్పించాలని, దీనికి ప్రధానోపాధ్యాయులు, టీచర్లతో కలిసి ఒక ప్రత్యేక విధానం తీసుకురావాలని కమిటీ కమిషనర్‌ను కోరింది. ఉపాధ్యాయులందరూ ప్రాజెక్టు పనులు, పుస్తక సమీక్షలు, రాత పనులు ఒకే సారి ఇస్తున్నారనీ, దీంతో ప్రాజెక్టులు చేయడానికి సమయం సరిపోవడం లేదనీ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. చదువుకోవడానికి సమయం సరిపోవడం లేదనీ, అప్పుడప్పుడూ గైళ్లలోనూ చూసి రాస్తున్నట్టు విద్యార్థులు బృందం అధికారులతో చెప్పారు. ఈ విధానంతో గతంలో మాదిరి బట్టీ పట్టడం లేదనీ, సొంతగా రాయగలుగుతున్నామని అభిప్రాయం వ్యక్తం చేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.